తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక


SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 08
January - 2025, Price Rs.20/-.

జనవరి 2025
వెల రూ. 20/-
పుటలు - 56




వైకుంఠఏకాదశి
(10-01-2025)

మత్పాదౌ శరణం వ్రజేతి చరణౌ సంసారసిన్ధుస్తదా
జానుం సంస్పృశతీతి జానుమపి పాణిభ్యాం స్వయం దర్శయన్।
శేషాద్రౌ జగతోఽస్య రక్షణధియాఽతిష్ఠద్దయాసాగరః
సశ్శ్రేయాంసి చతుర్భుజః కలయతాం శ్రీ శ్రీనివాసఃప్రభుః॥

తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారికి 2024, నవంబరు 28 నుండి డిసెంబరు 06 వరకు అంగరంగవైభవంగా వార్షిక కార్తికబ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండోమెంట్‌శాఖ మంత్రివర్యులు గౌ॥శ్రీ ఆనం రామనారాయణరెడ్డి మరియు అందులో పాల్గొన్న తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., తి.తి.దే.సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., మరియు శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.,
























# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమక్లేద్యోఽశోష్య ఏవ చ ।**
**నిత్యస్సర్వగతస్థాణు రచలోఽయం సనాతనః ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-24వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అయమ్= ఈ ఆత్మ; అచ్ఛేద్యః= ఛేదింపజాలడు; అయమ్= ఈ ఆత్మ; ఆదాహ్యః= కాల్చబడజాలడు; (మరియు)అక్లేద్యః= తడుపబడజాలడు; అశోష్యః ఏవ చ= ఎండింపబడజాలడున్ను; అయం= ఈ ఆత్మ; నిత్యః= నిత్యుడు; సర్వగతః= అంతటను వ్యాపించి ఉన్నవాడు; స్థాణుః= స్థిరస్వరూపుడు; అచలః= చలనం లేనివాడు; సనాతనః= అనాదియైనవాడు.

**భావం:** ఈ ఆత్మ ఛేదింపబడజాలడు, దహింపబడజాలడు, తడుపబడజాలడు, ఎండింపబడజాలడు. ఇతడు నిత్యుడు, సర్వవ్యాపి, స్థిరస్వరూపుడు, నిశ్చలుడు, పురాతనుడు.

---

## రావే రావే కోడలా..! పోవే పోవే అత్తయ్య!!

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతో జాలును

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్లవారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా

ఈడాడ నలుగురు నేగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకుఁ బదుగురి వలపించుకొని నీవు
ఆడాడఁ దిరిగేవు అత్తయ్యా

బొడ్డునఁ బుట్టిన పూపనికే నిన్ను
గొడ్డేరు తెస్తినే కోడల
గుడ్డముపయినున్న కోనేటిరాయని
నడ్డగించుకొంటి వత్తయ్యా

(శృంగార సంకీర్తన; సంపుటం-12; సంకీర్తన-313)



ఈ సంకీర్తనలో అత్తగారు విష్ణుమూర్తి భార్య లక్ష్మీదేవి. కోడలు బ్రహ్మగారి భార్య సరస్వతీదేవి. విష్ణువు నాభికమలంనుండి పుట్టాడు కాబట్టి బ్రహ్మగారి భార్య సరస్వతీదేవి లక్ష్మికి కోడలైంది. ఇలా అత్తాకోడళ్లైన వారిద్దరి దెప్పిపొడుపులే ఈ సంకీర్తన.

ఓ కోడలా! ఇలా రావే! ఓయ్ నిన్నే ఇటు రావే! అన్నది లక్ష్మి. అందుకు సరస్వతి పోవే అత్తయ్యా, ఫో.. ఫో.. నీ స్నేహం ఇక చాలు నాకొద్దే వద్దమ్మా!

ఓ కోడలా! ఇది వినవే. ఏ మాత్రం జంకులేక రాజులెదుట పెద్ద పెద్ద రంకెలు వేస్తావు నువ్వు. (కవులు రాజులెదుట తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు కాబట్టి ఆ దృష్టితో రాసి ఉంటాడు కవి.)

ఇదిగో ఓ అత్తయ్యా! నువ్వు మాత్రం బురదలో పుట్టి పద్మంలాంటి ముఖం కల్గిఉండి ఎంతోమంది ధనికుల ఇళ్లల్లో ధనం రూపంలో తిరగట్లేదా!

ఓ కోడలా! ఒక నిండుసభ ఉంటేచాలు అక్కడికెళ్తుంటావు నువ్వు. (విద్వత్‌సభలో అనేకమంది కవులనోట్లో వాగ్గేయరూపంలో కొలువై ఉంటుంది అని కవి భావన.)

ఓ అత్తయ్యా! నువ్వు మాత్రం తక్కువా ఏమి? కొంతమంది ధనికులపై మాత్రమే అనుగ్రహం ఒలక బోస్తూంటావు. (ధనికులచేతుల్లో మాత్రమే లక్ష్మి ఉంటుందని కవి భావన)

ఇదిగో కోడలా! బ్రహ్మచేసే పని సృష్టి చేయడం. ఆయనతో కలిసి జీవులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తావు కాబట్టి నిన్ను నా కోడలిగా తెచ్చుకున్నానే!.

ఓ అత్తయ్యా! నువ్వు మాత్రం శ్రీవేంకటేశ్వరుణ్ణే అడ్డగించి నీ వశం చేసుకున్నావు కదా! (నీకిక అడ్డేం ఉంది అని కవి భావన) అలా వీరిద్దరిగురించి పై సంకీర్తనలో ఎంతో చమత్కారంగా వర్ణించాడు అన్నమయ్య.






# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒక్కరోజు విరాళపథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవాడికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుపతి, తిరుచానూరులలో నిత్యం అన్నప్రసాదవితరణ చేస్తోంది. దీనికి ఎంతోమంది దాతలు విరివిగా విరాళాలు ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చునుకూడా భక్తులనుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులూ స్పందించండి! తోటివారి ఆకలి తీర్చండి!! మాధవుని అనుగ్రహాన్ని పొందండి!!!

### ఒకరోజు ఖర్చు..

| | | |
|---|---|---|
| 1) అల్పాహారం(టిఫిన్) | - | రూ.10 లక్షలు |
| 2) మధ్యాహ్నభోజనం | - | రూ.17 లక్షలు |
| 3) రాత్రిభోజనం | - | రూ.17 లక్షలు |
| మొత్తం | - | రూ.44 లక్షలు |

ఈ మొత్తాన్ని దాతలు
తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు
అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానేకాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులు సంయుక్తంగా కూడా విరాళాలు అందజేయవచ్చు.

దాతలు రోజువారి మొత్తం (రూ.44 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.10 లక్షలు) గానీ, మధ్యాహ్నభోజనం (రూ.17 లక్షలు) గానీ, రాత్రిభోజనం - (రూ.17 లక్షలు) గానీ ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. రోజువారి మొత్తం రూ.44 లక్షలు విరాళమిచ్చే దాతలకు రూ.25 లక్షలు ఇచ్చే దాతలకు కల్పించే సదుపాయాలు; అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం విరాళాలిచ్చే దాతలకు రూ.10 లక్షలు ఇచ్చే దాతలకు కల్పించే సదుపాయములను దాతలకు తి.తి.దేవస్థానములు కల్పించే సౌకర్యాలు ఒకే విధంగానే ఉంటాయి.

ఇందులో పాల్గొన్న భక్తదాతలకు వారు కోరినరోజున మాత్రమే భక్తులకు స్వయంగా వడ్డించే అవకాశం మరియు వారిపేరును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదవితరణకేంద్రంలో ప్రదర్శించబడుతుంది.



మరిన్ని వివరాలకు - ఉపకార్యనిర్వహణాధికారి (డోనార్‌సెల్), ఆదిశేషు గెస్ట్‌హౌస్, తి.తి.దే., తిరుమల. ఫోన్ - 0877-2263001, 2263472. మెయిల్ ఐడి- cdmc.ttd@tirumala.org



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 జనవరి, 2025 సంచిక : 08



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....



| | | |
|---|---|---|
| వైకుంఠవాసా.. గోవిందా!! | శ్రీ అనంతాత్మకుల రంగారావు | 07 |
| భోగభాగ్యాల భోగి | డా॥ పి.లలితవాణి | 09 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 12 |
| వారణమాయిరం | శ్రీ యం.వి.యస్. రామశేషు | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు | 17 |
| శోభనుగూర్చే రంగవల్లికలు | డా॥ మైలవరపు లలితకుమారి | 18 |
| మకరసంక్రాంతి | డా॥ పి.వి.ఉమాశశి | 20 |
| కోదై-గోదా | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 22 |
| గంగిరెద్దుల శ్రీహరి మన శ్రీనివాసుడే! | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 24 |
| తిరువెళ్ళుక్కుళమ్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| వారణాసి ప్రాముఖ్యత | డా॥ దేవులపల్లి పద్మజ | 31 |
| త్యాగం | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 33 |
| మాటే మంత్రము | ప్రొ॥ జి.వి.శేషారెడ్డి | 34 |
| జయ - విజయ | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 36 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 37 |
| కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు | డా॥ కే.యస్.ఇందిర | 38 |
| హరిదాసు | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 40 |
| పూలంగిసేవ | డా॥ ఎం.పురుషోత్తమాచార్య | 41 |
| గాలిపటము | శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు | 42 |
| భగవంతుడా..! భక్తుడా...!! | శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ | 44 |
| ఆరోగ్యపరిరక్షణకు గుమ్మడి ద్వయం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| సంక్రాంతి సంబరాలు (చిత్రకథ) | కథ : శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు<br>చిత్రాలు : శ్రీ కె.వి.కోటిలింగాచారి | 48 |
| బాలవినోదం | | 50 |
| మాండవ్యుడు | శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |



ముఖచిత్రం : ఆనందనిలయం, శ్రీవేంకటేశ్వరస్వామివారు, తిరుమల
వెనుకచిత్రం : శాంతినిలయం, శ్రీపద్మావతిదేవి, తిరుచానూరు


**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333




ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# తిరుమలలో ధనుర్మాసోత్సవాలు

అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక ఎత్తు- అన్నట్లుగా బ్రహ్మాండభాండాల్లోని సమస్తక్షేత్రాలన్నీ ఒక ఎత్తు, సప్తగిరీశుడు వెలిసి ఉన్న శ్రీవేంకటాచలక్షేత్రం ఒక ఎత్తు! ఈ మాట ముమ్మాటికీ నిజం. ఎందుచేతంటే! వేంకటాచలక్షేత్రంలో అణువణువునా, అడుగడుగునా ఒక విచిత్రం, ఒక అద్భుతం గోచరిస్తుంది. ఈ దివ్య క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామికి జరిగే ఉత్సవాలేనా, ఊరేగింపులేనా, నివేదన లేనా, ఇంకా ఆ పర్వతసానువుల్లో నెలకొన్న పుణ్యతీర్థాల మహిమలేనా... ఇలా శ్రీనివాసుని సన్నిధిలో దేన్ని పరిశీలించినా దేన్ని పరిశోధించినా వాటి అన్నింటిలోను ఒక ప్రత్యేకత స్పష్టంగా దర్శనమిస్తుంది. ఒక విశిష్టత అవగతమవుతుంది. ముఖ్యంగా ప్రతిఏటా డిసెంబరు 15వతేదీ నుంచి జనవరి 14వతేదీ వరకు ఒక్క నెలరోజులు పాటు తిరుమల క్షేత్రంలో నిర్వహింపబడే ధనుర్మాసోత్సవాలను గమనిస్తే చాలు. ఈ క్షేత్రప్రాధాన్యత మరింత అర్థమవుతుంది.

మార్గశిరం-పుష్యమాసాల్లో కలిసి వచ్చే ఈ ధనుర్మాసంలో నెలరోజులపాటు శ్రీనివాసుణ్ణి శ్రీకృష్ణుని గాను, వక్షఃస్థలవ్యూహలక్ష్మిని గోదాదేవిగా భావించి, రత్నాలు పొదిగిన బంగారుచిలుకను స్వామివారి వక్షఃస్థలంలో అలంకరిస్తారు. రాత్రి పవళింపుసేవలో భోగశ్రీనివాసమూర్తికి బదులుగా వెన్నముద్ద గోపాల కృష్ణుడు పాల్గొంటాడు. ఇక సుప్రభాతసేవలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతస్తోత్రానికి బదులుగా శ్రీగోదాదేవి తిరుప్పావై పాశురాలు పఠిస్తారు. ఆ తర్వాత శ్రీస్వామివారిని సహస్రనామాలతో తులసికి బదులు బిల్వ దళాలతో అర్చిస్తారు.

ప్రధానంగా ధనుర్మాసంలో పున్నమికి ముందు వచ్చే వైకుంఠఏకాదశి, ఆ మరునాడు ముక్కోటి ద్వాదశి పండుగలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయి. వైకుంఠఏకాదశినాడు తెల్లవారుజాము నుండి మొదలు 10 రోజుల పాటు శ్రీస్వామివారిని వైకుంఠద్వారదర్శనం చేసుకునే భాగ్యం కలుగుతుంది. ఆ రోజు ఉదయంపూట జరిగే శ్రీవారి స్వర్ణరథోత్సవాన్ని చూచితీరవలసిందేకాని వర్ణించడానికి మాటలు లేవు. చాలవు కూడ! ఆ మరునాడు ముక్కోటి ద్వాదశినాడు శ్రీస్వామిపుష్కరిణీ తీర్థముక్కోటి. ఈ రోజు సూర్యోదయానికి ముందే పుష్కరిణిలో శ్రీవారి చక్రస్నానం నిర్వహింపబడుతుంది. ఆ సమయాన బ్రహ్మాండంలోని సమస్తతీర్థాలన్నీ, శ్రీస్వామిపుష్కరిణిలో మునకలిడి భక్తుల వల్ల తమకు సంక్రమించిన పాపాలన్నింటి నుండి విముక్తిని పొందుతాయని ఈ క్షేత్రప్రశస్తి! అట్టి పరమ పవిత్రమైన స్వామిపుష్కరిణీస్నానం సర్వపాపహరం! సర్వసిద్ధిప్రదం!!

వైకుంఠఏకాదశినాటికి సరిగ్గా 6వ రోజున తిరుమలలో జరిగే రసవత్తర వేడుక 'ప్రణయ కలహోత్సవం'. వ్యాహ్యాళికో, వేటకో సరదాగా వెళ్లి తిరిగి వచ్చిన శ్రీస్వామిని అడ్డుకొంటూ, ఎక్కడెక్కడ ఎవరెవరితో తిరిగి వచ్చావో అంటూ శ్రీదేవి, భూదేవేరులు ప్రణయకలహంతో అడ్డుకుని సాగే ఈ ఉత్సవం అత్యంత రసరమ్యం. మరో విశేషం ఏమంటే వైకుంఠఏకాదశికి పదిరోజుల ముందుగా ప్రారంభమై, ఆ తర్వాత 15 రోజులపాటు ప్రతిరోజు సాయంసంధ్యలో శ్రీవారిసన్నిధిలో, శ్రీజియ్యంగార్ల పాశురపారాయణం చెవికింపుగా కొనసాగే అద్భుతమైన యజ్ఞం. ధనుర్మాసంలో చివరగా వచ్చే మరో అత్యంత ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగకు ముందురోజు భోగినాడు శ్రీవారికి భోగితేరు, సంక్రాంతికి మరునాడు కనుమపండుగనాడు ఉదయం శ్రీవారిసన్నిధిలో శ్రీగోదాకల్యాణం ఘనంగా నిర్వహింపబడుతాయి.

కనుమనాటి సాయంత్రం ఒక పల్లకిలో శ్రీకృష్ణస్వామివారు వెంటరాగా, మరో పల్లకిలో పంచాయుధాలను ధరించిన శ్రీస్వామివారు వేంకటపర్వతసానువుల్లో భక్తుల కోలాహలంతో పారువేటకు బయలుదేరి విజయయాత్రను ముగించుకొని తిరిగి ఆలయానికి వచ్చే 'పారువేట ఉత్సవం', భక్తుల మనస్సులను ఆనందామృతసముద్రంలో ఈతలు కొట్టించే ఈడు లేని ఏడుకొండలస్వామివారి ఉత్సవం ఇది! ఇలాంటివి ఎన్నో! ఎన్నెన్నో!!


ఇలాగ శ్రీవేంకటాచలక్షేత్రం అనేక విధాలుగా ప్రశస్తిని పొంది ఉన్నది.

ఓం నమో వేంకటేశాయ

# వైకుంఠవాసా... గోవిందా!!

- శ్రీ అనంతాత్మకుల రంగారావు, 79894 62679

**2025, జనవరి 10న వైకుంఠఏకాదశి సందర్భంగా...**



కృతయుగంలో శ్రీహరి అవతారమైన నరసింహమూర్తి, త్రేతా యుగంలో దశరథతనయుడు రఘురాముడు, ద్వాపర యుగంలో దేవాదిదేవుడైన వాసుదేవుడు, ఈ కలియుగంలో వేంకటేశ్వరుడు ప్రత్యక్షదైవాలు. అందుకే "ఏడుకొండలవాడా! గోవిందా" అనో "గోవిందా హరి గోవిందా" అనో భక్తుల నామస్మరణతో ప్రతిధ్వనిస్తూ, తిరుమల నిత్య భక్తసందోహంతో ఉంటుంది. తిరుమలలోని వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభీష్టాలను సిద్ధింపచేస్తూ, చాలా మందికి కులదైవంగా విరాజిల్లుతూ ఉన్నాడు.

వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న సప్తగిరుల్లో "వైకుంఠం" అనే కొండ ఉంది. దానికి చరిత్రకూడా ఉంది. అందుకే అన్నమయ్య ఒక కీర్తనలో- ***"కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ, తెట్టెలాయె మహిమలే తిరుమల కొండా!"*** అనే సంకీర్తనలో కలియుగ వైకుంఠధామంగా అభివర్ణించాడు.

వైకుంఠఏకాదశినే ముక్కోటిఏకాదశి అనికూడా అంటారు. సౌరమానంప్రకారం మార్గశిర-పుష్యమాసంలో వచ్చే శుక్లఏకాదశిని వైకుంఠఏకాదశిగా పాటిస్తూ ఉంటాం. వైకుంఠం శ్రీమహావిష్ణువు కొలువై ఉండే స్థానం. ఆ రోజును పురస్కరించుకొని తిరుమలఆలయంలో వైకుంఠనాథుని దర్శనం చేసుకోవాలని లక్షలాదిభక్తులు విచ్చేస్తారు. పునరావృత్తి లేనిది, శాశ్వతమైనది అయిన విష్ణుధామమే వైకుంఠం.

మధు- కైటభులు అనే రాక్షసులను శ్రీహరి సంహరించిన సందర్భంలో, వారు దివ్యరూపాలు ధరించి, దివ్యజ్ఞానంతో "దేవా! వైకుంఠవాసా! వైకుంఠ ఏకాదశిరోజున ఉపవాస దీక్షతో, భక్తిశ్రద్ధలతో, నిన్ను ఆరాధించే భక్తులు ఉత్తర ద్వారదర్శనం చేసుకొన్నవారికి "వైకుంఠప్రాప్తి" కలిగించుమని కోరారు. అప్పుడు శ్రీహరి "తథాస్తు" అని సంతోషంగా అనుగ్రహించాడు. అందుకే ఈ రోజుకు "మోక్షోత్సవదినం"గా కూడా పేరు.

ముక్కోటి దేవతల బాధలను, కష్టాలను నివారించిన ఏకాదశి కాబట్టి ముక్కోటి ఏకాదశి అయింది. ఈ రోజునే మహావిష్ణువు గరుడ వాహనంపై ముక్కోటిదేవతలతో భూలోకానికి సంచారం నిమిత్తం వస్తాడని అష్టాదశ పురాణాలు వివరిస్తున్నాయి. ఏకాదశి అంటే ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు కలిపి పది. మనసుతో పదకొండు. అంటే ఏకాదశి. ఈ అవయవాలతో పవిత్రమైన భక్తితో వైకుంఠుని సేవలో ఉంటే, పవిత్రత పొంది సుఖానుభూతి కలిగి, ఆఖరికి వైకుంఠం చేరతాడని శాస్త్రాలు చెబుతున్నాయి.

## ఉత్తరద్వారదర్శనం విశేషం

"ముర" అనే రాక్షసుడు పెట్టే చిత్రహింసలు పడలేక, బ్రహ్మ, దేవతలు అందరూ వైకుంఠంలోని

ఉత్తరద్వారంగుండా లోనికి ప్రవేశించి, శ్రీమహావిష్ణువు అనుగ్రహానికి గురైయ్యారు. అప్పుడు బ్రహ్మకోరికమేరకు ఉత్తరద్వారదర్శనం ప్రతీఏటా ముక్కోటిఏకాదశిరోజున ఉంటుంది అని శ్రీహరి వరమిచ్చాడు.

ఈ రోజునుండే సూర్యుడు ఉత్తరదిశగా ప్రయాణం ప్రారంభించి, ఉత్తరాయణపుణ్యకాలానికి నాంది పలికాడు. పైన చెప్పుకున్న మధు–కైటభుల కోరికమేరకు ఉత్తరద్వారదర్శనం కలిగించాడు మహావిష్ణువు. ఉత్తరద్వారదర్శనంవల్ల మనకు ఉత్తమగతులు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి మరియు ప్రజలు విశ్వసిస్తున్నారు.

## తిరుమలలో వైకుంఠఏకాదశి

కలియుగవైకుంఠమైన తిరుమల ఆలయంలో వైకుంఠ ఏకాదశి పండుగను ఘనంగా వైభవంగా నిర్వహిస్తారు. దశమి నాటి రాత్రి ఏకాంతసేవ అనంతరం బంగారువాకిలి మూసి వేస్తారు.


పిదప ఏకాదశిరోజున తెల్లవారుజామున సుప్రభాతసేవ మొదలుకొని తర్వాత పదిరోజులపాటు శ్రీవారి గర్భాలయానికి ఆనుకొని ఉన్న ముక్కోటిప్రదక్షిణమార్గం తెరవబడుతుంది. ఈ పదిరోజులపాటు భక్తులను వైకుంఠప్రదక్షిణం ద్వారా అనుమతిస్తారు. దీన్నే శ్రీవారి వైకుంఠద్వారదర్శనం అంటారు.

తిరుమలస్వామివారి ఆలయం మరియు ఈ ముక్కోటి ప్రదక్షిణమార్గం రంగురంగుల విద్యుద్దీపాలతోను, వివిధరకాల పూలమాలలతోను అలంకరించబడినందువల్ల భక్తులకు ఆహ్లాదకరంగా ఉంటుంది.


వైకుంఠఏకాదశి ఉదయం దేవేరులతో శ్రీస్వామివారికి స్వర్ణరథోత్సవం భక్తుల కోలాహలం మధ్య అంగరంగవైభవంగా జరుగుతుంది.

## గోవిందనామవిశిష్టత

ఏ దేవాలయాల్లో లేనివిధంగా తిరుమల గోవిందా! హరి గోవిందా! అనే భక్తుల నామస్మరణతో ప్రతిధ్వనిస్తుంది.



గోవుమీద గొడ్డలివేటు పడకుండా పుట్టలోని స్వామి అడ్డుకొని కాపాడాడు కాబట్టి, స్వామిని గోవిందా అని పిలుస్తారు.




"కొలిచి రక్షించే గోవిందుడితడు– ఇలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు" అని శ్రీకృష్ణావతారసన్నివేశాలలో వివరించారు. అంటే శ్రీవాసుదేవుణ్ణి పూజించినా, ఆయన వెంటే లక్ష్మీప్రసన్నతకూడా కలుగుతుంది.

ఇంతటి విశేషమైన తిరుమల– *"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన। వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥"* అని పురాణాలు చెబుతున్నాయి.



ఇతరుల బలహీనతలతో ఆడుకోకు. నువ్వే బలహీనుడైపోతావు!

# భోగభాగ్యాల భోగి

**2025, జనవరి 13న భోగిపండుగ సందర్భంగా...**

భోగి అనేమాట భుగ్‌- అనే సంస్కృతపదంనుండి వచ్చిందని చరిత్ర చెప్తోంది. భోగం- అంటే సుఖం. అనుభవం. పవిత్రం. శుభం. శ్రీరంగనాథస్వామిలో గోదాదేవి లీనమైపోయి భోగాన్ని పొందిందని పురాణోక్తి. అందుకు సంకేతంగా ఆ రోజును భోగి అంటారు. ఈ రోజున ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం వైభవోపేతంగా చేస్తారు. శ్రీమహావిష్ణువు వామనుడిగా వచ్చి- బలిని అణచివేసింది భోగినాడే. శ్రీకృష్ణుడు- గోవర్ధనపర్వతాన్ని ఎత్తి, గోవులను, గోపాలకులను రక్షించింది భోగినాడే. పరమేశ్వరుడు- రైతులకోసం నందిని భూమికి పంపింది భోగినాడే. ఇన్నిటివలన భోగి పవిత్రదినంగా భాసిస్తోంది.

సంక్రాంతి మనకు చాలా పెద్దపండుగ. నాలుగురోజులపండుగ. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ. సంక్రాంతికి ముందురోజు, దక్షిణాయనంలో చివరిరోజు- భోగి.

భోగినాడు తెల్లవారకముందే లేచి, ముందుగా చలిమంటలు వేసుకుంటారు. ఈ భోగిమంటలకున్న ప్రాశస్త్యం అంతా ఇంతా కాదు. దీని ప్రథమ, ప్రధాన ప్రయోజనం ఆరోగ్యసిద్ధి. ఈ మంటలలో కట్టెలు, పిడకలు, పాతవస్తువులు, పాతచెక్కవస్తువులు వేస్తారు. అంతేనా! పాతచీపుర్లు, పాతచేటలు వేసి- అరిష్టాలను పోగొట్టుకుంటారు. ఇక్కడ మనం ఒక అంతరార్థాన్ని గ్రహించాలి. మనలోని మాలిన్యాన్ని మంటల్లో కాల్చివేసి- మనసుని నిర్మలంగా ఉంచుకుని సర్వదా సత్ప్రవర్తనను అలవరచుకోవాలనేదే- ఈ చలిమంటల పరమార్థం. అదే ఈ చలిమంటలలో ఇమిడిఉన్న సందేశం. రావి, మామిడి, మేడి, వేప, చింతచెట్ల కలపను ఈ మంటల్లో వేస్తారు. ఇవన్నీకూడా ఔషధవృక్షాలే. వాటితో కలిసిన గాలి- ఔషధయుతమవుతుంది. ఆ గాలి పీల్చిన మనకు అన్నిరకాల ఔషధాలు అంది ఆరోగ్యం చేకూరుతుంది. పిడకలు కాలడంవలన గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మక్రిములు నశిస్తాయి. దీనినుండి వచ్చే పొగ మనకు రోగాలు రాకుండా కాపాడుతుంది. ముఖ్యంగా శ్వాసకోశరోగాలు అంటకుండా రక్షణనిస్తుంది. అంతేకాదు. ఈ కాలం చలికాలం. ఒకరకంగా సంధికాలం. ఆ సమయంలో వణికించే చలి ఉంటుంది. ఆ చలిని తట్టుకోవడానికి శరీరాన్ని వెచ్చగా కాచుకోవడానికి ఈ భోగిమంటలు వేసుకుంటారు. అటు అగ్నిదేవుని, ఇటు వాయుదేవుని ఆరాధించినట్లు అవుతుంది. ఇరుగుపొరుగు వారందరూ కలిసి ఈ మంటల్లో చలి కాచుకుంటారు. ఇది ఐకమత్యానికి ఆలవాలం.




- డా॥ పి.లలితవాణి,
98490 26107



తెల్లవారాక తలంటుకుని, క్రొత్తబట్టలు కట్టుకుని, పూజ చేసుకుని, పండుగ చేసుకుంటారు. చిన్నపిల్లలకు **భోగిపళ్ళు** తలమీద పోసి ఆశీర్వదిస్తారు. రేగుపళ్ళు, శనగలు, పూలు, నాణేలు కలిపి పోస్తారు. ఇదీ ఆయురారోగ్యాలకే. నిజానికి మన పండుగలన్నీ కాలానికి అనుగుణంగా ఆరోగ్యాన్ని అందించ డానికే పెట్టారు మనవాళ్లు. ఏ పండుగైనా ఆ ఋతువుకు సంబంధించే ఉంటుంది. ఈ చలికాలంలోనే రేగుపళ్ళు వస్తాయి. అవి చిన్నవారి తలకు తగిలితే ఆరోగ్యం. అందుకే తలమీద పోస్తారు. పిల్లలకు దిష్టి తగలకుండా, బాలారిష్టాలు తొలగి, ఆయురారోగ్యాలు అందుతాయి. ఒకవైపు ఆనందం, మరో వైపు ఆరోగ్యం, ఇంకోవైపు ఆశీర్వాదం. ఈనాడు పిల్లలకు అందే ఆశీస్సులు- సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు ఆశీస్సులుగానే విశ్వసిస్తారు.

సాయంకాలం- బొమ్మలకొలువు పెట్టుకుంటారు. బొమ్మలకొలువులో అనేకవరుసల్లో దేవతామూర్తులను, వన జీవులబొమ్మలను, పుష్పగుచ్ఛాలను, కృత్రిమజలపాతాలను, మరెన్నో రకరకాల బొమ్మలను అమరుస్తారు. పేరంటాళ్ళను పిలిచి వాయనాలిచ్చి అందరూ కలిసి ఆనందాన్ని పంచుకుం టారు. ముత్తైదువులకు వాయనమివ్వడమంటే ప్రత్యక్షంగా గౌరీమాతను పూజించటమే. దీనివలన ఇంటికి కొత్తకళ, శోభ కలుగుతాయి. అందం రెట్టింపవడమేకాక- దిష్టిపోతుంది. బొమ్మలకొలువును తీర్చాక హారతిచ్చి నమస్కరిస్తారు. చిన్నపిల్లల చేత, కన్నెపిల్లలచేత ఈ బొమ్మలకొలువును పెట్టిస్తారు. కన్నెపిల్లలకు భగవంతుడివంటి భర్త లభిస్తాడన్న నమ్మకమే- బొమ్మలకొలువు ప్రయోజనం.

హరినామస్మరణచేస్తూ హరిదాసులు వీథి వీథీ తిరిగి ధాన్యాలు, కానుకలతో తృప్తి చెందుతారు. హరిదాసులకు చేసే దానంతో శ్రీహరి ఆనందిస్తాడని ఆర్యోక్తి. మానవసేవే మాధవ సేవ- కదా. ఎద్దులను నందీశ్వరునిలాగా భావిస్తూ మనో హరంగా అలంకరించి, ఇంటింటికి తిప్పి, బసవన్నలచేత ఆడించి- బట్టలు, పశుగ్రాసం, ధనధాన్యాలను బహు మానాలుగా గ్రహిస్తారు. ఈనాడు హరిదాసులకు, గంగిరెద్దుల వారికి చేసే దానధర్మాల పుణ్యం ఏటికేడాదీ ఉంటుందనీ, తత్ఫలం తరువాతి తరాలవారికీ లభిస్తుందని పెద్దలమాట. "పెద్దలమాట పెరుగన్నంమూట" అన్నారుగా. అంటే చలువ చేస్తుందని. వారి మాటలను పాటిస్తే అందరికీ శుభస్కరమే.

భోగిపండుగను దేవేంద్రుని ఆరాధించేవిధంగా జరుపుకుంటారు. వర్షాలను కురిపించేది దేవేంద్రుడే. మూడు కాలాలలోను వానలను కురిపించి- రైతులకు ఆనందం, లోకానికి ఆహారం, అందరికీ ఆహ్లాదం కలిగించేది ఇంద్రుడే. అందుకే ముఖ్యంగా రైతులు ఇంద్రుని పూజిస్తారు. పంటలు చేతికి అందివచ్చే కాలమిది. అందుకే ఈ పండుగను మహేంద్రో త్సవం అనీ, రైతులపండుగ అనీ, పంటలపండుగ అనీ అంటారు.

పిండివంటల ఘుమఘుమలు, కొత్తబట్టల తళతళలు, పిల్లల ఆటపాటల కేరింతలు, కలకలలు, గలగలలు, ఆనందం, ఆరోగ్యాలతో బ్రతుకు పండినట్లవుతుంది. భోగిపండుగ ఇంత కోలాహలంగా ఉంటుంది.

భోగి- భక్తిపూర్వక, ఆనందదాయక, అనుభవాత్మక, యోగదాయక, సుఖప్రద, పవిత్రయుత, భోగదాయక, భాగ్య దాయక శుభప్రదమైన పండుగ.



ఇతరులకు అబద్ధాలు చెప్పి ఆత్మవంచన చేసుకోకు. ఆత్మవిమర్శ చేసుకో!

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

ఆ పై మునులు, “స్వామీ! వేదాంత వేద్యుడైన వేంకటేశార్చనవైభవాన్ని మీరు తెలుపరా?” అని ప్రశ్నించారు. ‘నిజమే! కపిలమహాముని శేషునితో ఒకసారి ఈ ప్రస్తావన తెచ్చాడు. అపుడు హరికి ప్రీతికరమైనదీ, రహస్యమైనదీ, పాపహారకమైనదీ గురుతరమైనదీ స్వామి అష్టోత్తరశతనామావళితోడి సుమకైంకర్యమనే పూజావిధానాన్ని కూడ ఉపదేశించాడు. ఆ కపిలుడే నాకు ఈ అష్టోత్తరశతనామావళీసహిత పూజావిధానం చెబితే మీకు విశదం చేశానని’ ముగించాడు.

సూతుడు నైమిశారణ్యమునులకు వేంకటాద్రిని గురించి శ్రీనివాసకైంకర్యవిధానం గురించి సమగ్రంగా చెబుతుంటే మునులు వేంకటాద్రిని దర్శించాలనుకొని సూతునితో తమ కాంక్షను సువ్యక్తం చేశారు.

## నైమిశారణ్యమునులు వేంకటాద్రి చేరుకోవడం

సూతమహర్షి వెనువెంటనే “మునులారా! నా పౌరాణికప్రవచనం సార్థకమయింది. మీ ఉత్సాహాన్ని గుర్తించాను. ఆలస్యం చేయక ఇప్పుడే బయలుదేరండి. గిరిశిఖరాలను దర్శించండి. వేంకటాద్రి వైభవాన్ని తనివితీరా చూడండి. పుణ్యతీర్థాల్లో స్నానం చేయండి. భూవరాహస్వామిని సేవించండి.” అని అనుమతిచ్చాడు. సూతుడు తమ ప్రయాణానికి అనుమతి ఇవ్వగానే గౌతమ, జాబాలి, కశ్యప, అంగీరస, శ్రీవత్స, కౌత్స, మైత్రేయ, కణ్వ, గార్గేయ, మృకండ, భరద్వాజ, కౌశిక, దేవల, క్రతు, పులస్త్యాదులు యాత్రకు సన్నద్ధులయ్యారు.

గంగలో స్నానం ముగించారు. గౌతమిలో మునిగారు. కృష్ణలో మునకలు వేశారు. మార్గమధ్యంలోని అనేక తీర్థాదులలో అవగహనం చేశారు. స్వామిని దర్శించాలనే తపనతో పావనతీర్థం కపిలతీర్థం చేరుకొన్నారు. ఆ తీర్థాదులలో పవిత్రస్నానం చేసి సామగానం చేస్తూ స్వామిపుష్కరిణిలో మునకలేసి ఆ పై శ్రీనివాసుని దర్శించారు.

మునుల ఆనందం వెలకట్టలేనిది. కొందరు జడలు కదులుతుంటే ఆడేవారు. తెలియని ఆనందపారవశ్యంతో ఎగిరేవాళ్లు. ఆవేశంతో చిందులు త్రొక్కేవారు. స్వరసంయుక్తంగా వేదసూక్తులు వల్లించేవారు. వీరందరు బంగారువన్నెపూలతో స్వామిని నూటెనిమిది దివ్యనామాలతో సేవించారు. మునులరాకకు వారి భక్తిప్రదర్శనకు శ్రీనివాసుడు పరవశుడై మునులకు ప్రత్యక్షమయ్యాడు.

“మునివరులారా! మీరు ఇక్కడికి రావడంతో మీరు బహుభక్తిపూర్ణులని అవగతమైంది. మీ భక్తికి సంతోషించాను. మీకేమి వరం కావాలో కోరుకోండి. ఆ వరాలను అనుగ్రహిస్తా”నన్నాడు. మునులు స్వామి సాక్షాత్కారానికి, వరానుగ్రహసరణికి ఎంతో సంతోషించారు.

‘పరబ్రహ్మస్వరూపా! వాఙ్మనసాతీతుడవు, వైకుంఠవాసుడవైన నీవు వేంకటగిరిలో నెలకొన్నావు. నిన్ను, నీ రూపాన్ని మనసా దర్శించేవారము. ఐనా ప్రత్యక్షంగా మీ దివ్యమంగళవిగ్రహాన్ని కనులారా వేంకటగిరిలో దర్శించగలిగాం. పుణ్యఫలితం దక్కింది. మాకు వరాలెందుకు? మాకు మోక్షమార్గం చూపించు. అదే మేము కోరే వరం. వేరేవీ మేము కోరము” అన్నారు.

స్వామి మునులను చూచి సంతృప్తుడై “మునులారా! మీరు సామాన్యులు కారు. పరిపూర్ణకాములు. మీరు మహాముఖ్యులు. మీరు జగత్పావనులు. మీరు కనుకనే వరమేది వద్దని స్పష్టం చేశారు. పరమశాంతులు కనుక లౌకికులు కోరే వరాలను ప్రస్తావించలేదు. మనస్సులోని మీ అభిప్రాయం తెలియడానికోసం నేను అలా ప్రశ్నించాను. మీ నిష్కామత్వం నన్ను పరవశింపజేసింది. మీరు కోరినట్లుగానే మోక్షం ప్రసాదిస్తాను. అన్నాడు.

*(ఇంకా ఉంది)*

ప్ర) నవవిధభక్తిమార్గాల్లో ఏది ఆచరణీయమైనది ?

జ) "శ్రవణం కీర్తనం
విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం
సఖ్యమాత్మనివేదనమ్"

అని భక్తి తొమ్మిదివిధాలు. త్రికరణ శుద్ధితో ఏ భక్తిమార్గాన్ననుసరించి ఐనా మోక్షం పొందవచ్చు. మనోవాక్కాయములను ఒక్కచోట నిలిపి భక్తిశ్రద్ధలతో పరమాత్మను సంస్మరించుటయే ముక్తి హేతువు. కృతయుగాన తపస్సుద్వారా, త్రేతాయుగాన యజ్ఞాలద్వారా, ద్వాపరమున అర్చనంద్వారా భగవంతుని సేవించి ముక్తిని పొందారు భక్తులు.

"కలౌ స్మరణాన్ముక్తిః" అన్నారు. కలియుగంనందు స్మరణనుమించిన భక్తి సాధనం మరొకటి లేదు. భగవంతుని చేరుకోవటానికి ఇది అత్యంత సులభ మార్గం. సర్వకాలసర్వావస్థల్లోనూ మనసులో సదా భగవన్నామం స్మరించుకోవటమే నేటికాలానికి ఆచరణీయమని చెప్పొచ్చు.

ప్ర) ఇంటిలో శ్రీచక్రమును ఉంచుకోవచ్చా? మూలమంత్రమును జపించవలెనా?

జ) ఇంట్లో శ్రీచక్రమును ఉంచుకోవచ్చు. అమ్మవారి సూక్ష్మశరీరరూపమే శ్రీచక్రం అనే భావనతో పూజిస్తారు. శ్రీచక్రాన్ని ఇంట్లో పెట్టుకుంటే మనశ్శాంతి కలగటమే కాక ఆర్థికబాధలు తొలగిపోతాయని, దుష్ట గ్రహపీడలు తొలగి కష్టాలు తొలగుతాయన్న నమ్మకం. శ్రీచక్రాన్ని పరిశుభ్రమైన ఒక ప్రత్యేకమైనగదిలో ఏర్పాటుచేసుకొని నియమనిష్ఠలతో అర్చించాలి. షోడశోప

# సందేహాలు



# సమాధానాలు


- శ్రీమతి యం.గీతాకుమారి

చారాలతో పూజచేసి, 'శ్రీమాత్రే నమః' అంటూ కుంకుమతో అర్చనచేసి బెల్లంగాని, పండుగాని, పాలుకానీ నివేదన పెట్టాలి. శుక్రవారంనాడు శ్రీచక్రమును శుభ్రంగా కడిగి, అభిషేకించి నివేదనను సమర్పించుకోవాలి. 'శ్రీమాత్రే నమః' అనే మూల మంత్రమును నిత్యము జపించుకోవచ్చు. తాకకూడనిరోజులలో శ్రీచక్రమును తాక కూడదు. నియమనిష్ఠలతో పూజిస్తే తప్పక ఫలితం పొందగలరు. ఈ యంత్రాన్ని రాగి రేకుమీద వేయించుకొని పెట్టుకోవాలి. మంత్రసిద్ధి పొందినవారిదగ్గరనుంచి ఈ యంత్రాన్ని తీసుకుంటే ఫలితం కలుగుతుంది అన్నది పెద్దల ఉవాచ.

ప్ర) మహాభారతంలో అభిమన్యుని చంపిన ప్రదేశం పద్మవ్యూహం ఇప్పుడు ఎక్కడ ఉన్నది?

జ)మహాభారతంలో కురుపాండవసంగ్రామం కురుక్షేత్రంలో జరిగింది. భీష్ముడు హతుడైన తర్వాత సైన్యానికి ద్రోణుడు నాయకత్వం వహించాడు. యుద్ధంలో పద్మవ్యూహాన్ని రచించాడు. దీనినే చక్ర వ్యూహం అనికూడా అంటారు. దీనిని ఛేదించగలశక్తి శ్రీకృష్ణునికి, అర్జునునికి, ప్రద్యుమ్నునికి మాత్రమే ఉంది. ఆ సమయంలో అర్జునుడు మరొకదిక్కున యుద్ధానికి వెళ్లి ఉన్నాడు. పాండవులెవ్వరికీ పద్మవ్యూహంను ఛేదించటం తెలియదు. ఒక్క అభిమన్యుడికి మాత్రమే పద్మవ్యూహప్రవేశం తెలుసు కానీ నిష్క్రమణం తెలియదు. అభిమన్యుడు తాను ఛేదిస్తానని బయలుదేరగా, పాండవులు తాము అభిమన్యుని వెన్నంటి వస్తామని అన్నారు. యుద్ధంలో అభిమన్యుడు విహారం చేశాడు. ఎవరూ అతణ్ణి నిలువరించలేకపోయారు. చివరకు కౌరవ శ్రేష్ఠులు అందరూ కలిసి అభిమన్యుని సంహరించారు. ఆనాడు అభిమన్యుని సంహరించిన ప్రదేశము నేడు ఢిల్లీకి ఉత్తరదిక్కుగా 170 కిలోమీటర్లదూరంలో హర్యానారాష్ట్రంలో ఉన్నదని అంటారు. దీనికి బ్రహ్మక్షేత్రము, కురుక్షేత్రము అనే పేర్లుకూడా ఉన్నాయి.

## గోమాత ప్రార్థన



గావో మేమాతరస్సర్వా।
గావోమే పితరస్సదా।
గావో మమాగ్రతస్సంతు।
గావోమే సంతు పృష్ఠతః।
గావోమే పార్శ్వతస్సంతు।
గవాంబృందే వసామ్యహం॥

2025, జనవరి 15న
శ్రీగోదాదేవి పరిణయోత్సవం సందర్భంగా...

# వారణమాయిరం

- శ్రీ యం.వి.యస్.రామశేషు







"వారణమాయిరం" అంటే "వెయ్యిఏనుగులు" అని అర్థం. వెయ్యి ఏనుగులు వెంటరాగా భద్ర గజాన్ని అధిరోహించిన శ్రీరంగనాథుడు తనను వివాహం చేసుకోవడానికి వచ్చినట్టుగా కల వచ్చిందన్న విషయాన్ని గోదాదేవి తన చెలికత్తెలకు చెప్పటం వారణమాయిరం పాశురాల్లో విశేషంగా చెప్పబడింది. అవే ఇవి–

కలగంటిన్ కలగంటినమ్మ చెలియా! కళ్యాణి! వెయ్యేన్గులో
ప్పులకుప్పల్ తనవెంట గొల్చుచునురా ప్పుల్లాబ్జనేత్రుండు వ
చ్చె, లసత్తోరణ పంక్తులైన నగరశ్రీ వేల బంగారు కుం
డలతో మంగళవాద్య ఘోషములతోడన్ స్వాగతింపన్ సఖీ!

ఓ చెలీ! నగరమంతా మామిడితోరణాలు కట్టి, అప్సర సాంగనలు వెంటరాగా, పురోహితులు వేదమంత్రాలతో నిండు బంగారుకలశాలతో ఎదురురాగా వెయ్యిఏనుగుల పెద్ద ఊరే గింపుతో, మంగళవాయిద్యఘోషలతో ఆ శ్రీమన్నారాయణుడు నన్ను వివాహమాడటానికి వచ్చాడు.

అరటుల్, గుత్తుల పోకమ్రాకులును, పూలైయల్లు నాపెండ్లి పం
దిరికిన్ వచ్చెనతండు యౌవన సుధాదీపమ్ము గోవిందుడున్
హరియున్ మాధవుడంచునున్ పిలిచిరమ్మా వాని వేపేర్లతో
అరయన్ వానికి నాకు పెండ్లి సమయమాసన్నమయ్యెన్ సఖీ!

గెలలు నిండిన అరటిచెట్లు, గుత్తులతో నిండిన పోక చెట్లతో, పూలతోరణాలతో అందంగా అలంకరించిన పెళ్ళి పందిరిలోకి మాధవుడు పెళ్ళికుమారుడుగ గోవిందుడు, హరి అనే పేర్లతో పిలువబడుతూ అడుగుపెట్టాడు.

సాంద్రప్రీతి శచీపురందర వసిష్టారుంధతుల్, రోహిణీ
చంద్రుల్, వాణి హిరణ్యగర్భు, లగజేశానుల్ మహాత్ముల్, దయా
సింధుల్ వచ్చిరి, మందహాసములు విచ్చెన్ కౌముదీ వల్లరీ
సౌందర్యమ్ములు వెల్లివారినవి అచ్చమ్మైన ఆనందముల్

శచీపురందరులు, వసిష్ఠారుంధతులు, రోహిణీ చంద్రులు, వాణీహిరణ్యగర్భులు, మహాత్ములు అందరూ మందహాసంతో, ప్రేమతో నన్ను దీవించటానికి రాగా, అప్పుడు వెన్నెల వచ్చినట్లుగా వెన్నెలవెలుగులు వెల్లివిరిసినట్లుగా అనిపించింది.

దేవతలెల్ల బంధువులు దీప్తముఖుల్ పలుజంట జంట లే
వేవియొ మాటలాడుచు మరేమియొ పెండ్లిపనుల్ పొనర్చుచున్
మా వయిపే కనుంగొనుచు మమ్మును గూర్చియె ఊసులాడుచున్
పూవుల నీరు చల్లు చటు పోవుచు వచ్చుచు సందడింపగన్

దేవతలు, బంధువులు, పలుజంటలు అందరూ ఏవేవో మాటలాడుతూ ప్రకాశమానమైన ముఖాలతో పెండ్లిపనులు చేస్తూ మా గురించి మాటలాడుకుంటూ వచ్చినవారిపై పూలనీరుచల్లుతూ మమ్మల్ని పొగుడుతున్నారు.

నారాయణ సహోదరి లలితాంగి ప్రణయిని దుర్గమ్మ
గారాపుటాడుబిడ్డ నను ముద్దాడి కౌగలించుకొని
పారిజాత సుమాలమాలతో శుభాభరణాలతో మ
హాలక్ష్మివోలె నలంకరించిన దారాటపడుచు

నారాయణ సహోదరి లలితాంగి ప్రణయిని గారాల ఆడుబిడ్డ దుర్గమ్మ నన్ను ముద్దాడి కౌగిలించుకొని పారిజాత సుమాలమాలతో, శుభాభరణాలతో మహాలక్ష్మిలాగా నన్నలంకరించింది.

ఘలుఘల్లంచును కాలియందియలు మ్రోగన్ మందయానమ్ములన్
మొలకల్‌దేరెడు నవ్వులున్ పలుకరింపుల్ జంటలై సాగగన్
జిలుగుం బంగరు మంగళారతులతో చెల్వారు బంగారు బిం
దెలతో మాకెదురుంగ వచ్చిరదె కన్నెల్ పొంగులందమ్ములై

ఘల్లుఘల్లని కాలిఅందియలు మ్రోగుతుండగా, మెల్లనైన నడకలతో, చిరునవ్వుల పలకరింపులతో, బంగారుబిందెలతో, మంగళహారతులతో కన్నెలంతా మాకు ఎదురుగా వచ్చారు.

కలభశ్రీ తొలుకాడు క్రొత్తనడలన్ కళ్యాణవైభోగ మాం
గలికాహార్యము చిత్రవర్ణ సుషమా క్రమమ్ముగా నెంతయున్
తొలి చైతన్యపు లేత సవ్వడులు చిందుల్ ద్రొక్కు పాదూద్వయీ
లలితుండై హరి వచ్చెనే హృదయనేత్ర ద్వంద్వ పర్వమ్ముగన్

చిత్రమైన పువ్వులను ధరించి, కల్యాణవైభవము కదలాడుతుండగా, శుభకరమైన మాలలను ధరించి, చిందులు తొక్కే అడుగులతో లలితుడైన హరి నా హృదయనేత్రాలకు ఆనందం కలిగిస్తూ వచ్చాడు.

నలుదిక్కుల్ గల నాల్గుసంద్రముల నానా పుణ్యకల్లోలినీ
జలముల్ చల్లిరి స్వస్తిమంత్ర విహిత స్వానుల్ ద్విజుల్ మా పయిన్
లలనా! నీరద నీలకాంతి లలితున్ లావణ్య సోభావధిన్
జలజాక్షున్ నను ప్రక్కగా నిలిపి రక్షాసూత్రముల్ కట్టిరే

నాలుగుదిక్కులనుంచి పవిత్రజలాలు తీసుకొనివచ్చి పురోహితులు అందరూ వేదమంత్రాలతో, పుణ్యవచనాలతో దీవిస్తూ నీలమేఘచ్ఛాయగల సుందరరూపుడు, పరమపావనుడైన ఆ శ్రీమన్నారాయణుని ప్రక్కన నన్ను నిలిపి రక్షాసూత్రముల కంకణధారణ చేయించారు.

ఆయన కాళ్ళను కడిగిరి
మా యమ్మ యొసంగు నీట మా నాయనగా
రాయనకు బటువు పెట్టిరి,
భూయః ప్రీతిగను ధారవోసిరి నన్నున్

నా స్వామికాళ్లకు మాయమ్మ నీరు పోస్తూండగా మా నాయనగారు ఆయన కాళ్ళను కడిగి, బొట్టుపెట్టి పరమప్రీతితో ఆ శ్రీమన్నారాయణునకు నన్ను ధారపోశారు.


బిడియము తేర జీలకర బెల్లము పెట్టితి స్వామి మాడునన్
బిడియము త్రోసి స్వామియును పెట్టెను నాదగు మాడుపైన, తా
నెడపక మంత్రపూతముగ నిచ్చిన సన్నని దర్భత్రాడు నా
నడుముకు గట్టె స్వామి తన నా ప్రణయమ్ముల నొక్క కట్టడిన్

ఆ తర్వాత స్వామిమాడుపై నేను జీలకర్ర బెల్లము పెట్టాను. స్వామికూడ నా మాడుపై పెట్టాడు. ఆపై మంత్ర పూతంగా ఇచ్చిన దర్భత్రాడును స్వామి మా ఇరువురి ప్రణయములను ఒక్కటిగజేసి నా నడుమునకు కట్టాడు.

చిరునవ్వుల్ కలబోయుచున్ గురువు లాశీరక్షతల్ జల్లగా
కురియన్, మంగళవాద్యముల్ మొరయ నాకున్ పుస్తెలన్ గట్టె సుం
దర బాహుండగు స్వామి నా కనులలోనన్ గన్నులన్ గల్పుచున్
పెరిమన్ నా మెడమీద చిత్రగతులన్ వ్రేళుల్ చలింపన్, సఖి!

గురువులు ఆశీస్సులతో అక్షతలు చల్లగా, మంగళ వాద్యములు మ్రోగుతుండగా, అందమైన బాహువులున్న స్వామి చిరునవ్వులు చిందిస్తూ, నా కన్నులలో కన్నులను కలుపుతూ, ప్రేమమీరగ తనవ్రేళ్ళు నా మెడమీద తగులుతుండగా మంగళ సూత్రమును కట్టాడు.

ఇల జన్మమ్ము లవెన్నియేని యగు గానీ జన్మజన్మానికిన్
లలనా! తానె శరణ్యుడైన హరి లీలామూర్తి తా నాదు కా



ఱుల జేపట్టుక మట్టెలం దొడిగె వ్రేళుల్ కందిపోవంగ, న
వ్వులతో నొవ్వులదీర్చు స్వామి చిలికింపుల్ చూపు లెంతందమో!

జన్మజన్మలకూ నువ్వే నా భార్యవి అంటూ శరణాగత రక్షకుడైన హరి తన చేతులతో నా కాలివ్రేళ్ళకి మెట్టెలు తొడుగుతున్నప్పుడు నావంక స్వామి చూసిన చూపులు నా వ్రేళ్ళ నొప్పులను తీర్చినట్లున్నాయి.

తొలిసిగ్గుల్ వెనుకాడ నొండొరులపై దోసిళ్ళతో నెత్తిపై
తలబ్రాల్ పోసెడివేళ స్వామిదగు నుత్సాహమ్ము చూడన్ దగున్
చెలి! నన్నింతయు గెల్వనీకయ పోసెన్ పళ్ళెమే యెత్తి పై
బులకింతల్ గిలిగింతలున్ చికిలిచూపుల్ ప్రాలు నొక్కుమ్మడిన్

తొల్లి సిగ్గులేక ఇద్దరమూ ఒకరిపై ఒకరం దోసిళ్ళతో తలంబ్రాలను పోసుకున్నాం. ఆ సమయంలో స్వామి తన చిలిపి చూపులతో, పులకింతలతో, చిలికింతలతో నన్ను గెలవనీకుండా ఒక్కసారిగా పళ్ళెమెత్తి తలంబ్రాలనంతా నాపై పోసేశాడు.

అమ్మానాన్నలు ప్రేముడిన్ పలువిధాలైనట్టి పుష్పమ్ములున్
రెమ్మల్ మర్వము మధ్యలో తులసి కన్పింపంగ కొంగ్రొత్త యం
దమ్ముల్ జిమ్మగ కట్టినట్టి పువుదండల్ జానుపర్యంతముల్
తమ్ముండీయగా వేసికొంటిమట నాతండేను, నేనాతడున్

మా అమ్మానాన్నలు ప్రేమతో పలురకాలపుష్పాలతో, మధ్యలో మరువము, తులసిఆకులు కలిపి అందమైన దండలుగా కట్టినవాటిని మాకు మా తమ్ముడివ్వగా మేమిద్దరం ఒకరికొకరం మెడలో వేసుకున్నాము.

మురజోద్వేజిత శంఖనాదములు మార్మ్రోవంగ, నల్దిక్కులున్
దరువుల్ వేయగ, మంగళాయతన సౌందర్యమ్ము రెట్టింప శ్రీ
హరి జీవాభయదానశస్తమగు శ్రీహస్తమ్ము సారించి నా
కరముంగైకొనె, దివ్యజీవన తరంగమ్ముల్ మెయింగ్రమ్మగన్

శంఖనాదాలు మారుమ్రోగుతుండగా, మంగళకరమైన సౌందర్యం రెట్టింపుకాగా సకలజీవులకు అభయమిచ్చే శ్రీహరి తన చేతితో నన్ను చేపట్టాడు.

ఆపయిన్ మా పురోహితు డగ్ని వ్రేల్చి
ఒక్కటొకటిగ మాతోడ హోమములను
స్థాలిపాకము మొదలైన సర్వవిధుల
మెలమి చేయించె శ్రేయస్సమీహితములు

ఆ తరువాత మా పురోహితుడు అగ్నిని వ్రేల్చి స్థాలీపాకం మొదలైన సర్వవిధహోమకార్యాలను మాశ్రేయస్సుకి మాచే చేయించాడు.

వణకెడు మోడ్పు చేతులుగ జ్వాలలు విచ్చెడు నగ్నిదేవు మ
న్ననన్ మెయిజూచు మాధవుడు నా చెయి తోడుగ జేసికొంచు నిం
పొనయగ లాజగింజలను హోమము చేసెను మంత్రయుక్తి, ప
ల్చని పొగ కన్నులందెరుపు చారికలందము దిద్ది తీర్చగన్

మాధవుడు నా చేతిని తోడుగా చేసుకుని మంత్ర పూర్వకంగా లాజగింజలు హోమములో వేయగా ఆ పొగకు నా కన్నుల్లోని ఎరుపుచారికలు అందంగా తీర్చినట్లున్నాయి.

కొంగు కొంగును ముడి వేసుకొనెడివేళ
స్వామి చూచిన చూపులో ప్రణయ జలధి
కదలు ద్రొక్కిన, దడుగున నడుగు వేసి
కొంచు మేమగ్నికి ప్రదక్షిణించినాము

మా కొంగులు ముడివేసుకొనువేళ ప్రేమమయమైన స్వామిచూపులలో చూపులు కలిపి, అడుగులో అడుగువేస్తూ ప్రణయభావంతో మేము అగ్నికి ప్రదక్షిణం చేశాము.

క్రీడా సంసారుని గను
ప్రోడలు పరిహాస జల్ప ముగ్ధలు మాతో
నేడడుగులు వేయించిరి
తోడుగ, సనెకల్లు పెట్టి త్రొక్కించిరటన్

ఆ జగన్నాథసూత్రధారుని చూస్తూ మగువలంతా పరిహాసాలాడుతూ, నవ్వుతూ మాతో ఏడడుగులు వేయించి, సనెకల్లుపెట్టి తొక్కించారు.

ఆత్మచారుత కోరుకొన్నట్టి ప్రియుని
యందు సౌభాగ్య ఫలవంతమైన గౌరి
వెలుగుమలూరు మొగమ్ముతో చిలిపినవ్వు
చెలగ ముద్దాడె కౌగిట జేర్చి నన్ను

నా మనసు కోరుకున్నట్టే నాప్రేమ ఫలవంతమై, నేను కోరుకున్నట్టి నా ప్రియుని వెలుగులు విరజిమ్మేముఖంతో ఆ శ్రీమన్నారాయణుడు తన చిలిపినవ్వులతో నన్ను తన బాహువుల్లో బంధించి నన్ను ముద్దాడాడు.

చెవిపోగుల్ కదలాడగా, వెలుగుపూల్ చిందాడగా జూచు మా
ధవు డాత్మధృతి నా కరమ్ము తనహస్తమ్మందు జోడించి, క్రొం


**జవులూరంగ నెవెవియో గుసగుసల్ సాగించుచుండంగ, నో ఉవిదా! సిగ్గులమొగ్గనైతి, మనసేదో యేదో యైపోయెనే**

ఓ చెలీ! నా చెవిపోగులు కదలాడుతూండగా, నవ్వులు చిందిస్తూ క్రొత్తఅందాలతో మాధవుడు తన చేతిలో నా చేతిని ఉంచి గుసగుసలాడుతూండగా ఆ సమయంలో మైమరచి నేను సిగ్గులమొగ్గనయ్యాను.

**కలపమ్ముంగొని, నామెయిన్నలది, వీక్షామాలి పూలమాలికల్ తలపై మేన నలంకృతుల్ నెరపి గోదానాథు దుద్యద్విపో జ్వలసౌవర్ణమనోజ్ఞపీఠి గొలువై సంపూర్ణుడాతండు వె ఝ్ఝలదారిన్ గొనిపోయెనే, నదిని తా లోగొన్న వార్ధింబలెన్**

సముద్రుడు నదిని తనలో కలుపుకున్నట్లుగా, నా మనసులో కొలువైన సంపూర్ణుడైన ఆ శ్రీమన్నారాయణుడు నన్ను తీసుకొని వెళ్లాడు. ఇది ఈ "**వారణమాయిరం**" వృత్తాంతం.

వెయ్యిఏనుగులు వెంటరాగా భద్రగజంపై స్వామి వివాహానికి తరలిరావడం, రక్షాసూత్రాలు కట్టడం, స్నాతకం, వరపూజ, వరునికాళ్ళు కడగడం, జీలకర్ర బెల్లం శిరస్సున



పెట్టడం, మంగళసూత్రధారణ, మెట్టెలు తొడగడం, స్థాలీపాకం, సదస్యం, లాజహోమం, సప్తపదివంటి సమస్తమైన పెళ్ళి విషయాల వర్ణన ఇందులో మనకు కనిపిస్తుంది.

విష్ణుచిత్తుడు వైష్ణవుడైనప్పటికి మనకు గోదావివాహ వర్ణనలో స్మార్తపద్ధతులే వర్ణించబడ్డాయి. తరువాత జరిగే ఊంజల్‌సేవ, ఏకాంతసేవవంటివి వైష్ణవసంప్రదాయంలోనివి కావచ్చు.

**సాకారం చ నిరాకారం భగవత్యారాధనం ద్విధా** అంటారు. అంటే సాకారంగాను, నిరాకారంగాను భగవంతుని అర్చించవచ్చు. గోదాదేవి ఆ స్వామిలీలలను వర్ణించు ముప్పై పాశురాలను రచించి ధనుర్మాసం నెలరోజులు స్వామిని పూజించగా శ్రీరంగనాథుని గోదాదేవికల్యాణం చేయడం జరుగుతుంది. ఆ సమయంలో వారణమాయిరం కీర్తనలు పఠించడం జరుగుతుంది.


గోదాదేవి తనకు శ్రీరంగనాథునితో వివాహమైనట్లుగా వచ్చిన పెళ్ళికలను తన చెలికత్తెలకు వినిపించినట్లుగా ఈ వారణమాయిరంలో చెప్పబడింది. ఏనుగు కలలో కనిపిస్తే శుభం జరుగుతుంది అంటారు కదా. అలాంటిది వెయ్యి ఏనుగులమధ్య భద్రగజంపై శ్రీరంగనాథుడు సమూహంతో తరలివచ్చి వివాహమాడినాడని చెప్పిన ఈ వృత్తాంతం విన్నవారందరికీ శుభాలు కలుగుతాయనటంలో ఏవిధమైన సందేహమూ లేదు. మకరసంక్రాంతినాడు ఈ కల్యాణం మహావైభవోపేతంగా జరిగినట్లుగా చెప్పబడింది. భక్తికి ఇంతకుమించిన వరం ఏముంది? స్వామికల్యాణం చేసి స్వామిని అల్లుడుగా చేసుకోవడం విష్ణుచిత్తులవారి పూర్వజన్మ సుకృతము కాక మరేమున్నది. భక్తివలన మానవుడికి అంతటి అదృష్టం కలిగింది. స్వామికల్యాణం లోకకల్యాణకారకం కదా. అదే ఈ వారణమాయిరం విశేషం.

ఈ పద్యాలను కృష్ణయజుర్వేదపద్ధతిన చేసే పెళ్ళిని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు కవులు. చక్కని లలితమైన సరళమైన పదాలతో ఈ పద్యరచన సాగింది.

*(ఆధారం: పద్యాలు: ఆంగ్లం: శ్రీమతి ప్రేమానందకుమార్, తెనుగు: శ్రీలక్ష్మణయతీంద్రులు)*

*(గత సంచిక తరువాయి భాగం...)*

తరువాత ఆ గాయకులు 'మీ నిమిత్తముగా శ్రీనివాసుడు నాపై జూపిన అనుగ్రహమును నేను వర్ణింపలేను' అని చెప్పి వెండియు శ్రీశైలనాథస్వామి చూపిన అనుగ్రహాతిశయమును వారాజ్ఞాపించిన నియమనమును, శ్రీశైలపూర్ణులు, శ్రీఅనంతార్యులును ఆనతిచ్చిన నియమనములను నుడువగా శ్రీభగవద్రామానుజాచార్యులు విని ఆనందించి మనసున ఆలోచించి మొదలాళ్వారులు మువ్వురును తమ తమ ప్రబంధములందు 'ఎళువార్ విడైకొళ్వార్, వేదియర్గళ్ శెన్నిత్తొంజుమ్ వేంగడమ్' (ఐశ్వర్యకాములు, కైవల్యకాములును అగు వేదవిదులు చేరి కొల్చెడు శ్రీవేంకటాద్రి) 'పళుదొన్నుం వారాదవణ్ణమే విణ్ కొడుక్కుం మణ్ణళంద శ్రీరాన్ తిరువేంగడమ్' (నిర్దోషమగు మోక్ష మొసగెడు గుణాఢ్యుడై త్రివిక్రమరూపుడగు (శ్రీనివాసుని) శ్రీవేంకటాద్రిపై పొందికగా ఉండి మనమున ఉన్నవాడని తెలియుము) 'నిన్ఱతువుమ్ వేయోంగు తణ్శారల్ వేంగడమే' (వేంకటాద్రిపై నెలకొని ఉన్న ఏపుగా పెరిగిన వెదుళ్లుగల చల్లని చరియలు), 'వాయ్ తిఅంగళ్ శొల్లుంవగై' (నావాక్కు వేంకటేశ్వరు గుణముల కీర్తింప దొరకొనును), వేంగడమే యామ్ విరుంబుమ్ వెఱ్పు' (వేంకటాచలమే మే మభిలషించెడి కొండ), 'తిరువేంగడమ్ కండీర్ వాన్కలంద వణ్ణన్ వరై' (చూడుడీ, మేఘసమానవర్ణమైన దీ వేంకటాద్రియను కొండ). 'పిఱైవా వాయ్న్ద వెళ్లత్తరుని విళంగొలినీర్ వేంగడత్తాన్ ఉళ్ళత్తి మళ్ళే యుళన్' (చంద్రుని స్పృశించు నదియు, పెద్దగా ప్రవహించు సెలయేళ్లధ్వనులతో, జలములతో వెలుగొందునదియునగు వేంకటాచలము ప్రభువు మనమున ఉన్నవాడు), 'వెఱ్పెన్ఱు వేంగడం పాడుమ్' (కొండయనగనే, తిరుమలకొండను పాడుడు) అన్నరీతిగ పలుస్థలములందు శ్రీశేషశైలమును, అందు సర్వసులభుడై ఉండెడు భగవంతుడును తమకు మిగుల అనుభావ్యవిషయముగా వర్ణించుట మాత్రమేగాక, శ్రీవేంకటాద్రికి యాత్రగా వచ్చి తిరుమల అడివారమునందు కొంతకాలము మంగళాశాసనపరులై భగవదనుభవము చేయుచుండిరను నర్థమును పిమ్మట తిరుమంగైయాళ్వారువారి హృదయస్థితవామసారముగ 'చెందమిళమున గానము చేసినవారు ప్రణమిల్లు దేవుడు' అని మొదలాళ్వారులకు ముగ్గురికిని శ్రీవేంకటాచలపతియే అనుభవార్హవిషయమని తమ శ్రీసూక్తులందు ప్రకాశపరచిరను అర్థమును శ్రీరంగనాథుల శిష్య




సంప్రదాయమున వినిన చొప్పుననే తలచి శ్రీనాథమునుల వంశస్థులైన ఒక గాయకులకు 'మలైకునియ నిన్ఱారరయర్' అను నామధేయమిచ్చి శేషశైలముపై నిత్యవాసమై విజయము చేసియుండి దివ్యసూరుల దివ్యప్రబంధములను అనుదినమునను దేవగానముతోడ స్వామి సన్నిధియందు అనుసంధించుటకును, ఆనాడు శ్రీవేంకటరమణుడు గాయకులపై కృపజూపి వారి ముఖకమలములనుండి మొదలాళ్వారుల శ్రీసూక్తులను స్వీకరించి హృదయమున ఆనందమొందుటచేత ఇకపై భవిష్యత్కాలము నందెల్ల అధ్యయనోత్సవమునకు మున్ముందుగా మొదలాళ్వారుల శ్రీసూక్తులైన తిరువందాదులు మూడింటితో ఆరంభించి ఇయఱ్పా దివ్యప్రబంధమును అనుసంధించాలి. *(ఇంకా ఉంది)*

మనకు అన్నాన్నిచ్చే పనిని పూజించు. ఆ తర్వాతే గుళ్లూ, గోపురాలూ అని తెలుసుకో!

# శోభను గూర్చే రంగవల్లికలు

-డా॥ మైలవరపు లలితకుమారి



"తీరైన సంపద ఎవరింటనుండు
దినదినము ముగ్గున్న లోగిళ్ళనుండు"

అన్న కవి మాటలకు తగినట్లు మన సంప్రదాయంలో ముగ్గులకు ప్రత్యేకస్థానం ఉంది. గుమ్మంముందు వేసే ముగ్గుల్లో ఆధ్యాత్మికతకూడా మేళవించి ఉంటుంది. ముంగిలిలో ముగ్గులు చూడగానే మనసుకు ఆనందం, ప్రశాంతత కలుగుతుంది. ప్రతిరోజు ఉదయాన్నే వాకిలిముందు ముగ్గువేయడం మనదేశ సంప్రదాయం. మనదేశంలో ముగ్గులను ఉత్తరాదిన రంగోలి, తమిళనాడులో కోలం, బెంగాలీలో అల్పన, రాజస్థాన్‌లో మండల, సంస్కృతంలో మండలం, రంగవల్లికలని అంటారు. దేశంలోని అన్నిప్రాంతాల్లో ముగ్గులకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ముగ్గులు వేయడంకూడా చతుష్షష్టికళల్లో ఒక కళ.

వాకిలిముందు గోమయంతో కళ్ళాపిచల్లి బియ్యప్పిండితో కానీ, సున్నపురాతితో చేసిన ముగ్గునుగాని వేస్తారు. గోమయంతో చల్లిన కళ్ళాపివలన ఇంట్లోకి సూక్ష్మక్రిములు రావని ఒక నమ్మకం. ఇంటికి చెడుదృష్టి సోకదని అంటారు. వాకిలిముందు ముగ్గు వేస్తే లక్ష్మీదేవి ఇంట స్థిరనివాస ముంటుందని ఒక నమ్మకం. చుక్కలముగ్గులు, గీతల ముగ్గులు ఇలా రకరకాల ముగ్గులు వేస్తారు.. ఒక్కొక్క ముగ్గుకి ఒక్కొక్క ప్రాధాన్యత ఉంటుంది.

ముగ్గు నితొమ్మిదిచుక్కలతో ప్రారంభించాలని పెద్దలంటారు. తొమ్మిదిచుక్కలను నవగ్రహాలకు గుర్తుగా చెబుతారు. మధ్యలో సూర్యుని చిత్రించి దానిచుట్టూతా ఈ చుక్కలను కలుపుతారు. ఇంటిముందు ప్రతిరోజు ముగ్గును వేసినందు వలన అతిథి, అభ్యాగ తులరాకతో ఆ ఇంట ధనధాన్యాలకు లోటు ఉండక లక్ష్మీదేవి నివసిస్తుందని మన విశ్వాసం. ధనుర్మాసం ప్రారంభమైననాటినుండి నెలపట్టడం అని ముగ్గులను వేస్తారు. సంవత్సరమంతా ప్రతిరోజు ముగ్గులు వేసినా ధనుర్మాసం నెలరోజులు మహిళలు ఉదయాన్నే మేల్కొని ఇంటిముందు ముగ్గులు వేసి పసుపు కుంకుమలు, పువ్వులతో ఆ ముగ్గులను అందంగా అలంకరిస్తారు. పూలన్నా, ముగ్గులన్నా అమ్మాయిలకే కాదు ఆ శ్రీమహాలక్ష్మికి కూడా ఎంతో ఇష్టం. అందుకే ఏ పండుగ వచ్చినా ముంగిట తెల్లనిముగ్గును వేసి రకరకాల రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దుతారు. సాధారణంగా పండుగవేళల్లో శుభకార్యాలసమయంలో పూజలు, వ్రతాలు చేసుకునేసమయంలో బియ్యపుపిండితో ముగ్గులను వేస్తారు. అందువలన మనం సూక్ష్మక్రిముల ఆకలినికూడా తీర్చినట్లు అవుతుంది. ఆరూపేణా ఎంతో కొంతపుణ్యం ప్రోదిచేసుకోవడం జరుగుతుంది. గుమ్మంముందు వేసిన రంగవల్లిక మనస్సుకు ప్రశాంతతను కలిగిస్తుంది. అందులో పొదిగిన రంగులు కనువిందు చేయడమేకాక ఆనందాన్నికూడా ఇస్తాయి. ధనుర్మాసంలో రోజుకు ఒక్కొక్కరకం ముగ్గును వేస్తారు. ముందుగా చుక్కలముగ్గులతో ప్రారంభిస్తారు. అవి 9, 11, 16, 21 అంటూ సరి బేసి చుక్కలను పెట్టి ఆ చుక్కలను ఒకదానితో మరొక దానిని అందంగా కలుపుతూ ముగ్గును పూర్తిచేస్తారు. ఆ సమయంలో బుద్ధికి ఏకాగ్రత, సమయస్ఫూర్తి అధికమవుతుంది. అంతేకాక ఆలోచనలతో సమస్యలను అధిగమించడంలోకూడా మెలకువలు తెలుస్తాయి. ఆ తర్వాత గీతలముగ్గులు కూడా వేస్తారు. అందులో రకరకాల

గీతలను అనేకవిధాలుగా కలుపుతూ జీవితంలోని సమస్యలను నేర్పుగా ఎదుర్కొనే జ్ఞానాన్ని పొందుతారు. ఇది ఒకవిధంగా బుద్ధికి పదునుపెట్టే ప్రక్రియ. నెలపెట్టిననాటినుండి ఎన్నిరకాల ముగ్గులువేసినా ప్రత్యేకదినాల్లో వేసే ముగ్గులు ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. ముక్కోటిఏకాదశి లేదా వైకుంఠఏకాదశి రోజున వాకిళ్లముగ్గుని ఆంగ్లనూతనసంవత్సరానికి స్వాగతం పలుకుతూ స్వాగతరంగవల్లికని, భోగిరోజు భోగికుండలు, సంక్రాంతిపండుగరోజు చెరుకుగడలు మొదలుగాగల వ్యవసాయ సంబంధితచిత్రాలతో, కనుమరోజు కొందరు పాముముగ్గులు, మరికొందరు రథంముగ్గుని వేస్తారు. రథం ఉత్తరంవైపుకి వెళుతున్నట్లుగా వేస్తారు. ఉత్తరం కుబేరస్థానం. కనుక కుబేరునికి ఆహ్వానం పలుకుతూ ఈ అల్లికను రచించడం జరుగుతుంది. అందానికే కాదు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికికూడా ఉపయోగపడతాయి. లెక్కల్లో జ్ఞానాన్ని పెంచుతుంది. ఎందుకంటే ఒక్కచుక్కతగ్గినా ముగ్గు సరిగారాదు. అందువలన లెక్కల్లో జ్ఞానాన్ని పెంచుతుందని చెప్పవచ్చు. చుక్కలనుకానీ, గీతలనుకానీ ఎలా కలపాలి? ఎన్నిచుక్కలు పెట్టాలి? ఎలా వేస్తే...? అందంగా ఉంటుంది అని ఆలోచించడమే అందుకు కారణం. ఇది ఒక ప్రహేళిక వంటిది. అంతేకాక ఇది శారీరకవ్యాయామాన్నికూడా కలుగజేస్తుంది. ప్రారంభించినప్పటినుండి పూర్తయ్యేదాకా చుక్కలు పెట్టడానికి ముగ్గును గీతలతో కలపటానికి వంగటం లేవటం వలన నడుముకి, మోకాళ్ళకు, వేళ్ళతో పిండినిపట్టి గీతలను గీయటంవలన చేతులకి, చేతివేళ్ళకి, ఏకాగ్రతతో దృష్టిని నిలిపి గీతలు గీయడం కళ్ళకుకూడా వ్యాయామమే కదా. ఇలా శరీరంలోని అన్నిభాగాలకి మనకి తెలీకుండానే మనం నిబద్ధతతో పని చేసేందుకు ఉపయోగపడతాయి రంగవల్లికలు. ఈరోజుల్లో ప్రజలు వ్యాయామశాలలకు వెళ్లి వ్యాయామాలు చేస్తున్నారు. కానీ ఆనాడు ఈ రంగవల్లికలే శారీరకవ్యాయామానికి ఎంతగానో దోహదపడేవి.



స్త్రీలు మాత్రమే ఈ రంగవల్లికలను తీర్చిదిద్దేవారు. కానీ నేడు పురుషులుకూడా అందమైన రంగవల్లులను వేస్తున్నారు. ఎందుకంటే కళాశాలల్లో జరిగే రంగోలిపోటీల్లో పురుషులు కూడా బహుమతులు కైవసం చేసుకోవటం జరుగుతోంది.

ప్రఖ్యాతకవి త్రిపురనేని గోపీచంద్ తాను వాకిలి ముందు ముగ్గులు చిత్రించినట్లుగా చెప్పారు. "ఉమెన్ రిచువల్ అండ్ ఎకాలజీ ఇన్ ఇండియా అండ్ ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ ది కోలం" అనే పుస్తకంలో రచయిత విజయ నాగరాజన్ ముగ్గులు, వాటి చరిత్ర, మహిళలజీవితంలో వాటి ప్రాధాన్యతను గురించి చెప్పారు. వేదాలలో సూర్యారాధనకోసం అనేకరకాల చిత్రాలను చిత్రించినట్లుగా నాగరాజన్ తన పుస్తకంలో పేర్కొన్నారు. అలానే మధ్య యుగానికి చెందిన ఆండాళ్ అనే కవయిత్రి భగవదారాధనలో ముగ్గుని గురించి పేర్కొనడం జరిగింది.

వృత్తాకారంలో వచ్చే గీతలతో వేసే ముగ్గు భూత ప్రేత పిశాచాలను దరికి రాకుండా చేస్తుంది. మనం వేసే పద్మాల, చుక్కల ముగ్గులలో అనేకకోణాలు దాగి ఉంటాయి. వానిని మనం కేవలం గీతలు, చుక్కలవలె భావించరాదు. మంత్రాలతో కూడిన యంత్రాలవలె తంత్రశక్తినికూడా కలిగిఉంటాయి. అందువలన దుష్టశక్తులు మన దరిచేరకుండా కాపాడుతాయి. అందుకే ముగ్గు చిన్నదా పెద్దదా అని కాదు ముఖ్యం. ఏ ముగ్గునికూడా తొక్కకూడదు. ముగ్గంటే లక్ష్మీ స్వరూపం. వానిలోని పాజిటివ్‌శక్తివలన దైవశక్తి ఇంటిలోపలికి ప్రవేశిస్తుంది. ముగ్గులు ధార్మికక్రతువుల్లో ఒకభాగంగా చెప్పవచ్చు. విశ్వంలో ఉండే శక్తులని, దేవతలను, భూమాతను ఆరాధించేందుకు ఇదొకమార్గమని చెబుతారు. తిరుమల శ్రీవారిబ్రహ్మోత్సవాల్లో, పండుగసమయాల్లో నాలుగుమాడవీధులను రకరకాలముగ్గులతో అలంకరించటం మనం చూస్తు ఉన్నాం. ఆలయంలో నిత్యము రంగవల్లికలు దిద్దితే ఐదవతనంతో సుఖిస్తారని ఒక నమ్మిక. ముగ్గులు భారతీయ జీవనంలో ఒక ప్రముఖమైన భాగాన్ని సంతరించుకున్నాయి. ఇవి కేవలం మనస్సుకు ప్రశాంతతను కలిగించడమేకాక, శారీరకవ్యాయామాన్నికూడా కలుగజేసేటటువంటి ఒక అందమైన ప్రక్రియ. స్వచ్ఛమైనమనస్సులో అందమైన ఆలోచనలు నింపే రంగులమయమైన సౌభాగ్యజీవితమే అందాల రంగవల్లి.

# మకరసంక్రాంతి

- డా॥ పి.వి.ఉమాశశి, 94407 35155.



"తమసోమా జ్యోతిర్గమయ" అనే ఉపనిషద్వాక్కుకి సరైనరూపం సంక్రాంతి. ఉత్తరాయణపుణ్యకాల ప్రారంభదినమే సంక్రాంతి. సూర్యకాంతియే సమ్యక్‌క్రాంతి. అదే సంక్రాంతి. శ్రీసూర్యభగవానుడు ఉత్తరానికి మళ్ళినప్పుడు- జీవశక్తి కలుగుతుంది. ఆ జీవశక్తే జీవనచైతన్యానికి మొదలు. అందుకే సంక్రాంతిపర్వదినం అయింది. ఏ పండుగ అయినా ఆ ఋతువునకు సంబంధించే ఉంటుంది. శీతోష్ణకాలాన్ని సమంగా అనుభవించే కాలమే హేమంతం. అందుకే ముందురోజు అయిన భోగినాడు చలిమంటలు వేసుకుని వెచ్చవెచ్చగా కాచుకుంటారు.

సంక్రాంతి అంటే శాంతి. మంచి నడక. మంచి నడవడిక. శాంతికి చక్కని ప్రతీక సంక్రాంతి. సంక్రాంతినాడు తెలతెలవారుతుండగానే తలంటి పోసుకుని, కొత్తబట్టలు కట్టుకుని కళకళలాడుతూ- మొట్టమొదటిగా పాలు పొంగించి, పొంగలి వండి సూర్యనారాయణునికి నివేదన చేసి, నోటిని తీపి చేసుకుంటారు. ఈనాడు పొంగలికి ఎంతో ప్రాశస్త్యముంది. అందుకే తమిళులు ఈ పండుగనే పొంగల్ అని పిలుచుకుంటారు. పొంగలి అనేది- పెసరపప్పు, మిరియాలు, నేతితో కలిపి వండే అన్నం. ఇది ఈ కాలానికి అవసరమైనది. ఈ చలిలో ఈ పదార్థాలు ఆరోగ్యాన్నిచ్చేవి. వీటి కలయిక ఇంకా మంచిది ఒంటికి. అందుకే తప్పనిసరిగా పొంగలి వండి తీరుతారు- సంక్రాంతినాడు.



సంక్రాంతిని- బొమ్మలపండుగ, పంటలపండుగ, పశువులపండుగ, ముగ్గులపండుగ అంటారు. ఇది అన్ని పండుగలకన్నా- పెద్దపండుగ. సాంప్రదాయికంగా ఈనాడు పితృతర్పణాలు ఇస్తారు. అందుకే ఇది పెద్దపండుగే కాదు పెద్దలపండుగకూడా. లక్ష్మీదేవిస్వరూపాలైన పశువులను విశిష్టంగా పూజించే పుణ్యకాలమిది. పశువులనన్నిటినీ విశేషించి గంగిరెద్దులని వైభవంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజించి, వాటిని కృతజ్ఞతగా ఆరాధిస్తారు.

పంట చేతికంది ఇంటికొచ్చే కాలమిది. కొత్తధాన్యంతో కుటుంబాలు కళకళలాడుతాయి. దానధర్మాలకు మహత్తర అవకాశమున్న సమయమిది. నూనెగుడ్డలవాళ్ళు, కాటికాపర్లు, హరిదాసులు, గంగిరెద్దులవాళ్ళు ఇలా ఎందరెందరో యాచకులు ఇల్లిల్లూ తిరిగి తిరిగి ఎన్నోరకాల వస్తువులను బహుమానాలుగా అందుకుంటారు. ధాన్యం, పప్పుదినుసులు, బట్టలు, డబ్బు, అలంకారవస్తువులు, ఇలా ఎన్నిటినో పొంది ఆ యాచకులు తృప్తితో ఆనందపడిపోతారు. పేదసాదలను ఆదరించే పరోపకారంతో విరాజిల్లే పండుగిది.

సంక్రాంతినాడు చేసే దానాలలో ఉత్తమమైనది కూష్మాండదానం. అంటే గుమ్మడికాయ. ఈ దానం అధికఫలాన్ని ఇస్తుంది. కూష్మాండదానం భూదానంతో సమానం. ఇది భూదానఫలితాన్ని అందిస్తుంది. ఈనాడు పెరుగును దానం చేస్తే ఉత్తమసంతానం ప్రాప్తిస్తుంది. ద్రోణుని భార్య కృపి ఈ పండుగను భక్తిశ్రద్ధలతో చేసి- అపరరుద్రమూర్తి అయిన అశ్వత్థామను పుత్రునిగా పొందింది. యశోదాదేవికూడా ఈ పండుగను చేసుకుని పరమాత్ముడైన శ్రీకృష్ణునికి తల్లి అయింది.

సంక్రాంతినాడు రకరకాల రంగవల్లులు (ముగ్గులు) తీరుస్తారు. ఈ ముగ్గులలో విశేషార్థం ఉంది. పేడనీటితో కళ్ళాపి చల్లి, పేడముద్దలతో గొబ్బెమ్మలను తీర్చి, పసుపు, కుంకుమ అద్ది పూలతో అలంకరించటంవలన క్రిమికీటకాలు ఇంటిలోనికి రాలేవు. అలా మన ఆరోగ్యం పదిలంగా నిలుస్తుంది. బియ్యం

2025, జనవరి 14న సంక్రాంతిపండుగ సందర్భంగా...

పిండితో ముగ్గులు వేస్తాం కాబట్టి– అది చీమలకు ఆహార మవుతుంది. మరొక విశేషం– ముగ్గు, పేడ, పూలల్లో శ్రీమహా లక్ష్మీదేవి కొలువై ఉంటుంది. అందుకే ప్రతిగడపముందు ముగ్గుంటుంది. ప్రతి గడపకు పసుపు ఉంటుంది. అలా లక్ష్మీ కటాక్షం అంటే సిరిసంపదలు మనింట స్థిరంగా నిలిచి ఉంటాయి. అన్ని ముగ్గులలోకీ రథంముగ్గు ప్రశస్తమైనది. తప్పని సరి అయినది. తాబేలుఆకారంలో ముగ్గు వేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ముగ్గులమీద గొబ్బెమ్మలను పేర్చి శుభాలను పొందుతారు. ఈ శుభాలు రెండువిధాలు. గొబ్బెమ్మ– మంగళ గౌరీదేవిరూపం. గొబ్బెమ్మలను పెట్టి, పూలతో అలంకరిస్తారు. అంటే గౌరీమాతను పూజించినట్లే. గొబ్బెమ్మలచుట్టూ తిరు గుతూ, ఆడుతూ–


"తామర పూవంటి తమ్ముణ్ణీయవే
చామంతి పూవంటి చెల్లెలినీయవే
మొగలి పూవంటి మొగుణ్ణీయవే"

అంటూ గొబ్బిపాటలు పాడుతూ సంబరపడిపోతారు. ఈ ఆటపాటలు ఎక్కువగా కన్నెపిల్లలవే. గొబ్బిరూపంలో గౌరీ దేవిని ఆరాధించి, పరమశివునివంటి పతిని పొందాలని కోరు కుంటారు. అంతేనా! ఆడపిల్లలు కోలాటాలతోను, మగపిల్లలు గాలిపటాలతోను అలసిపోయేదాకా ఆడుకుంటారు. ఆ ఆట పాటల సంబరమే ఆరోగ్యదాయకం. "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నది శాస్త్రవచనం కదా. ఆటపాటలసంబరమే సంతోషం. "సంతోషమే సగం బలం". ఈ పండుగలో ఎన్నో వైద్యసూత్రాలు ఇమిడిఉన్నాయి. భోగినాడు– పొంగలి, అరిసెలు; సంక్రాంతినాడు– పొంగలి, సజ్జప్పాలు, నువ్వుండలు; కనుమనాడు ఆవడలు (మినుముతో చేసిన పెరుగుగారెలు), పొంగలి తింటారు. ఇవన్నీకూడా వాతాన్ని హరించేవే. ఈ చలికాలంలో వచ్చే వాతరోగాలకు నువ్వులు, మినుములు, పెసలు మొదలైనవన్నీ ఔషధాలు. అంతేకాదు, శనిదేవుడు మకర రాశ్యాధిపతి. వాత ప్రధానగ్రహం. మకర సంక్రాంతికాలంలో శనిదేవుని స్మరించి, ఈ పదార్థాలను ఆరగిస్తే ఆరోగ్యం చేకూరుతుంది. చలికాలానికి, ఆకులు రాలే కాలానికి విమోచన మిచ్చి, క్రొత్తసృష్టి ప్రారంభమయేకాలమే ఉత్తరా యణం. అందుకే "సంక్రాంతికి సంకెళ్ళలో ఉన్నవారికి కూడా విముక్తి" అనే సామెత ఏర్పడింది.

సంక్రాంతినాడు ఒక దివ్యపురుషుడు భూలోకానికి వచ్చి, సంవత్సరఫలితాన్ని శాసిస్తాడు. ఒక్కో సంవత్సరం ఒక్కో రూపవిశేషంతో, ఒక్కోపేరుతో, ఒక్కోవాహనంపైన, ఒక్కో ఆయుధంతో విచ్చేస్తాడు. సంక్రాంతినాడు వస్తాడు కనుక ఆ దివ్యపురుషుని "సంక్రాంతిపురుషుడు" అంటారు. సూర్యశక్తియే సంక్రాంతిపురుషునిరూపంలో వస్తుందని జ్యోతిశ్శాస్త్రం చెప్తోంది. వామనమూర్తిచేత అధోలోకానికి అణచబడిన బలిచక్రవర్తి– సంక్రాంతినాడు భూలోకానికి వచ్చి, సంవత్సరానికి ఒకసారి తాను పాలించిన భూమిని కనులారా చూసుకుని తిరిగి తన లోకానికి వెళ్ళిపోతాడు.


సూర్యదేవుడు– మకరరాశిలోనికి ప్రవేశించేకాలాన్ని మకరసంక్రమణం అంటారు. సూర్యసంక్రమణం జరిగేది సంక్రాంతినాడే. అందుకే సంక్రాంతిని మకరసంక్రాంతి అంటారు.

ఎన్నో కళలతో, సందడులతో, సంబరాలతో కూడినదీ పండుగ. కలకలలు, గలగలలు, కేరింతలు, ఆటపాటలు, ఆనందం, ఆహ్లాదం, ఆరోగ్యం, ఆధ్యాత్మికం– అన్నీ కలగలిసిన మహాపర్వదినం– సంక్రాంతి.



# కోదై-గోదా

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, 99890 63761



పరమభక్తాగ్రణ్యుడైన విష్ణుచిత్తునికి తులసీవనంలో ఒక చక్కని చిన్నిపాప దొరికింది. ఆ చిన్నారి ఎవరో కాదు. సాక్షాత్తూ గోదాదేవి. శ్రీమహాలక్ష్మీదేవి, భూదేవిల అవతార రూపిణిగా వెలసిన జగన్మాత గోదాదేవి. అందుకే రాయలు-"అయ్యింధు వదన ధరాంగన" అన్నాడు. విష్ణుచిత్తుడు- శ్రీలక్ష్మీనారాయణుని దివ్యవాహనమైన గరుత్మంతుని అవతారం. విష్ణుచిత్తుని పూర్వనామం భట్టనాథుడు. నిరంతరం శ్రీహరిమీదనే చిత్తం నిలిపి ఉంచ గలిగాడు. కనుకనే విష్ణుచిత్తుడయ్యాడు. శ్రీవైష్ణవులలో పన్నెండుమంది పరమభాగవతోత్తము లైన మహాభక్తులున్నారు. వారిని ఆళ్వారులంటారు. వారందరిలోకి విష్ణుచిత్తుని పెరియాళ్వారు అన్నారు. అంటే పెద్ద ఆళ్వారు అని అర్థం. ఆతని కోరికప్రకారం జగన్మాత- ఆతని ఒడిలోనే అల్లారుముద్దుగా పెరిగింది. దొరికిన పసిపాపను దైవవరప్రసాదంగా తలచి విష్ణుచిత్తుడు తన భార్యకు అందించాడు. అదంతా దైవలీలగా వర్ణించాడు రాయలు.

ఆ చిన్నారి తల్లికి- తల్లిదండ్రులు కోదై అని పేరు పెట్టారు. కోదై- అంటే పూలదండ. కోదై క్రమక్రమంగా గోదై- గోదాగా రూపాంతరం చెందిందని పెద్దలు చెప్తున్నారు.



గోదాదేవి యౌవనవతి అయ్యాక పరమాత్మునికి సమర్పించే పూమాలను ముందుగా తాను ధరించి- బావి నీటి ప్రతిబింబంలో తన అందాన్ని చూసుకుని మురిసిపోయి- తిరిగి ఆ మాలను స్వామివారి పూలమాలలబుట్టలో పెట్టేసేది- అన్న అంశాన్ని ఆంధ్రభోజుడు- "పితబద్ధ లతాంతములర్ధి గొప్పునన్ బూని యొకింత సేపునించి- కొంతసేపర్ధి గీలించి కూపవారి నీడ వీక్షించి క్రమ్మఱ- పుచ్చి" అంటూ అభివర్ణించిన తీరు మనోజ్ఞంగా భాసిస్తోంది. కొన్నిరోజులతర్వాత ఈ విషయం తెలుసుకున్న తండ్రి విష్ణుచిత్తుడు అపచారం జరిగిందని ఆందోళన చెందాడు. కానీ పరంధాముడు కలలో కనిపించి- గోదాధరించిన మాలలే తన కెంతో ప్రియమని చెప్పి అనుగ్రహించాడు.

"ధరించి వదిలిన మాలను ఇచ్చినది"- అనే అర్థం అవగతమవడానికి శ్రీకృష్ణదేవరాయలు తన కావ్యాన్ని 'ఆముక్తమాల్యద' అన్నాడు. ఈ కావ్యనాయిక లోకమాత గోదాదేవి. నాయకుడు జగన్నాయకుడైన శ్రీరంగనాథుడు.

గోదాదేవి స్వామివారికోసం ఎన్నో ఎన్నెన్నో చేసింది. "అలంకారప్రియో విష్ణుః" అని తెలిసిన గోదాదేవి రకరకాల అలంకరణలు చేసికొని స్వామివారి దృష్టి తనమీద పడాలని భక్తిపూర్వకంగా సేవించింది. అందులోని ఒక భాగమే "పక్కకి వంగి ఉన్న కొప్పు". అమ్మవారి ఈ కొప్పు అలంకారం జగత్ప్రసిద్ధి చెందింది. అంతేనా!

***"జలజేక్షణ తన్ముకుంద చరణ స్మృతి నిశ్చలత కనుమొగిచి"-*** కొలిచెనన్నది రాయలవారి వివరణ. జగన్నాథుని కొలుస్తూనే గడిపింది జగజ్జనని కొంతకాలం. "ప్రజ్ఞ వైష్ణవ పురాణ సంహితా వ్యాఖ్యా రచన ప్రొద్దుగడుపుచున్నది" గోదాదేవి- అని రాయలు చెప్పినట్లు కన్నెవయసులోనే ముప్పైపాశురాలను రచించింది. ప్రతిఒక్కపాశురమూ- ఆ పరమాత్ముని వర్ణనాత్మకమే. శ్రీకృష్ణుని లీలలు, రాసక్రీడలు- రసభరితంగా వివరించిందీ పాశురాలలో. ఈ ముప్పైపాశురాలూ ఒక పురాణ కావ్యంగా, ఒక ఆధ్యాత్మికగ్రంథంగా, ఒక స్తుతికావ్యంగా, ఒక పారాయణగ్రంథంగా "తిరుప్పావై"



పేరుతో విరాజిల్లింది. ధనుర్మాసంలో ముప్పైరోజులపాటూ ఈ ముప్పైపాశురాలను నిత్యం పారాయణ చేస్తారు. ముఖ్యంగా కన్నెపిల్లలు ఈ పాశురపారాయణ చేస్తే పరమాత్మునివంటి భర్త లభిస్తాడని, వివాహితులు చేస్తే వారి కాపురం కళకళలాడుతూ కలకాలం నిలుస్తుం దని మన నమ్మకం. మంగళదాయిని కాత్యాయనీదేవివ్రతాన్ని చేసి గోదాదేవి- పరంధా ముని పతిగా పొందింది.

సాహితీ సమరాంగణాసార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన దివ్యవైష్ణవ ప్రబంధం "ఆముక్తమాల్యద". ఈ కావ్యం భక్తిరసభరితం. రాయలు కవిరాజు. రాజకవి. పరమతసహనశీలి. రసహృదయుడు. కవిపండితపోషకుడు. భక్తియోగం, విష్ణుతత్త్వం, వైష్ణవమతసారం- మనకందించిన భక్తాగ్రగణ్యుడు. "ఆముక్తమాల్యద" మన తెలుగు ప్రబంధం కావడం మన సుకృతం. కృష్ణదేవరాయలు గోదారంగనాయకులవివాహాన్ని నూటికినూరుపాళ్లూ తెలుగువారి సంప్రదాయపద్ధతిప్రకారం చేశాడు. ముందుగా- శ్రీస్వామివారిని విష్ణుచిత్తుడు విల్లిపుత్తూరుకు రమ్మనమని ప్రార్థింపచేశాడు. కారణం- వధువు ఇంటనే వివాహం జరపడం ఆచారం. విష్ణుచిత్తుని కోరికమేరకు శ్రీరంగనాథుడు విల్లిపుత్తూరుకి తరలివచ్చాడు. గోదాదేవికి విల్లిపుత్తూరు జన్మస్థలం కదా. ఇంక పెళ్ళితంతు మొత్తం అంగరంగవైభవంగా జరిగింది. జీలకర్ర- బెల్లం తలలమీద పెట్టించి, సప్తపది తొక్కించాడు కవి రాయలు.

**"గళమున గట్టెను హరి మంగళ సూత్రము పులక లతివ గాత్రము పొదువన్**
**నెలతయు పతియును గరముల నలవటిచిరి కంకణంబులన్యోన్యంబున్"**

**"వనమాలి చూడమున మానిని ముత్తెపు బ్రాలు వోయు."**

గోదాదేవికి శ్రీనాథునిచే మంగళసూత్రం కట్టించి, ఇరువురిచేత ముత్యాల తలంబ్రాలు పోయించి, అరుంధతీనక్షత్రదర్శనం చేయించడం విశేషం. వధూవరులు సాక్షాత్తూ పృథ్వీనారాయణులు. జగన్మాతాపితరులు. అయినా మన ఆచారం నిలబెట్టడానికి రాయలు-వారికికూడా అరుంధతీనక్షత్రాన్ని చూపించి, నమస్కరింపచేసి తరించాడు. తృప్తిచెందాడు. ఇంక పెళ్ళికానుకలు సమర్పించుకున్నదెవరు!? "బ్రహ్మరుద్రాది గీర్వాణ కోటి". ముక్కోటిదేవతల కానుకలను స్వీకరించి శ్రీరంగనాథుడు వారినందరినీ ఆశీర్వదించి సతీసమేతంగా శ్రీరంగం చేరి- భక్తజనకోటిని అనుగ్రహిస్తూ కొలువుతీరాడు.



గోదారంగనాయకులకల్యాణం జరిగింది ధనుర్మాసంలోని భోగినాడు. అందుకే ఆనాడు పర్వదినం అయింది. ఇప్పటికీ ఆలయాలలో భోగినాడు గోదారంగనాయకులకల్యాణం మహోత్సవంగా జరుపుతున్నారు. అంతే కాదు. జగజ్జననీజనకుల వివాహం జరిగిన మాసం కాబట్టి ధను ర్మాసంలో భక్తులెవరూ వివాహం చేసుకోరు.

శ్రావణమాసంలోని పుబ్బనక్షత్రంలో జన్మించినందున నేటికి విల్లి పుత్తూరులో గోదాఅమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆ రోజున ఘనంగా చేస్తారు. శ్రీవిల్లిపుత్తూరు, శ్రీరంగం, తిరుపతి, ఏదులాబాదు, చెన్నపురిక్షేత్రాలలో గోదాదేవి కొలువుతీరి ప్రత్యేకపూజలు, విశిష్టఉత్సవాలు అందుకుని మనలను అనుగ్రహిస్తోంది. తమిళనాడులో విల్లిపుత్తూరుకి మహత్తరమైన ప్రాశస్త్యముంది. ఇక్కడొక విశిష్టవిషయాన్ని తప్పనిసరిగా గుర్తించాలి. "శ్రీవిల్లిపుత్తూరు గుడిగోపురం- తమిళనాడు ప్రభుత్వ అధికార చిహ్నం." వైష్ణవులు ఆరాధ్యులైన పన్నిద్దరాళ్వారులలో గోదాదేవి ఏకైక స్త్రీమూర్తి. భక్తిసంపన్నురాలు. ప్రేమైకశీలి. వరప్రదాయిని. వాత్సల్యపూర్ణ. ఆండాళ్‌గా కొలువబడుతోంది.



"శ్రీగోదామాతా నమో నమః"



# గంగిరెద్దుల శ్రీహరి మన శ్రీనివాసుడే!

- శ్రీ వద్దిరాజు జనార్దనరావు, 99893 50596

దుష్టశిక్షణ చేయడంకోసం "గంగిరెద్దులవానిగా" వేసిన వేషంతో మాయను మాయతోనే చిత్తుచేసే జగన్నాథుడు మన శ్రీనివాసుడు.

గంగిరెద్దులాట మన పురాణకాలంనుంచి ఆడుతున్న ప్రాచీనకళ. ఇది గొప్పగా ఆదరింపబడుతున్న ప్రాచీనకళ. అనాదిగా ఈ కళ మన సంస్కృతికి దర్పణంగా నిలుస్తున్నది. మనది వ్యవసాయ ప్రధానంగా గల దేశం. ఆచారవ్యవహారాలు, పశుపోషణ గ్రామీణ జీవనమహోన్నత సంస్కృతీసంప్రదాయాలకు నిలయం.

2025,
జనవరి 15న
కనుమపండుగ సందర్భంగా...

సంక్రాంతి వస్తుందనడంతోనే కొద్దిరోజులనుండి గంగిరెద్దులను ఆడించేవారు కనబడతారు. వీరు గంగిరెద్దును అందంగా ముస్తాబు చేసి, బాగా దానికి శిక్షణనిచ్చి ఆటలో నైపుణ్యం నేర్పి ఊరూరా, వాడవాడలా తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తూంటారు.



వీరు ఎద్దుపై కంబళీలను వేస్తారు. కొమ్ములకు, మెడలో మువ్వలను కడతారు. తల ఆడించేప్పుడల్లా అవి ఘల్లుఘల్లుమంటూంటాయి. కాళ్ళకు గజ్జెలు కడతారు. మెడలో హారాలను వేస్తారు. చూపరులను ఇట్టే ఆకర్షించేవిధంగా గంగిరెద్దును అందంగా అలంకరించి ముస్తాబు చేస్తారు. ఒక డోలును, సన్నాయిని వాయిస్తూ తలపాగాను వేసుకొని గంగిరెద్దులను ఆడిస్తూ ఉంటారు గంగిరెద్దుల వారు. బాబుగారికి దండం పెట్టు, అమ్మగారికి దీవెనలివ్వు.... అంటూ రకరకాల విన్యాసాలు చేయిస్తారు. కొందరు పడుకొని ఎద్దును తమ గుండెలపైకి ఎక్కించుకొని విన్యాసాలు చేయిస్తారు. ఆ ఎద్దు వీరు చెప్పినట్లు ఆడుతుంది. ఇది ఒక గొప్పకళ.

గంగిరెద్దులాట పురాణప్రాశస్త్యంగల ప్రాచీనసంప్రదాయకళ. వినాయకచవితి రోజు చదివే గణపతిపూజలో ఈ కథ వస్తుంది. అందులో గంగిరెద్దులాట విశేషంగా ఉంది. గజాసురుడు అనే రాక్షసుడు గొప్ప శివభక్తుడు. శివుని గురించి ఘోరతపస్సు చేసి శంకరుణ్ణి మెప్పించి, శివుణ్ణి తన ఉదరంలో ఎల్లప్పుడూ ఉండుమన్న కోరికను కోరాడు. శివుడు అంగీకరించి భక్తునికోరిక తీర్చాడు. భర్తజాడ తెలియక పార్వతీదేవి విష్ణుమూర్తికి విషయం చెప్పింది. విష్ణువు శివుడు గజాసురుడిఉదరంలో ఉన్న విషయం తెలుసుకొని పార్వతిని ఊరడించి నందిని తోడ్కొని, ఆ నందిని గంగిరెద్దులా అలంకరించి తాను గంగిరెద్దులవాడిగా మారి అనేకవిధాలుగా విన్యాసాలను నందితో చేయించాడు తన బూరానాదంతో.



శ్రీహరి ప్రేరేపింపగా నంది గజాసురుని ఉదరాన్ని తన కొమ్ములతో చీల్చి శివుణ్ణి బయటకు తెచ్చింది. ఇలా మన శ్రీనివాసుడు గంగిరెద్దులవానిగా రూపుదాల్చి దుష్టశిక్షణ గావించాడు. ఇంతటి పురాణప్రాశస్త్యమున్న ఈ గొప్ప కళాసంపదను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిది.

108 దివ్యదేశాలు

# తిరువెళ్ళక్కుళమ్

## (అణ్ణన్ కోయిల్)

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరువెళ్ళక్కుళమ్ అనే ఈ దివ్యదేశంలో శీర్‌కాళి అనే దివ్యదేశం తూర్పుదక్షిణంగా 8కి.మీ.లదూరంలో పలాశవనం శ్వేతసరఃపురం అనే పేర్లతో పిలువబడుతూ అణ్ణన్‌కోయిల్‌గా ఒకేప్రాకారంలో రాజగోపురంతోనూ, ప్రకృతిసౌందర్యంతోనూ, చాలా ఏకాంతంగా విలసిల్లుతోంది. తిరుత్తేవనార్‌తొగై (కీళ్‌చాలై)కి పశ్చిమంగా ఒక కి.మీ.దూరంలో ఈ దివ్యదేశం అమరిఉంది. ఈ పేరుతో వ్యవహరించడంకన్నాకూడా అణ్ణన్ కోయిల్ అనియే ప్రసిద్ధిగాంచింది.

ఈ దివ్యదేశం మూలమూర్తి శ్రీనివాసుడిగా, కృష్ణుడిగా, నారాయణుడిగా, అణ్ణన్‌పెరుమాళ్‌గా, ఇలా అనేకరకాలుగా పిలువబడుతున్నారు. పూర్వాభిముఖంగా నిలుచున్నభంగిమలో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఉత్సవమూర్తికూడా పైన పేర్కొన్న పేర్లతోనే పిలువబడుతూ శ్రీభూసమేతుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. అలాగే అమ్మవార్ల మూలమూర్తి మరియు ఉత్సవమూర్తి పద్మావతి, అలమేల్‌మంగై, పూవార్–తిరుమగళ్ అనే నామములతో పిలువబడుతూ ప్రత్యేకసన్నిధిలో వేంచేసి ఉండి భక్తులను అనుగ్రహిస్తూన్నది. ఇక్కడున్న పుష్కరిణి శ్వేత పుష్కరిణిగా, విమానం తత్త్వరచితవిమానంగా ప్రసిద్ధిగాంచింది.

### స్థలపురాణం

దుందుమారుడు అనే ఇక్ష్వాకువంశీయుడైన ఒక మహారాజుకు బహుకాలం సంతానం కల్గలేదు. పిదప ఒక చక్కటి మగబిడ్డ జన్మించాడు. ఆ మగబిడ్డ పుట్టినప్పుడే చాలా తెల్లగా (శ్వేతవర్ణం) ఉండడంవల్ల అతనికి శ్వేతుడు అనే పేరు పెట్టారు. కులగురువు వశిష్ఠమహర్షి బిడ్డ జన్మించిన కాల విశేషాన్ని మరియు అతని వర్ణాన్ని చక్కగా పరిశీలించి బిడ్డ ఆయుష్షు తొమ్మిదిసంవత్సరాలే అని నిర్ధారించాడు. అతని ఆయుష్షు పెరగాలంటే తిరువెళ్ళక్కుళమ్ అనే దివ్యదేశానికి వెళ్లి ఆ స్వామిని ప్రార్థిస్తే అన్నీ సఫలమౌతాయి అని చెప్పాడు. తానుగూడా ఆ దివ్యదేశానికి వస్తానని ఆ మహారాజును ఆశ్వాస పరచడం జరిగింది. రాజుకూడా వశిష్ఠమహర్షి సూచనానుసారం తన భార్యాబిడ్డతోపాటు పలు ఆలయాలకు తీర్థయాత్రగా వెళ్లి చిట్టచివరగా తిరువెళ్ళక్కుళమునకు వచ్చాడు. ఆ సమయంలో కులగురువు వశిష్ఠుడుకూడా అక్కడికి చేరుకున్నాడు. అప్పుడు శ్వేతుణ్ణి అక్కడున్న పుష్కరిణిలో స్నానం చేయించి ఆ దివ్యదేశ భగవంతుణ్ణి సేవించుకోవడానికై దేవాలయానికి పిలుచుకుని వెళ్లాడు. పలుమహర్షులు అందరూ ఒకేచోట చేరారు. ఆ మునులలో మరుత్ అనే మహర్షి మరణాన్ని జయించే మృత్యుంజయమంత్రమైన నృసింహమంత్రాన్ని బాలుడైన శ్వేతునికి ఉపదేశించాడు. అతను నియమనిష్ఠలతో ముని ఉపదేశించిన





## విశేషాంశములు

| | |
|---|---|
| **భగవంతుడు** | : **మూలవర్లు, ఉత్సవర్లు ఇరువురు తూర్పుదిక్కున నిలుచున్నభంగిమలో శంఖచక్రవరద అభయహస్తములతో శ్రీనివాసుడు, కృష్ణుడు, నారాయణుడు, అణ్ణన్ మొదలగు తిరునామములతో వేంచేసి ఉండి భక్తులను అనుగ్రహిస్తున్నాడు.** |
| **అమ్మవారు** | : **పద్మావతి, అలమేల్మంగై, పూవార్-తిరుమగళ్.** |
| **తీర్థం** | : **శ్వేతపుష్కరిణి** |
| **విమానం** | : **తత్త్వత్రయవిమానం** |
| **మంగళాశాసనం** | : **తిరుమంగైఆళ్వారులు** |
| **ప్రత్యక్షం** | : **ఇక్ష్వాకురాజు, రుద్రుడు** |
| **ఆగమం** | : **పాంచరాత్రాగమం** |

మంత్రాన్ని తమిళ ఐప్పసినెల శుక్లపక్షదశమినుండి కార్తికం శుక్ల పక్ష కైశికఏకాదశివరకు ఎనిమిదివేలసార్లు నృసింహమంత్రాన్ని జపించాడు. బాలుడైన శ్వేతుని తీవ్రతపస్సుకు మెచ్చి సంతసించిన భగవంతుడు అతనిముందు సాక్షాత్కరించి పరిపూర్ణమైన ఆయుష్షును అనుగ్రహించాడు. ఇలా శ్వేతునికి కలిగిన దుఃఖాన్ని తీర్చిన కారణంచేత ఈ దివ్యదేశం తిరువెళ్ళక్కుళమ్ అని వ్యవహరింపబడుతోంది.

## ఐతిహ్యం

పన్నిద్దరుఆళ్వారులలో తిరుమంగైఆళ్వారులు తమ ప్రబంధంలో 'కణ్ణార్-కడల్' అని ప్రారంభించి 'అణ్ణాఅడియేన్' అని శ్రీనివాసుని నాంగూర్ మధ్యనాయకుడైన అణ్ణన్ భగవంతుని క్రమంగా మంగళాశాసనం చేశారు. ఆళ్వారులు మంగళాశాసనం చేసినవిధంగా ఈ దివ్యదేశంలో భగవంతుడు శ్రీనివాసునిగా, అమ్మవారు పద్మావతిగా కొలువబడుతున్నారు. సాక్షాత్తు శ్రీనివాసునికి అన్నగా ఈ దివ్యదేశం భగవంతుణ్ణి కీర్తించే భక్తులు అన్న నివసించే గుడి అని వ్యవహరించడంచేత అణ్ణన్‌కోయిల్ అని ఈ దివ్యదేశానికి పేరొచ్చింది. అందుచేత దక్షిణతిరుపతిగాను ప్రసిద్ధిపొందింది. వేంకటాచలంలో భగవంతుడు తాను ఒక్కడిగా, అమ్మవారు కొండక్రింద ఉండడం అనే కొరతను తీర్చడానికై ఈ అణ్ణన్‌కోయిల్‌లో అమ్మవారితో పాటు స్వామి వేంచేసి ఉండి భక్తులను అనుగ్రహిస్తున్నాడనే ఐతిహ్యం సుప్రసిద్ధం.

## అతిముఖ్యమైన విషయం

అర్చావతారమూర్తుల్లో ఎనభైఆరు దివ్యదేశ భగవంతులని మంగళాశాసనం చేసిన తిరుమంగైఆళ్వారుల ధర్మపత్ని కుముదవల్లినాచ్చియార్ ఈ దివ్యదేశపుష్కరిణిలోనే అవతరించిందని స్థలపురాణం. అలాగే ఈ కుముదవల్లినాచ్చియార్‌కు ఈ దివ్యదేశంలో ప్రత్యేకసన్నిధి ఉంది. కారణం నీలన్ అని పేరున్న ఈ తిరుమంగైఆళ్వారును ఒక శ్రీవైష్ణవుడిగా మార్చి ప్రతిదినం వెయ్యిమంది భాగవతులకు తదీయారాధన (భోజనం) చేయించి పరిపూర్ణభగవదనుగ్రహానికి పాత్రుణ్ణి చేసిన ఘనత ఈ కుముదవల్లీఅమ్మవారిదే.

**శ్రీమచ్ఛ్వేతసరః పురే తు భగవాన్ నారాయణో నామితః**
**పద్మస్థా దయితా చ తత్త్వరచితం తద్వ్యోమయానోత్తమమ్।**
**తీర్థం శ్వేతసరః సురాధిపదిశం సంవీక్షమాణో అనిశమ్**
**శ్వేతాఖ్యే నగరాధిపేన చ పురా సాక్షాత్కృతో రాజతే॥**

### వైకుంఠపాళి
### :: *108* – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ము | క్కో | టి | 2 ఏ | కా | 3 ద | శి | | | | 4 భో |
| క్క | | | కా | | శ | | | 5 చో | ళ్లం | గి |
| ను | | | 6 వ | ర్ష | | | 7 వే | | | పం |
| 8 ము | క్తా | వ | ళి | | 9 క | | 10 మ | న్మ | థు | డు |
| | | | | | ను | | న | | | గ |
| 11 మ | క | 12 ర | సం | క్ర | మ | ణం | | 13 పు | ష్య | |
| ణి | | త్న | | | | | 14 సు | | | 15 తి |
| గ్రీ | | 16 మా | హి | ష్మ | 17 తీ | పు | ర | ము | | రు |
| వు | | ల | | | ర్థ | | స | | 18 వే | ప |
| డు | | | 19 సా | | వా | | | | | తి |
| | | | 20 మి | ను | సి | క | గ | లా | డు | |



ఇతరులు నీతో ఎలా ఉండాలనుకుంటావో ముందు నువ్వు అలా ఉండు

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## తిరుపతి

### జనవరి 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |



శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు, తిరుమల

### ఫిబ్రవరి 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | |

### మార్చి 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 30 | 31 | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

#### జనవరి

01 ఆంగ్లసంవత్సరాది
06-12 ఆండాళ్ నీరాట్టోత్సవం
10 ముక్కోటిఏకాదశి
13 భోగిపండుగ
14 మకరసంక్రాంతి
15 కనుమపండుగ, శ్రీ గోదాదేవి పరిణయోత్సవం, తిరుమల శ్రీవారి ప్రణయకలహమహోత్సవం
17 తిరుమళిశైఆళ్వార్ వర్షతిరునక్షత్రం
18 త్యాగరాజస్వామివారి ఆరాధన
20 కూరత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం
26 భారతగణతంత్ర దినోత్సవం
29 పురందరదాసుల ఆరాధనమహోత్సవం
జనవరి 29 నుండి ఫిబ్రవరి 06 వరకు
శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, దేవునికడప

#### ఫిబ్రవరి

03 వసంతపంచమి
04 రథసప్తమి
05 భీష్మాష్టమి
08 భీష్మఏకాదశి
12 రామకృష్ణతీర్థముక్కోటి
18-26 వరకు
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, శ్రీనివాసమంగాపురం
19-28 వరకు
శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి
26 మహాశివరాత్రి

#### మార్చి

06-14 వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం, తరిగొండ
07 తిరుక్కచ్చినంబి శాత్తుమొఱ
09 కులశేఖరాళ్వార్ వర్షతిరునక్షత్రం
09-13 వరకు తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
14 శ్రీలక్ష్మీజయంతి, కుమారధారాతీర్థముక్కోటి
24-28 వరకు శ్రీవేదనారాయణస్వామివారి సూర్యపూజ మరియు తెప్పోత్సవం, నాగులాపురం
26 అన్నమాచార్య వర్ధంతి
మార్చి 27 నుండి ఏప్రిల్ 04 వరకు
శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి
30 శ్రీవిశ్వావసునామ ఉగాది
31 మత్స్యజయంతి

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## తిరుపతి



దేవేరులతో శ్రీ గోవిందరాజస్వామివారు, తిరుపతి

### ఏప్రిల్ 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |

### మే 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

### జూన్ 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |

### ఏప్రిల్

03-11 వరకు శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం, వాయల్పాడు
06-14 వరకు శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం, ఒంటిమిట్ట
06 శ్రీరామనవమి
07 ధర్మరాజదశమి
10-12 వరకు తిరుమల శ్రీవారి వసంతోత్సవం
11 తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి పంగున్యుత్తరం, పూలంగిసేవ, శాలనాచ్చియార్ శాత్తుమొఱ
12 తుంబురుతీర్థముక్కోటి
13-21 వరకు శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం, నాగులాపురం
14 తమిళసంవత్సరాది
30 పరశురామజయంతి, భృగుమహర్షి, శ్రీనివాస దీక్షితులు వర్షతిరునక్షత్రాలు; అక్షయతృతీయ

### మే

01 మే డే
02 శ్రీరామానుజజయంతి, శ్రీశంకరజయంతి
03 శ్రీరామజయంతి, మొదలియాండాన్ వర్షతిరునక్షత్రం
06-08 వరకు శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవం, తిరుమల
09-12 వరకు శ్రీపద్మావతీతాయార్ల వసంతోత్సవం, తిరుచానూరు
10 మధురకవిఆళ్వార్, అనంతాళ్వాన్‌ల శాత్తుమొఱ
11 నృసింహజయంతి, తరిగొండ వెంగమాంబ జయంతి
11-19 వరకు శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాలు, హృషీకేశ్, నారాయణవనం
11-19 వరకు శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, జమ్మలమడుగు
12 కూర్మజయంతి, అన్నమాచార్యజయంతి
13 తిరుపతి గంగజాతర
14 పరాశరభట్టర్ వర్షతిరునక్షత్రం
15 సరస్వతీనదీ పుష్కరారంభం
19-27 వరకు శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం, కార్వేటినగరం
22 హనుమజ్జయంతి

### జూన్

02-10 వరకు శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి
05 మెయిన్ వరదరాజస్వామి వర్షతిరునక్షత్రం
06-10 వరకు శ్రీపద్మావతీతాయార్ల తెప్పోత్సవం, తిరుచానూరు
07-15 వరకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, అప్పలాయగుంట
09 నమ్మాళ్వార్ శాత్తుమొఱ
09-11 వరకు తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
11 ఏరువాకపూర్ణిమ
17-19 వరకు శ్రీసుందరరాజస్వామివార్ల అవతారోత్సవం, తిరుచానూరు
27 జగన్నాథరథయాత్ర
జూన్ 30 నుండి జూలై 02 వరకు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం, శ్రీనివాసమంగాపురం

# తిరుమల తిరుపతి దేవస్థానములు
## తిరుపతి

### జూలై 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |



దేవేరులతో శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారు, శ్రీనివాసమంగాపురం

### ఆగష్టు 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 31 | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

### సెప్టెంబరు 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

#### జూలై

01 మరీచిమహర్షి వర్షతిరునక్షత్రం
05 పెరియాళ్వార్ శాత్తుమొఱ
06 శయనైకాదశి, తొలిఏకాదశి, చాతుర్మాస్య ప్రారంభం
07 శ్రీనాథమునుల వర్షతిరునక్షత్రం
10 గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ, ఆషాఢపూర్ణిమ
12 శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ
16 తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం
20 ఆడికృత్తిక
25 చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం
28 నాగచతుర్థి, ఆండాళ్ తిరువాడిప్పూరం శాత్తుమొఱ
29 గరుడపంచమి
30 కల్కిజయంతి, కశ్యపమహర్షిజయంతి

#### ఆగష్టు

02 తరిగొండవెంగమాంబ వర్ధంతి
04- 07 వరకు శ్రీవారి పవిత్రోత్సవం, తిరుమల
08 ఆళవందార్ల వర్షతిరునక్షత్రం, వరలక్ష్మీవ్రతం
09 శ్రావణపూర్ణిమ, జంధ్యాలపూర్ణిమ, రాఖీపండుగ, శ్రీహయగ్రీవజయంతి, విఖనసమహామునిజయంతి
10 గాయత్రీజపం
15 భారతస్వాతంత్ర్యదినోత్సవం
16 కృష్ణాష్టమి, గోకులాష్టమి
23 పోలాల అమావాస్య
25 బలరామజయంతి, వరాహజయంతి
27 వినాయకచవితి
28 ఋషిపంచమి

#### సెప్టెంబరు

04 వామనజయంతి
04- 07 వరకు శ్రీపద్మావతీతాయార్ల పవిత్రోత్సవం, తిరుచానూరు
05 ఉపాధ్యాయ దినోత్సవం
06 అనంతపద్మనాభవ్రతం
21 మహాలయ అమావాస్య
సెప్టెంబరు 24 నుండి అక్టోబరు 02 వరకు
శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవం, తిరుమల;
శ్రీపద్మావతిఅమ్మవారి నవరాత్రిఉత్సవం, తిరుచానూరు
28 శ్రీవారి గరుడోత్సవం, తిరుమల
29 శ్రీవారి స్వర్ణరథరంగడోలోత్సవం, తిరుమల; సరస్వతీపూజ
30 దుర్గాష్టమి

## తిరుమల తిరుపతి దేవస్థానములు
## తిరుపతి



దేవేరులతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు, అప్పలాయగుంట

### అక్టోబరు 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

### నవంబరు 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| 30 | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |

### డిసెంబరు 2025

| ఆది | సోమ | మంగళ | బుధ | గురు | శుక్ర | శని |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

### అక్టోబరు

01 తిరుమల శ్రీవారి మహారథోత్సవం, మహానవమి
02 విజయదశమి, గాంధీజయంతి
09 అట్లతద్దె
20 నరకచతుర్దశి, దీపావళిపండుగ
21 కేదారగౌరీవ్రతం
24 తిరుమలనంబి శాత్తుమొఱ
25 నాగులచవితి
27 మనవాళమహాముని శాత్తుమొఱ
28 సేనైమొదలియార్ వర్షతిరునక్షత్రం
30 వేదాంతదేశికుల శాత్తుమొఱ; పిళ్లైలోకాచార్య, పొయ్‌గై ఆళ్వార్, అత్రిమహర్షుల వర్షతిరునక్షత్రాలు; తిరుమల శ్రీవారి పుష్పయాగం
31 పూదత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, యాజ్ఞవల్క్య జయంతి

### నవంబరు

01 ప్రబోధనైకాదశి, పేయాళ్వార్ వర్షతిరునక్షత్రం
02 క్షీరాబ్దిద్వాదశి, కైశికద్వాదశి
05 శ్రీకపిలేశ్వరస్వామివారి అన్నాభిషేకోత్సవం, తిరుపతి సువర్ణముఖరీతీర్థముక్కోటి, రుద్రపాదాలు, కార్తికపూర్ణిమ, జ్వాలాతోరణం
14 బాలలదినోత్సవం
17-25 వరకు శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవం, తిరుచానూరు
17 ధన్వంతరిజయంతి
21 శ్రీపద్మావతిఅమ్మవారి గజవాహనోత్సవం, తిరుచానూరు
22 శ్రీపద్మావతిఅమ్మవారి గరుడోత్సవం, తిరుచానూరు
24 శ్రీపద్మావతిఅమ్మవారి రథోత్సవం, తిరుచానూరు
25 శ్రీపద్మావతిఅమ్మవారి పంచమీతీర్థం, తిరుచానూరు
26 శ్రీపద్మావతిఅమ్మవారి పుష్పయాగమహోత్సవం, తిరుచానూరు; సుబ్రహ్మణ్యషష్ఠి

### డిసెంబరు

01 గీతాజయంతి
02 చక్రతీర్థముక్కోటి
03 హనుమద్వ్రతం
04 కపిలతీర్థముక్కోటి, తిరుమంగైఆళ్వార్ శాత్తుమొఱ, దత్తజయంతి
05 తిరుప్పాణాళ్వార్ వర్షతిరునక్షత్రం
07 శ్రీకపిలేశ్వరస్వామివారి లక్షబిల్వార్చన, తిరుపతి
16 ధనుర్మాసారంభం
19 తొండరడిప్పొడిఆళ్వార్ వర్షతిరునక్షత్రం
శ్రీవారిసన్నిధిన అధ్యయనోత్సవ ప్రారంభం, తిరుమల
30 వైకుంఠఏకాదశి
31 శ్రీ స్వామిపుష్కరిణీతీర్థముక్కోటి

# వారణాసి ప్రాముఖ్యత

- డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

కాశ్యాం హి కాశతే కాశీ, కాశీ సర్వప్రకాశికా।
సా కాశీ విదితా యేన్, తేన ప్రాప్తా హి కాశికా॥

కాశీ వెలుగుల కాంతి, ఆత్మ అయిన అవగాహన, మేల్కొనేస్థితిలో కంటిచూపు ఆకారాలు మరియు రంగులకు తేలికగా ఉంటుంది మరియు చెవులు శబ్దాలకు తేలికగా ఉంటాయి. మనస్సే సమస్తజ్ఞానానికి వెలుగు. కలగనే స్థితిలో కూడా, అవగాహనయొక్క కాంతి మనస్సు మరియు దాని అంచనాలన్నింటినీ ప్రకాశింపజేస్తుంది. ఈ అవగాహనయొక్క కాంతి శివం మరియు శరీరం-మనస్సు కాశీనగరం.

భారతదేశంలోని ఉత్తరప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన వారణాసిజిల్లాలో ప్రథమ జ్యోతిర్లింగం విశ్వనాథ శివలింగ రూపం. శివుడు కాశీవిశ్వనాథునిరూపంలో కాంతిస్తంభంగా దర్శనమిచ్చే ప్రదేశం. అక్షం నుండి చిహ్నం, ఇది సృష్టియొక్క ప్రధానభాగంలో అత్యున్నత నిరాకార నిర్గుణస్వరూపం. వాస్తవికతను సూచిస్తూ ఉంటుంది. భారతదేశపు అతి ప్రాచీన నగరాలలో ఒకటైన వారణాసి లేదా కాశీగా పిలువబడే స్థలం. హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. ఇక్కడ ప్రవహించే నది గంగానది. ఈ నదిలో స్నానం ఆచరిస్తే సర్వ పాపహరణం, పునర్జన్మనుండి విముక్తి లభిస్తాయని పురాణాలు తెలియచేస్తున్నాయి. వరణ, అసి అనే రెండు నదులు ఈ నగరంవద్ద గంగానదిలో కలవటంవలన వారణాసిగా చెప్పబడుతోంది. వారణాసినగరం మరియు దాని పరిసర ప్రాంతాలు కలిపి సుమారు 112.26 చదరపుకిలోమీటర్లు కలిగి ఉంటుంది. ఈ విశ్వేశ్వరాలయం అనేకసార్లు దుష్టుల కూల్చివేతలకు లోనైనా, ఈ నగరం ప్రాశస్త్యాన్ని తగ్గింపలేకపోయారు. మహాప్రళయకాలంలోకూడా చెక్కు చెదరదని శాస్త్రవచనం. ఈ దేవాలయం నిర్మాణాన్ని 1780లో ఇండోర్‌నకు చెందిన మరాఠాపాలకుడు అహల్యాబాయి హోల్కర్ నిర్మించాడు. అసలు శివలింగ రూపం బావిలో నిక్షిప్తమై ఉన్నదని తెలుస్తోంది. గంగా నదిని ప్రధానఆలయంతో అనుసంధానించే కాశీ విశ్వనాథధామ్ కారిడార్ ఏర్పరచారు. విశ్వనాథ అనగా విశ్వానికి ప్రభువు. విశ్వమంతటా ఆరాధించే భక్తులు కాశీవిశ్వనాథుని సగటున రోజుకు 45వేలమంది దర్శించుకుంటారు. ప్రపంచం లోనే అవిచ్ఛిన్నంగా జనావాసం ఉన్న నగరాలలో అత్యంత పురాతనమైనది ఈ క్షేత్రం.

భారతదేశపు ఆధ్యాత్మిక రాజధాని ఐన ఈ క్షేత్రంలో విశ్వేశ్వర, అన్నపూర్ణ, విశాలాక్షి, వారాహిమాత, తులసీమానస, సంకటమోచన గణపతి, కాలభైరవ, దుర్గామాత, భారతమాత, లోలార్కుడు అనే ప్రధానదేవతలు కొలువై ఉన్నారు. ఈ క్షేత్రపాలకుడు కాలభైరవుడు. ఈ నగరాన్ని వారాహిమాత కాపాడుతూ ఉంటుంది. రాత్రిసమయంలో వారాహిమాత నగర సంచారం చేస్తూ నిశాచరిగా ఉంటుంది. పగలు ఆమె విశ్రమించటంవలన, ఆమెకు నిద్రాభంగం కలుగకుండా మందిర పైభాగంనుండి మనకు లఘుదర్శనం లభిస్తుంది. పగటి సమయంలో కాలభైరవుడు నగరాన్ని రక్షిస్తూ ఉంటాడు. దీపాల నగరం, విద్యానగరం, సంస్కృతి రాజధానివంటివాటితోకూడా వర్ణించే ఈ వారణాసిగూర్చి అమెరికన్ రచయిత మార్క్‌ట్వైన్ బెనారస్‌నగరం "చరిత్రకంటే పురాతనమైనది, సంప్రదాయం కంటే పురాతనమైనది, గాథలకంటే ముందున్నది, వీటన్నిటినీ



కలిపినా బెనారస్‌నగరంకంటే తరువాతవే అవుతాయి" అని అభివర్ణించారు.

కేవలం నీటితో అభిషేకిస్తేనే అభయమిచ్చే ఆదిశంక రుడు, అన్నంపెట్టి ఆదరించే అన్నపూర్ణమ్మ, కాలాన్ని శాసించే కాలభైరవుడు, సర్వదేవతా సైన్యాధ్యక్షురాలు వారాహీమాత, విశాలాక్షిదర్శనం ముఖ్యంగా చెప్పబడ్డాయి.

మహాశివరాత్రి, కార్తికమాసంలో అత్యంత వైభవంగా విశ్వనాథునికి ప్రత్యేకసేవలు నిర్వహిస్తారు. మాతాన్నపూర్ణేశ్వరికి స్వర్ణకవచాలంకారం, దీపావళిపర్వదినంనుండి సుమారు ఏడు రోజులు ఉంచుతారు. వారణాసియాత్రకు వెళ్ళినవారు తప్పని సరిగా కాలభైరవుని దర్శించుకోవాలి. చింతామణి గణేష్, సంకటనాశక గణపతిదర్శనం సంతోషదాయకం.

స్కాందపురాణాంతర్గతక్షేత్రం గంగాతటి వారణాసి, రాజసమైన నా క్షేత్రం ఇదే అని మహాశివుడే ప్రకటించాడని కాశీఖండంలో ప్రస్తావన ఉంది. కాశీఘాట్‌లలో విశిష్టమైనది హరిశ్చంద్రఘాట్. ఎందరికో ముక్తినిచ్చి శివైక్యం చేసిన ఘాట్. తల్లిగర్భంలో శిశువు రూపుదిద్దుకుంటున్న 275 రోజులు ఇక్కడ గడిపితే మంచిదట.

ఇది వీలుకానట్లయితే ఉత్తరాయణంలో ఈ మహా క్షేత్రంలో కనీసం తొమ్మిది దివారాత్రములు గడపాలని శాస్త్ర వచనం. పవిత్ర గంగానదిలో స్నానం చేసి, విశ్వనాథుని దర్శించుకుని జపమాచరించి, దానములను, పితృకార్యములను నిర్వహించినట్లయితే పాపపరిహారంతోపాటు మరుజన్మ ఉండదని ప్రగాఢవిశ్వాసం. అక్కడే మరణించాలని, ఆ మట్టిలో కలసి పోవాలని భక్తులు తమతమ చివరిదశలో వారణాసి చేరుకుని, అంతిమసమయంకోసం వేచిచూస్తూ ఉంటారు.



రాగాదిదోష రహితం, స్వజనానురాగం
వైరాగ్య శాంతి నిలయం, గిరిజాసహాయం
మాధుర్య ధైర్య శుభగం, గరళాభిరామం
వారాణసిపురపతిం భజ విశ్వనాథం.

గంగాస్నానం అనంతరం కాయాపేక్ష, ఫలాపేక్ష లేకుండా చేయమని, కాయం అంటే శరీరంపై మమకారం ఫలాపేక్ష అంటే ఫలితం ఆశించని మోక్షసాధన చేసే బుద్ధి ప్రసాదించుమని మంత్రపూర్వకంగా గంగానదిలో వదిలేయటం. కాని నేడు భుజించే కాయో, పండో వదిలేసి పరిత్యజించు కున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఇహంలో శరీరంపై చింతలు, కోరికలు నశించాలని శాస్త్రం చెప్పినమాట.

'కాశ్యాన్తు మరణాన్ ముక్తి'- కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుంది అని పురాణవచనం.

వ్యక్తికి జనన మరణ చక్రంనుండి శాశ్వత ముక్తి లభిస్తుంది. అందుకే దీనిని ముక్తిస్థలం అనికూడా పిలుస్తారు. పితృకార్యాలు, పిండప్రదానాలు చేసి ముందుతరాలవారినికూడా తరింపచేస్తారు.

ఋగ్వేదం, రామాయణం, మహాభారతం, స్కాంద పురాణంవంటి హిందూ ఆధ్యాత్మికగ్రంథాల్లో కాశీనగరంలో నిర్వహించవలసిన విధులప్రసక్తి ఉంది. కురుక్షేత్రయుద్ధం అనం తరం, పాండవులు భ్రాతృహత్య, బ్రహ్మహత్యాపాతకాలనుండి విముక్తులవటానికి సప్తముక్తిపురాలలో ప్రథమస్థానమైన కాశీ విశ్వనాథుని దర్శించుకున్నారు.

దశాశ్వమేధఘాట్, దర్భంగాఘాట్, మణికర్ణికాఘాట్, హనుమాన్‌ఘాట్‌లనందు ప్రతి ఉదయం మరియు సాయంత్రం గంగాహారతి అత్యంత విశేషంగా నిర్వహిస్తారు. ప్రతీరోజు మధ్యాహ్నం 12 గంటలకు మణికర్ణికాఘాట్‌నకు సర్వదేవతలు వచ్చి, గంగాస్నానమాచరిస్తారని ప్రతీతి. ప్రతీరోజు సాయంత్రం దశాశ్వమేధఘాట్‌నందు జరిగే గంగాహారతి కార్యక్రమం మనిషి జీవితంలో ఒక్కసారైనా ప్రత్యక్షవీక్షణం చేసుకుంటే పునర్జన్మ ఉండదు. వారణాసిలో మొత్తం 84ఘాట్‌లు ఉన్నట్లు చెబుతారు.

వారణాసినగరాన్ని పురాణాల్లో, ఇతిహాసాలలో అవిమిత్తక, ఆనందకానన, మహాశ్మశాన, సురధాన, బ్రహ్మవర్ధ, సుదర్శన, రమ్య, కాశి అనే వివిధనామాలతో ప్రస్తావించారు.

మోక్షసాధనం- వారణాసి- ముక్తిప్రధానం.

గృహలక్ష్మి

# త్యాగం

- శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి,
82775 32959

చ్యవనుడు భృగుమహర్షి పుత్రుడు. ఇతడు అడవిలో తపస్సు చేసుకుంటూండగా తనచుట్టూ పుట్టలు పెరిగి అతడి శరీరం పుట్టలతోను, పూలతీగలతోను కప్పబడిపోయింది.

ఆ సమయంలో శర్యాతిమహారాజు కుమార్తె 'సుకన్య' చ్యవనుడు తపస్సు చేసుకుంటున్న ప్రాంతానికి వచ్చింది. ఆమె అక్కడ ఒక పుట్టనుంచి అపూర్వమైన వెలుగులు రావడం చూసింది. ఆ కాంతులు వెదజల్లుతున్నది మిణుగురుపురుగులని భావించి వాటిని బయటకు రప్పించాలని పుల్లతో పొడిచింది. అప్పుడు ఆ వెలుగు మాయమవడంతో ఆ పుట్టను తొలగించు మని భటులను ఆజ్ఞాపించింది. వారికి అక్కడ కంటినుంచి రక్తధారలు కారుతున్న నేత్రాలతో బక్కచిక్కి తపస్సమాధిలో ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. రాజకుమారి భయపడి అక్కడినుంచి పరుగున తండ్రివద్దకు వెళ్ళిపోయింది.




ఈ సంఘటన జరిగిన మరుక్షణమే మహారాజుకు, అతని సైనికసపరివారానికి వారి శరీరద్వారబంధనంతో భరించ రాని బాధకు గురయ్యారు. కారణం తెలియక మహారాజు ఆందోళన చెందాడు. అప్పుడు సుకన్య సంగతి తండ్రికి చెప్పింది. అదివిని మహారాజు చ్యవనుడివద్దకెళ్లి తన కుమార్తె తెలియక చేసిన అపరాధాన్ని మన్నించి క్షమించుమని, తమ శారీరక బాధలను ఉపశమింప చేయాల్సిందిగా వేడుకొన్నాడు. అందుకు రాజకుమారిని తనకిచ్చి వివాహం చెయ్యమని, ఆమె చేసే సపర్యలే తనకు ఉపశమనాన్ని కలిగిస్తాయని చెప్పాడు. అందుకు సుకన్య తనవల్ల జరిగిన తప్పుకు తానే బాధ్యురాలినని, తనవల్ల వేరెవరికీ బాధకలుగకూడదని చ్యవనమహర్షిని వివాహ మాడింది. భక్తిశ్రద్ధలతో ఆ మునీశ్వరుడికి సేవలు చేస్తోంది.

ఇలా ఉండగా ఒకనాడు అశ్వినీదేవతలు 'సుకన్య'ను చూచి నీవెవ్వరు? అని అడిగారు. వారికి ఆమె తన వృత్తాంతం తెలిపింది. అదివిన్న అశ్వినీదేవతలు తమలో ఒకరిని వరించి– భోగభాగ్యాలు అనుభవించుమని చెప్పారు. అదివిన్న ఆమె ఆశ్రమానికెళ్లి, భర్తతో విషయం చెప్పింది. అదివిన్న చ్యవనుడు ఆమెను తిరిగి వెళ్ళి, 'నవయవ్వనుడైన తనభర్తతో కలిసి రమ్మని' వారికి చెప్పుమని ఆమెను తిరిగి పంపాడు. ఆమె వారికి అలాగే చెప్పింది.

అదివిన్న అశ్వినీదేవతలు చ్యవనమహర్షిసహితంగా పయోష్టినదిలో మునిగి ముగ్గురూ ఒకేరూపంలో నదినుండి బయటికొచ్చి తమలో ఒకరిని ఎంపిక చేసుకొని వరించుమని చెప్పారు. పతివ్రతాశిరోమణి సుకన్య వారిలో తన భర్తను గుర్తించి అతనినే వరించింది. ఋజువర్తనులకు అసాధ్యమేముం టుంది మరి!!

ఎవరి దగ్గరికీ ఎవరూ వెళ్లరు. ఎవరినైనా, ఎక్కడైనా కలిపేది భగవంతుడే!

యువత

# మాటే మంత్రము

– ప్రొ|| జి.వి.శేషారెడ్డి, 80748 26819

సంభాషించడం ఒక అందమైన కళ. మన సంభాషణ ఆసక్తికరంగా ఉంటేనే ఎదుటివారు మనతో సంభాషించటానికి ఇష్టపడతారు. లేదంటే మనతో సంబంధాన్ని, స్నేహాన్ని తుంచేసుకుంటారు. ఎదుటివారితో మాట్లాడేముందు మనతో మనం మాట్లాడుకోవాలి. ప్రతిరోజు మీరు మీతో మాట్లాడుతూ మీరు చేసే పనులను, ఫలితాలను చర్చించుకుంటూ మిమ్మల్ని మీరు బాగా తెలుసుకున్నపుడే ఎదుటివారితో బాగా సంబంధ బాంధవ్యాలని కొనసాగించగలరు.

మాట లేకుంటే చోటే లేదన్నది ఓ సామెత. ఆ చోటన్నది ఊళ్లో అయినా.. ఎదుటివాళ్ల గుండెల్లోనైనా! మనిషి సంగతి చెప్పేది మాటే. ఉపాధ్యాయులనుంచి రాజకీయ నాయకులవరకూ, సాహితీ ఉపన్యాసకులనుంచి కార్పొరేట్ బృందనాయకులవరకూ ఏ రంగంలోనివారైనా సరే గెలవాలంటే ప్రసంగకళమీద పట్టు సాధించాల్సిందే.

సత్యం దేవతల వ్రతం అని, అసత్యం చెప్పడం అసురుల స్వభావమని వేదవిదులు అంటున్నారు. అసత్యవాదులు జీవించినా మరణించినవారితో సమానమని వేదోక్తి. పైశున్యం అనగా చాడీలు చెప్పడం. దీనివలన కుటుంబాలలో కలహాలు, సన్నిహితులతో విరోధాలు ఏర్పడతాయి. పరస్పరం అసూయ, అసహనం ఏర్పడతాయి. ఇతరులనుండి అవమానాల్ని, అవహేళనల్ని పొందాల్సి ఉంటుంది. వీరు సాంఘికజీవనం కోల్పోతారు. అసందర్భప్రలాపం, పరమాత్మ ప్రసాదించిన వాక్కును ఆచితూచి వినియోగించాలి. అనవసరంగా, అసందర్భంగా వ్యర్థంగా మాట్లాడకూడదు. ఎడతెగకుండా మాట్లాడుతుంటే ఇతరులకు చిరాకుపుడుతుంది. ఇక చాలామంది మాట్లాడుతూ పోతూనే ఉంటారు. ఎదుటివారు ఏమి చెప్పాలి అనుకుంటున్నది అస్సలు వినరు. తాము చెప్పిందే వేదం అనుకుంటారు. ఇలా ఎప్పుడూ చేయరాదు. ఎదుటివారు ఏమి చెప్తున్నారోకూడా వినరు. ఏదో పని ఉన్నట్టుగా బడబడా మాట్లాడేసి వెళ్లిపోతారు.

మన పలకరింపు పులకరింపు కావాలి, నోరు మంచిదైతే ఊరంత మంచినే. మనిషి ఎప్పుడూ ఏదో వాగుతూ ఉండటాన్ని 'వాచాలతో' అంటారు. మాట్లాడటానికి కొన్ని హద్దులుంటాయి. హద్దు దాటకుండా మాట్లాడేవారు గొప్ప వారు. హద్దులు మీరి విచ్చలవిడిగా మాట్లాడేవారు అల్పులు. మాటలో ఏముంది అని ప్రశ్నించుకుంటే మాటలోనే అంతా ఉంది అనే సమాధానం వస్తుంది. మాటలు శ్రుతిమించితే అనర్థాలకు దారితీస్తాయి. మాట్లాడేముందు జాగ్రత్తగా ఆలోచించాలి. మాట పదునైన ఆయుధం. అది దుర్వినియోగం అయితే ఎదుటివారి హృదయాలను చీల్చివేస్తుంది. మాటతో ఎదుటివారిని బ్రతికించవచ్చు. చంపనూవచ్చు. మాట విషయంలో సంయమనం ఎంతో అవసరం. లేకుంటే మనిషికి గౌరవం లభించదు. లోకంలో తప్పులు చేయనివారు ఎవరూ.. ఉండరు. ఎదుటివారిలో తప్పులు కనబడినప్పుడు మర్యాదగా వాటిని ప్రస్తావించాలి. మనసు నొచ్చుకోకుండా చెప్పాలి. మాటలు శ్రుతిమించినప్పుడు వాటిని అదుపులో పెట్టేది మౌనం. మౌనంవల్ల కలహాలు దూరమవుతాయి. అతిగా మాట్లాడటం వల్ల మనిషిలో ప్రాణశక్తి తగ్గిపోతుంది. మౌనంవల్ల ప్రాణం పెరుగుతుంది. అందుకే పూర్వకాలంలో తపస్యులు మౌనాన్ని పాటించేవారు. అతిగా మాట్లాడేవారిలో అనుకోకుండానే కొన్ని దుర్గుణాలు వచ్చి చేరతాయి. ఎదుటివారి వ్యక్తిగతజీవితంలో తొంగిచూడటం, ఎవరూ కోరకుండానే ఉచితసలహాలు ఇవ్వడం కనిపిస్తుంది. దీనివల్ల అతడిపై చులకనభావం ఏర్పడుతుంది. విరోధం పెరుగుతుంది.

బ్రహ్మదేవుడు కేవలం మానవులకే మాట్లాడగల శక్తిని ప్రసాదించాడు. మానవుల్లాగ జంతువులు, పక్షులు మాట్లాడలేవు. ఈ కారణంగా మనిషి గొప్ప అదృష్టవంతుడే. ఇతర జీవజాలానికి లేని అరుదైన ఈ వరాన్ని పొందిన మనిషి ప్రాణశక్తిలా భావించి, పొదుపుగా వాడుకోవాలి. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు ప్రాచీనులు. అన్నివిషయాల్లో అతిగా ప్రవర్తించడం మానేయాలని దీని అర్థం.

మాట విలువ తెలిసిన వక్తలు ఏది అవసరమో దాన్నే చెబుతారు. మాట విలువ తెలియనివారు పనికిరానిదంతా వాగుతుంటారు. లోకంలో అందరూ మాట్లాడతారు కానీ కొందరే మధురభాషణులుగా మిగిలిపోతారు. మధురంగా మాట్లాడేవారి

మాటలను మళ్ళీ మళ్ళీ వినాలని అనిపిస్తుంది. నిస్సారంగా మాట్లాడేవారిని చూస్తే తప్పించుకుపారిపోవాలని అనిపిస్తుంది. మంచికి చెడుకూ ఉండే తేడా ఇదే..

మితభాషణం అమితానందదాయకం. లోకంలో అపారకీర్తిని గడించిన మహనీయులందరూ మితభాషులే. అరుపులు వినడానికి కర్ణకఠోరంగా ఉంటాయి. అవసరం ఉన్నా, లేకున్నా కాకులు అరుస్తూనే ఉంటాయి. కానీ, కోకిల వసంతకాలం వచ్చినప్పుడే కమ్మగా కూస్తుంది. కోకిలకూతలు వినాలని అందరూ ఇష్టపడతారు. కాకి అరుపులు ఎవరూ వినడానికి ఇష్టపడరు. కనుక మనిషి వాచాలతను తగ్గించుకొని మితభాషి, హితభాషి కావాలి.

"మన మనసేమిటో వాక్కులద్వారా వెల్లడవుతుంది. ఆత్మీయత, ఆప్యాయతానురాగాలు మాటల్లో అమృతాన్ని నింపుతాయి. అసూయ, ద్వేషం నిండిన వాక్కులు విషాన్ని వెదజల్లుతాయి. వాక్కులే మన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి, వాక్కులతోపాటు ముఖకవళికలు, శరీరకదలికలూ ఎంతో ప్రాముఖ్యం వహిస్తాయి.

ఇక సంభాషణలలో చాలా రకాలు ఉన్నాయి. హిత భాషణం, మితభాషణం, స్మితభాషణం, పూర్వభాషణం– ఇలా చాలావిధాలు ఉన్నాయి. ఇవన్నీ ఒకే మనిషివద్ద ఉంటే అతని చెంతనే మనకు ఉండాలనిపిస్తుంది. హితభాషణం అన్నిటిలోకి చాలా కష్టమైనవిధానం. అవతలివాడికి హితం చెప్పటం. అది సామాన్యమైన విషయం కాదు. ఎందుకంటే, సలహాలు ఎవరూ సంతోషంగా స్వీకరించరు. ఎవరికైతే అవి అవసరమో, వారు తిరస్కరిస్తారు. క్లుప్తంగా ఎంతవరకు మాట్లాడాలో, అంతవరకే మాట్లాడటం మితభాషణం. అనవసరంగా, అతిగా మాట్లాడితే అపార్థాలు రావటానికి చాలా అవకాశాలు ఉన్నాయి. అందువల్ల బాగా ఆలోచించి క్లుప్తంగా మాట్లాడటం నేర్చుకోవాలి. మాట్లాడేవిషయాన్ని చిరునవ్వుతో మాట్లాడటం స్మితభాషణం. పళ్ళు కనపడకుండా నవ్వటమే 'స్మితం'. అలా ఏ విషయాన్నైనా కూడా నవ్వుతూ చెప్పగలగాలి. ప్రియభాషణలో కొన్ని అసత్యాలు ఉండే అవకాశముంది. ఐతే కొన్నిసందర్భాల్లో అవి చాలా తప్పనిసరి. ఇతరుల మనసు బాధపెట్టకుండా ప్రియంగా మాట్లాడటం చాలా కష్టమైన పని. ఒక్కోసారి అవతలివారికి తెలిసిపోయే ప్రమాదంకూడా ఉంది.

పూర్వభాషణం, దీనికి చక్కని సంస్కారం అవసరం. అవతలిమనిషితో ముందుగా మనమే మాట్లాడటం. అవతలి మనిషి మనకన్నా గొప్పవాడా, చిన్నవాడా అని చూడకుండా పలకరించటం చాలా గొప్ప సుగుణం.

సంభాషణం ఒక గొప్ప భూషణం. ఎందుకంటే సంభాషణ బాగోలేకపోతే మనం దేన్నైనా కోల్పోవచ్చు. కోపంతో మాట్లాడితే గుణాన్ని కోల్పోతాం. ఎక్కువగా మాట్లాడితే ప్రశాంతతను కోల్పోతాం. అనవసరంగా మాట్లాడితే అపార్థాలకు తావిస్తాం. స్నేహితులను కోల్పోతాం. అహంకారంతో మాట్లాడితే ప్రేమను కోల్పోతాం. అసత్యం మాట్లాడితే శీలాన్ని కోల్పోతాం. ఆలోచించి మాట్లాడితే వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతను కాపాడుకుంటాం.

మనిషికి ప్రసాదించిన గొప్ప శక్తి– మాట. మనిషి మాటను మితంగా, హితంగా సద్వినియోగం చేసుకోగలిగితే– మహోన్నతశిఖరాల నందుకోగలడు. సృష్టిలోని ఏ ప్రాణికీ లేని గొప్పశక్తి మానవుడికి లభించింది. మంచిఆహారం భుజించడం, మంచిమాట పలకడం మన నాలుకకు సంబంధించింది. సాత్త్వికాహారం తీసుకోవడంవల్ల సత్త్వగుణమే అలవడుతుంది. ఆ సత్త్వగుణంవల్లనే మనసు ప్రసన్నంగా ఉంటుంది. ఆ ప్రసన్నతవల్లనే మంచిమాటా వస్తుంది. వాక్కు దివ్యాస్త్రం వంటిది. దాన్ని ఎలా ఎప్పుడు వినియోగించుకోవాలో తెలియకపోతే అది మూర్ఖుడి చేతి ఆయుధమే. పరుషవాక్కును నాలుక పలికిందంటే దాని దుష్పరిణామం తీవ్రంగాను అవుతుంది. మన మాట తీరే మన సభ్యతను, సంస్కారాన్ని తెలియజేస్తుంది. ఇతరులను నొప్పించక తానొవ్వక చమత్కారభరితంగా సత్యమైన ప్రియమైన మాట పలికేవాడు సమర్థుడైన వక్త. మధురమైన వచనం పలకడం ఇతరులను వశపరచుకోగలిగే మహామంత్రం.

తపోధనులకు మంత్రాలే ఆలంబన. మంత్రం అక్షరాత్మకం. ఆ అక్షరమే సరస్వతీస్వరూపం. ఆమె యజ్ఞస్వరూపిణి. సద్గతిప్రదాయిని. సర్వదేవాత్మిక. మహాభారతంలోని 'సరస్వతీ గీతలు' బ్రాహ్మీవైభవాన్ని బహుధా వర్ణించాయి.

సత్యమైన మాట ప్రసన్నత, ప్రశాంతత, ప్రగాఢమైన ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదిస్తుంది. శాశ్వతవిజయానికి ఇవే ముఖ్యమైన సోపానాలు. మంచి ఆలోచన మంచిమాటనే పలికిస్తుంది. మంచిమాట మంచిబాటనే చూపిస్తుంది. సత్యవచనం విద్య, సంపద, పదవి, కీర్తితోపాటు మంచి బంధుమిత్రుల్ని, మంచి వాతావరణాన్ని సంపాదించిపెడుతుంది.

# జయ - విజయ

- శ్రీమతి ఆసూరి ఉషారాణి, 94416 46016

బ్రహ్మాండపురాణంప్రకారం, జయ మరియు విజయులు వైకుంఠానికి ద్వారపాలకులు. నలుగురు కుమారుల శాపంకారణంగా, వారు విష్ణువుయొక్క వివిధ అవతారాలచేత చంపబడ్డారు. మర్త్యులుగా జన్మలు ఎత్తాల్సి వచ్చింది. సత్య యుగంలో హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడిగా; త్రేతాయుగంలో రావణుడు, కుంభకర్ణుడిగా; చివరకు ద్వాపరయుగంలో శిశు పాలుడు, దంతవక్త్రుడిగా జన్మించారు.

## నలుగురు కుమారుల శాపం


భాగవతపురాణంలోని ఒక కథనంప్రకారం, బ్రహ్మ దేవుని మానసపుత్రులు (మనస్సుతో పుట్టిన పిల్లలు) ఐన నలుగురు కుమారులు సనక, సనందన, సనాతన మరియు సనత్కుమారులు విష్ణువును చూడటానికి వైకుంఠానికి వెళ్లారు. అక్కడ ద్వారపాలకులు జయ మరియు విజయులు కుమారు లను వైకుంఠంలోకి రానీయకుండా అడ్డుకున్నారు.

ఈ నలుగురు కుమారులు వయస్సులో ఉన్నప్పటికీ వారి తపస్సు బలం కారణంగా నిత్యమూ పిల్లలుగానే కనిపి స్తారు. జయ మరియు విజయులు కుమారులను చిన్నపిల్లలుగా భావించి ద్వారంవద్దే అడ్డుకున్నారు. విష్ణువు విశ్రాంతి తీసు కుంటున్నాడని, ఇప్పుడు ఆయనను చూడటానికి కుదరదని వారు కుమారులకు చెప్పారు. అందుకు వారు కోపించి వారితో భూలోకంలో జన్మించమని శపించారు. అదివిని ద్వార పాలకులు కుమారులశాపాన్ని తొలగించమని విష్ణువును కోరారు. అందుకు విష్ణువు జయ మరియు విజయులకు రెండు ఎంపికలు ఇచ్చాడు. విష్ణుభక్తులుగా భూమిపై ఏడుజన్మలు ఎత్తుతారా? నాకు బద్ధ శత్రువులుగా మూడుజన్మలు ఎత్తుతారా? ఇవి అనుభ వించినతర్వాతే, వారు వైకుంఠంలో తమస్థాయిని తిరిగి పొందుతారు మరియు శాశ్వతంగా అతనితో ఉండగలరు. ఏడుజన్మల్లో విష్ణువుకు దూరంగా ఉండడాన్ని జయ, విజయులు భరించలేరు.

తత్ఫలితంగా, వారు విష్ణువుకు శత్రువులుగా ఉండవలసి వచ్చినప్పటికీ, వారు భూమిపై మూడుజన్మలు ఎత్తాలని ఎంచుకున్నారు. అవి సత్యయుగంలో మొదట వారు హిరణ్యాక్ష మరియు హిరణ్యకశిపులుగా; త్రేతాయుగంలో రావణ మరియు కుంభకర్ణులుగా; ద్వాపరయుగంలో శిశుపాల మరియు దంతవక్త్రులుగా జన్మించారు. వారి మొదటి రెండుజన్మ లలో, వారు సోదరులు మరియు వారి చివరిజన్మలో వారు బంధువులు.


వారి మొదటిజన్మలో, వారు వ్యక్తిగతంగా భూమిని బంధించి పాలించిన అసురులుగా జన్మించారు. వారి రెండవ జన్మలో, వారు భూమిపై కేవలం ఒకప్రాంతాన్ని పాలించే రాక్షసులుగా జన్మించారు. మూడవ జన్మలో వారు కృష్ణుడి పెద్ద కుటుంబంలోనే మానవులుగా జన్మించారు. అంతేకాకుండా, సత్యయుగంలో హిరణ్యాక్ష మరియు హిరణ్యకశిపులను చంప డానికి విష్ణువు వరాహ, నరసింహ అనే రెండు అవతారాల నెత్తాడు. త్రేతాయుగంలో శ్రీరాముడు రావణుడు మరియు కుంభకర్ణుల నిద్దరినీ చంపాడు. ఇలా మూడుజన్మలెత్తి తిరిగీ వైకుంఠద్వార పాలకులుగా నియుక్తులయ్యారు.

వైష్ణవమతంతో అనుబంధంగా ఉన్న విష్ణుదేవాలయాల్లో ద్వారపాలకులుగా వీరిని చూడవచ్చు. తిరుమలలోని వేంకటే శ్వరునిఆలయం, పూరీలోని జగన్నాథునిఆలయం మరియు శ్రీరంగంలోని రంగనాథునిఆలయంలో జయ-విజయుల విగ్రహాలు ప్రముఖంగా ఉన్నాయి.



*గత సంచిక తరువాయి భాగం....*

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

## రామానుజుల గురించి శ్రీకరస్వామి చెప్పిన విశేషాలు

భక్తులంతా నంబి నారాయణ స్వామి కోవెలముందున్న సువిశాలమైన పచ్చికబయలువద్ద సమావేశమైనారు. అదొక అద్భుతమైన ఆలయప్రాంగణం. భక్తులందరికీ అరిటాకుల్లో మిరియాలపొంగలి, ఎండుఅరిటాకుదొన్నెల్లో పానకం ప్రసాదంగా ఇచ్చారు. వారు ఆ ఆకులను, దొన్నెలను చక్కగా ఉపయోగించినతరువాత పారవేశారు.

రామానుజ అను యాత్రాసభ్యులు ఎంతో క్రమశిక్షణతో ఉన్నారని, రామానుజాచార్యులకు ప్రియమైన పవిత్రస్థలాన్ని కలుషితం చేయలేదని గంధర్వులు ఎంతో సంతోషించారు. భూమాతను, ముఖ్యంగా పవిత్రమైన ఆలయాలను, ఆలయ పరిసరాలను కలుషితం చేయరాదని శ్రీకరస్వామి హెచ్చరించారు.

అటుపై తొండనూరుపై ఒక చిన్న ఉపన్యాసం చేస్తానని, ఆ తర్వాత భగవద్రామానుజులు స్వయంగా నిర్మించిన తొండనూరు సరస్సును సందర్శించవచ్చని చెప్పారు; అక్కడ నీరు ఎల్లప్పుడూ స్పటికమంత స్పష్టంగా ఉండి, ఔషధవిలువను కలిగి ఉంటుంది. ఇది చర్మవ్యాధులను నయం చేస్తుంది.

ఇప్పుడు మన స్వర్గలోకసందర్శకులుకూడా ఇతర యాత్రికులు పొందే యాత్రానుభవాన్ని పొందాలని సంకల్పించి, శ్రీవైష్ణవులరూపాన్ని ధరించి, ప్రయాణికులతో చేరి శ్రీకరస్వామితో ముచ్చటించారు.

శ్రీకరస్వామి వారిని ఇంతకుముందు చూడలేదని అన్నప్పుడు వారు యోగనరసింహసన్నిధినుండి యాత్రాబృందంతో చేరామని, భగవద్రామానుజుల గురించి స్వామి ఉపన్యాసం వినాలనుకుంటున్నామని చెప్పారు. మీరు ఎక్కడివారని శ్రీకరస్వామి అడగ్గా, శ్రీవైకుంఠంనుండి వచ్చామని గంధర్వాదులు నిజమే చెప్పారు. దానిని తమిళనాడురాష్ట్రం తిరునెల్వేలి దగ్గరున్న శ్రీవైకుంఠమని శ్రీకరస్వామి భావించారు.

గంధర్వాదులకుకూడా ప్రసాదం అందే ఏర్పాటు జరిగింది. నారదుడు మిరియాలపొంగలి, పానకం ప్రసాదం గ్రహించి ఎంతో తృప్తి చెందాడు. రామానుజాచార్యుల ప్రార్థనాశ్లోకంతో శ్రీకరస్వామి తన ఉపన్యాసం ప్రారంభించాడు. సాలిగ్రామంలో యతిరాజుల బసగురించి గతంలో చెప్పానని, ఇప్పుడు తొండనూరుకు రామానుజుల ప్రయాణంగురించి చెబుతానన్నారు శ్రీకరస్వామి.

రామానుజులు సాలిగ్రామంలో నివసించి తరువాత, పరమ భాగవతోత్తముడైన తొండనూరు నంబి ఆహ్వానంమేరకు తొండనూరుకు ప్రయాణమయ్యారు. నంబినారాయణ భగవానుడే స్వయంగా తొండనూరు నంబికి సమాశ్రయణం చేశాడని ఐతిహ్యం.

ఆలయంలో నంబి నారాయణ భగవానుడు తన రెండు చేతులపై శంఖుచక్రాలను కుడి, ఎడమల మార్పుతో ధరించి ఉండటం మీరు గమనించి ఉంటారు(సమాశ్రయణ సమయంలో ఆచార్యులచేతిని గమనిస్తే వారుకూడా శంఖుచక్రాలను అదే విధంగా పట్టుకుని ఉండటం చూస్తాం). *(ఇంకా ఉంది)*

2025, జనవరి 29న
పురందరదాసులవారి ఆరాధనోత్సవం సందర్భంగా...

# కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు

- డా॥ కే.యస్.ఇందిర, 98491 00248

కర్ణాటక సంగీతానికి ఆదిగురువు, కర్ణాటక సంగీత పితామహుడు అని పిలువబడిన శ్రీపురందరదాసు 1484లో బళ్లారికి సమీపాన పురందరగఢ అనే గ్రామంలో వరదప్ప నాయుడు, కమలాంబ దంపతులకు జన్మించారు. ఈయన వజ్రాలవ్యాపారి. గొప్ప శ్రీమంతుడు. ఇతని అసలుపేరు శీనప్ప. ఇతని తండ్రి ఇతనికి బాల్యంనుండే సంగీతం చెప్పించాడు. తండ్రి మరణానంతరం శీనప్ప వజ్రాలవ్యాపారం చేపట్టి ధనం గడించాడు. ఇంత సంపద ఉన్నా అత్యంత పిసినారియై, దానధర్మాలంటే తెలీనివాడై, దైవభక్తిగానీ, ఆధ్యాత్మికచింతనగానీ లేక కాలం గడిపేవాడు. ఇతని భార్య సరస్వతిబాయి. మహా ఇల్లాలు. పాండురంగని భక్తురాలు. భర్తకు దానగుణంగానీ, దైవభక్తిగానీ లేనందుకు అమితంగా చింతిస్తూ తన భక్తిలో మార్పుతెమ్మని తన ఇష్టదైవాన్ని ప్రార్థిస్తూండేది.

భగవంతుడు ఆయనకు గుణపాఠం నేర్పి, మంచి మనస్సు ప్రసాదించాలని సంకల్పించి ఒక వృద్ధబ్రాహ్మణుని రూపంలో శీనప్ప దుకాణానికెళ్లి తన మనవడి ఉపనయనానికి ద్రవ్యసహాయం చేయమని అర్థించాడు. అందుకు శీనప్ప తిరస్కరించి పొమ్మన్నాడు. అంతట ఆ వృద్ధబ్రాహ్మణుడు శీనప్ప ఇంటికెళ్లి శీనప్ప భార్యను అర్థించాడు. ఆమె తనవద్ద ద్రవ్యమేమి లేనందున ఎంతో విలువైన తన ముక్కెరను ఇచ్చింది. అతడు ఆ ముక్కెరను తిరిగి శీనప్ప దుకాణంలో అమ్మజూపాడు. అది చూచి శీనప్ప అది తన భార్యదేనని గుర్తించి తన మనిషిని ఇంటికి పంపి తన భార్య ముక్కెర అడిగి తెమ్మని పంపాడు. దీనికి భయపడ్డ సరస్వతీబాయి, దానమిచ్చినందుకు తన భర్త ఏం చేస్తాడో అని భయపడి ఒక పాత్రలో విషం తీసుకుని త్రాగబోయేంతలో తన ముక్కెర వంటిదే ఇంకొకటి ఆ పాత్రలో కనబడింది. ఆమె ఆశ్చర్యంతో తన భర్త పంపిన మనిషితో అది ఇచ్చిపంపింది. శీనప్ప ఆ ముక్కెరను చూసి సంభ్రమాశ్చర్యాలతో ఇంటికొచ్చి భార్యను అడిగాడు. ఆమె జరిగిందంతా వివరించింది. శీనప్ప జరిగినదంతా పాండురంగడు తనకు బుద్ధి చెప్పటానికి మాత్రమే ఆడిన నాటకమని తెలిసికొని ఆ క్షణం నుండి మనస్సు మార్చుకుని తన ఆస్తినంతా ధర్మంచేసి పాండురంగడి భక్తుడయ్యాడు. తంబూర చేతబూని పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ, పాండురంగణ్ణి స్తుతిస్తూ లక్షలకొలది కీర్తనలు పాడాడు.

"ఆదదెల్లా ఒళ్ళే దాయితు... తులసి మాలెయ హాకిసిదళు" అనే కీర్తనలో శీనప్ప, తన భార్య కారణంగానే సన్మార్గప్రవృత్తుడైనాడని చెప్పుకున్నాడు. ఇతను మొదట వ్రాసిన కృతి చరణంలో- "యౌవనదల్లి శ్రీహరి పాదనంబరే, మూవత్తు వరుష మోహాబ్ధియల్లి బిద్దే" అంటే యౌవనంలో శ్రీహరిపాదాల్ని విశ్వసించక 30 ఏళ్లు మోహసముద్రంలో పడి మోసపోయానని బాధపడ్డాడు.

ఈయన కీర్తనలు సులభశైలిలో, మధురమైన కన్నడ భాషలో, భక్తిరసపూరితంగా ఉండి, 'పురందరవిఠల' అనే ముద్ర కల్గిఉంటాయి. ఈయన రచించిన కీర్తనలు 'దేవరనామము' లనియు, 'దాసరపదగళు' అనియు పిలువబడుతున్నాయి. పురందరదాసుగా ప్రసిద్ధికెక్కిన వీరి రచనలు లక్షలకొలది ఉన్నాయని, ప్రపంచంలో ఏ ఇతర వాగ్గేయకారుడు ఇన్ని రచనలు చేసి ఉండలేదని తెలుస్తోంది.

వీరు తన 40వ ఏట ప్రసిద్ధ మధ్వమతగురువులు, మహాపండితులు ఐన వ్యాసరాయస్వామినుండి ఉపదేశం పొందారు. 'పురందరవిఠల' అనే ముద్రతో కీర్తనలు రచించి, ప్రజల్లో భక్తిని ప్రచారం చేయమని వ్యాసరాయలు చెప్పి, దీక్షనిచ్చి, మధ్వమతసిద్ధాంతాన్ని ఉపదేశించారు. ఆనాడు మొదలుకొని శ్రీనివాసునికి 'పురందరదాసు' అన్న పేరు వచ్చి, నాటినుండి పురందరదాసుగా ప్రఖ్యాతిపొందారు.

తెలుగు పదకవుల పేర్లు చెప్పగానే మొట్టమొదట అన్నమయ్య గుర్తుకు వచ్చినట్లు- కన్నడ దాససాహిత్యం పేరు వినగానే పురందరదాసులవారు మన స్మృతిపథంలో మెదులుతారు. నాలుగులక్షల డెబ్బైఅయిదువేల కీర్తనలు రచించి, పాడినట్లుగా ప్రచారంలో ఉంది.

శ్రీకృష్ణదేవరాయలు దాససాహిత్యాన్ని ఆస్వాదిస్తూ హరిదాసులను గౌరవించేవారని చరిత్ర చెప్తోంది. రాయల వారితోపాటు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు శ్రీపురందర

దాసులవారు వచ్చేవారని, స్వామివారి ఊరేగింపులో స్వామిని వర్ణిస్తూ చక్కగా కీర్తనలు ఆలపించేవారని ప్రసిద్ధి. పురందరదాసు, అన్నమయ్య సమకాలికులని చెప్పబడింది. పురందరదాసు తిరుమల శ్రీనివాసుని కన్నడభాషలోనే గాక సంస్కృత కీర్తనలలోను వర్ణించారు. వీరు రచించిన–

వేంకటాచల నిలయం, వైకుంఠపురవాసం,
పంకజనేత్రం పరమపవిత్రం,
శంఖచక్రధర చిన్మయరూపం

అంబుజ భవనుత అగణిత గుణధామం
తుంబురు నారద గాన వినోదం
అంబుజశయనం అగణితనామం

పాహి పాండవపాలం కౌరవమదహరణం
బాహుపరాక్రమ ఫణిపతిశయనం
అహల్యాశాపవిమోచన చరణం

సకల వేదవిచారం సర్వజీవి నేతారం
మకరకుండలధర మదనగోపాలం
భక్త విపోషణ పురందర విఠలం



బ్రహ్మరుద్రాదులచేత కీర్తించబడే భక్తవత్సలుడైన శ్రీవేంకటాచలవాసుని పురందరదాసులవారు సంస్కృతంలో ఇలా గొప్పగా కీర్తించారు.

పురందరదాసు నరస్తుతిని వ్యతిరేకించారు. ఎవరి దయాదాక్షిణ్యాలను ఆశించలేదు. ఉన్న సంపదలను వదిలి, భిక్షాటన చేసి, సంసారం సాగించిన భగవద్భక్తిసంపన్నుడు. నరస్తుతివైముఖ్యాన్ని ఇలా వివరించారు–

హిందిల్లా స్వామి ముందిల్లాగో
వింద నీనిల్లదే ఇహపరవిల్ల
వరస్తుతిసి నాలిగె బరడాయి తల్ల
నరవిన ఇహవిల్ల నరజన్మ స్థిర వల్ల
నరిగె, పామరిగె పాపద పంజరిగె

గోవిందుడు లేకపోతే ఇహపరాలు లేవు. ముందు, వెనక ఏమీ ఉండవు. నరులను స్తుతించే నాలుక నిస్సారమైనదని వివరించారు పురందరదాసు.

పుష్కరిణీ స్నానానంతరం ముందుగా వరాహస్వామిని దర్శించుకుని ఆపై తిరుమల శ్రీనివాసుణ్ణి దర్శించాలనే పురాణ సంప్రదాయాన్నే పురందరదాసు ఈ విధంగా కీర్తించారు.

ఏనుజన్మద సుకృత ఫలవుబందోదగితో
ఈ స్వామి పుష్కరిణియోళ్
నా స్నానవనుమాడి వరాహదేవరనోడి
శ్రీస్వామి మహాద్వారకె
ఈ శరీరవను ఈడాడి ప్రదక్షిణమాడి
లేసినిందలి పొగళుత
ఆ సువర్ణద గరుడగంబవనుస్తుతి సం
తోషదిం కొండాడిదె– బిడదె

– అంటూ పురందరదాసు శ్రీవేంకటేశ్వరదర్శనానుభవాన్ని హృద్యంగా వర్ణించారు.

కర్ణాటకసంగీతానికి ఈయన చేసిన సేవలు ఎనలేనివి. ఈయన గురలీలు, జంటలు, అలంకారములు అను ప్రాథమిక పాఠాలను రచించి తద్వారా సంగీతప్రపంచానికే ముఖ్యులయ్యారు. అందుకే ఈయన సంగీతానికి ఆదిగురువనియు, కర్ణాటక సంగీతపితామహుడనియు పిలువబడ్డారు.

# హరిదాసు

- డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి


తెలుగువారు జరుపుకునే పండుగల్లో అతి పెద్ద హిందూపండుగ సంక్రాంతి. ధనుర్మాసం మొదలు ఇంటిముందు ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు ఆటలతో సందడి నెలకొంటుంది. హరిదాసు అంటే.. తమ ఇంటికి వస్తున్న దైవంతో సమానంగా భావించేవారు. కాళ్ళకు గజ్జెలు, భుజం మీద వీణ, శిరస్సుమీద అక్షయపాత్ర పట్టుకుని హరినామ సంకీర్తన చేస్తూ వీధిలో నడిచివస్తుంటే.. ఎంత దూరంలో ఉన్న హరిదాసు కాళ్ళగజ్జెలశబ్దం, హరిలోరంగహరి అంటూ సాగే గానం విని ప్రతిఇంట్లో పెద్దలు బియ్యం సిద్ధం చేసేవారు.

శ్రీమహావిష్ణువుకు ప్రతినిధులు హరిదాసులు. హరిదాసు ఇంటింటికీ తిరుగుతూ ఆగిన ప్రతిచోట తన స్వచ్ఛమైన గాత్రంతో వీణను వాయిస్తూ, గజ్జెలకాళ్ళను కదిలిస్తూ గీతాన్ని పూర్తి చేసినవెంటనే శిరస్సును కిందకువంచి అక్షయపాత్ర పెడితే.. ఆ ఇంటిసభ్యులు తాము సిద్ధంచేసిన బియ్యాన్ని ఆ అక్షయపాత్రలో పోసేవారు. వారి అక్షయపాత్రలో బియ్యంపోస్తే మనం తెలిసి తెలియక చేసిన ఎన్నోపాపాలు తొలగిపోతాయని విశ్వాసం. తమకు చేసిన దానధర్మాలను స్వీకరించి మనస్ఫూర్తిగా ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవిస్తారు. ఇలా నెలరోజులపాటు హరినామాన్ని గానం చేసి.. సంక్రాంతిరోజున స్వయంపాకంగా అందరు ఇచ్చే ధన, ధాన్య, వస్తుదానాలను స్వీకరించి తమని ఆదరించిన కుటుంబం అన్నపూర్ణగా ఉండాలని దీవిస్తారు.

హరిదాసు నెత్తిమీద ధరించే పాత్రను అక్షయపాత్రగా అది సూర్యభగవానుడు ప్రసాదించిన పంచ లోహపాత్రగా భావిస్తారు. ధనుర్మాసం నెల రోజులు సూర్యోదయానికి ముందే శ్రీకృష్ణ గోదాదేవిని స్మరించి, తిరుప్పావై పఠించి, అక్షయపాత్రను ధరించి హరిదాసులు గ్రామ సంచారం ప్రారంభిస్తారు. ఇంటికి తిరిగివెళ్లే హరిదాసునోట హరినామసంకీర్తన తప్ప మరేమి ఉండదు. ఎక్కడా అక్షయపాత్రను దించరు. ఇంటికి వెళ్ళాక ఇల్లాలు ఆ హరిదాసు పాదాలు కడిగి అప్పుడు హరిదాసు నెత్తిమీద అక్షయపాత్రను దించుతుంది.

హరిదాసులు శ్రీకృష్ణునికి మరోరూపం అని పెద్దలు చెబుతారు. పేద, ధనిక అనే తారతమ్యభేదం లేకుండా అందరి ఇంటికి వెళ్తాడు. శ్రీమద్రమారమణ గోవిందో హరీ అంటూ.. ఇంటిముందు ముగ్గుచుట్టూ ఒకసారి తిరుగుతారు.. గుమ్మంలో ఎవరూ లేకపోతే మరో ఇంటికివెళ్తారు.. ఐతే ఎవరి ఇంటి నుంచి ఐనా హరిదాసు ఉట్టిచేతులతో వెళ్తే ఆ ఇంటికి అరిష్ట మని పెద్దలనమ్మకం. అందుకనే గ్రామంలోకి హరిదాసు అడుగు పెట్టాడనే సంకేతం తెలియగానే.. ఇంటి ఇల్లాలు బియ్యంతో సిద్ధంగా గుమ్మంముందు నిల్చుంటుంది.

అక్షయపాత్రలో బియ్యం పోయడాన్ని శ్రీమహావిష్ణువుకు తమ శక్తికొద్దీ పెట్టిన నైవేద్యంగా భావిస్తారు భక్తులు. హరిదాసు తలమీద గుండ్రటి రాగిపాత్రను భూమికి సంకేతంగా శ్రీమహావిష్ణువు పెట్టాడనే కథకూడా ప్రచారంలో ఉంది. ఐతే కాలంలో వచ్చిన మార్పుల్లో భాగంగా హరిదాసుని ఆదరించేవారు కరువయ్యారు. ఐనప్పటికీ ఇప్పటికీ కొందరు తమ సంప్రదాయాన్ని నుసరించి మన ఇంటి ముంగిటికి వస్తున్నారు. వారిని ఆదరించి చేయూతను ఇవ్వడం మన బాధ్యత. దీనివల్ల వారికి చేయూత నివ్వడమేకాక మన సంస్కృతీ సంప్రదాయాలను రక్షించుకోవడంలో భాగస్వాములమవుదాం.



ఇటీవల నాకు హెర్నియా ఆపరేషన్ జరిగింది మా నల్లగొండలోనే. నన్ను ఐ.సి.యు.లోకి చేర్చాక తెలివి వచ్చి కళ్ళువిప్పాను. ఇక 24 గంటలకాలం అందులోనే ఉండాలి కనుక ఏం చేయాలా అని ఆలోచించాను. జరిగిన శస్త్రచికిత్స గురించి, భవిష్యత్తులో వచ్చే పరిణామాలగురించి ఆలోచిస్తే గుండె బలహీనపడేట్టుంది.. అందుకని ఆ ఆలోచనలను బలవంతంగా మళ్ళించుకునేందుకు ఉపాయం వెదికాను. శ్రీవేంకటేశ్వరమంత్రధ్యానమే సరైనమార్గమని తోచింది.

వెంటనే కళ్ళుమూసుకుని 'ఓమ్ నమో వేంకటేశ్వరాయ' అంటూ నామజపాన్ని ప్రారంభించాను. మరుక్షణం మిగతా వెర్రిమొర్రి ఆలోచనలన్నీ పారిపోయాయి. క్రమంగా రాత్రి కమ్మేసింది. నామజపం ఆపలేదు. రాత్రి 9 గంటలకు ఒక ఆలోచన వచ్చింది. నామజపంతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళవిగ్రహాన్ని అంతరదృశ్యంలో దర్శించాలని, అందుకు ఆవాహన చేయాలని సంకల్పించాను. స్వామిమూర్తి పైననే మనసు లగ్నంచేసి ఆహ్వానించసాగాను. కాని ఆ రూపం ఎంతకీ కానరావడంలేదు. కొద్దిసేపటికి ఆంజనేయస్వామి కనిపించారు. తరువాత వరుసగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, రంగనాథుడు, వరదరాజస్వామి, అందరూ చక్కగా నా హృదయరంగంమీద సాక్షాత్కరించారు. కానీ, వేంకటేశ్వరుడు మాత్రం కానరావడం లేదు.

నాకు పట్టుదల పెరిగింది. ఈసారి మరింత బాగా ఆవాహన చేస్తూ జపం చేశాను. ఊహు... కానరాలేదు. నాకాశ్చర్యం వేసింది. ఏమిటీ? ఈ హాస్పిటల్ పరిస్థితులలో కనిపించకూడదనుకున్నాడా స్వామి? అని అనుమానిస్తూ, ఇది పని కాదనుకుని స్వామి గర్భాలయదృశ్యాలను, స్వామి ప్రత్యంగ దర్శనాన్ని ఆహ్వానించడం ప్రారంభించాను. రాత్రి 10 గంటలు దాటింది. అప్పుడు మెల్లగా జయవిజయులు కనిపించారు. తరువాత క్రమంగా స్వామి పాదాలు, ఉభయహస్తాలు, యజ్ఞోప వీతం, మణిహారాలు, ఉభయదేవేరులస్థానాలు, శంఖచక్రాలు, రత్నకిరీటం, మకరతోరణం అన్నీ కనిపించాయి. కాని విచిత్రం! స్వామి తిరుముఖమండలం కనిపించటంలేదు.. నిరాశతో ఒక పద్యం అల్లడం ప్రారంభించాను ఇలాగ...





**భక్తిభావము దెలుప, కావలయు నాకు**
**స్వామి తిరుముఖబింబదర్శనసుఖమ్ము**

అని విన్నవించుకుంటూ నిద్రలోకి జారిపోయాను. తెల్లవారుజామున 5 గంటలకు మెలకువ వచ్చింది. కాని కళ్ళు తెరవలేదు. ఆశ్చర్యం! నేనేమీ ఆవాహన చేయకుండానే స్వామి వారి తిరుముఖమండలదర్శనం లభించింది. అదీ మామూలుగా కాదు, నిలువెల్లా పూలతో అలంకరింపబడిన, నేత్రదర్శన పూర్వకమైన స్వామి దివ్యమంగళవిగ్రహం సాక్షాత్కరించింది. విశేషమేమంటే ఆరోజు శుక్రవారం కనుకనే ఏమో పూలంగి సేవలో దర్శనమిచ్చారు. వెంటనే పద్యాన్ని ఇలా పూర్తిచేశాను.

**ఆహా! లభియించె ఈ ఉదయమ్మునందె.**
**శుక్రవారపు పూలంగి శోభతోడ!**

స్వామివారి కరుణాకటాక్షాలు భక్తులపై ఎంత విచిత్రంగా ప్రసరిస్తాయో కదా! అని రోజంతా మురిసి పోయాను. పిలిచినంతకాలం రాలేదు. పిలవకుండానే విశేష సాక్షాత్కారాన్ని ప్రసాదించిన శ్రీవేంకటేశ్వరుని దివ్యలీలల కథలు అవిస్మరణీయాలు, దివ్యానుభూతులు.



# గాలిపటము

– శ్రీ చాకిచర్ల నాగసుదర్శనరావు,
97013 85006

మన హిందూసంస్కృతికి అద్దంపట్టే పండుగల్లో అతిముఖ్యమైనపండుగ సంక్రాంతిపండుగ. ఈ సంక్రాంతి పండుగరోజుల్లో పిల్లలు, పెద్దవారుకూడా గాలిపటాలు ఎగురవేస్తారు. దీన్ని గాలిపటాలపండుగనికూడా వ్యవహరిస్తారు. అంత ఆందమైన పండుగ ఇది.

సంక్రాంతిపండుగ వచ్చిందంటే పిల్లలు పెద్దలు గాలిపటాలు అమ్మే దుకాణాలవద్దకు చేరి రంగురంగుల గాలిపటాలు, వారికి కావాల్సినట్లుగా దారాన్ని (మాంజా అని కూడా అంటారు) కొనుక్కుని, అందరూ మేడలమీద చేరి ఆనందంగా ఎగురువేస్తూ ఉంటారు. కొంతమంది ఈ గాలిపటాలఆటల్లో పోటీలుకూడా వేసుకుంటారు, ఈ పోటీలు రెండురకాలుగా ఉంటాయి.

కొన్నిప్రాంతాల్లో ఎవరు ఎక్కువ ఎత్తుకు ఎగురవేస్తే వారు గెలిచినట్లుగా భావిస్తారు, మరికొన్నిప్రాంతాల్లో వేరేవాళ్ళ పతంగిని తెంపటం ఒక గెలుపుగా భావిస్తారు. ఈ సంక్రాంతి పండుగనెలలో కనీసం 15రోజులపాటు ఆకాశమంతా రంగురంగుల గాలిపటాలతో ఎంతో చూడముచ్చటగా ఉంటుంది, మనం ఎగురవేయకపోయినా సరే ఎగిరే గాలిపటాలవంక చూస్తూ ఆనందిస్తుంటాం.

అంతేగాకుండా ఈ గాలిపటాలు ఎగురవేసేవెనుక ఎంతో ఆధ్యాత్మికతకూడా దాగి ఉంది. ఈ మానవజీవితం ఉన్నతంగా మరియు ఉజ్వలంగా పైకి ఎదగాలంటే మన ప్రవర్తన ఎలా ఉండాలో గాలిపటాన్ని ఉపమానంగా చెప్పుకోవచ్చు. గాలిపటాన్ని జీవితంగా తీసుకుంటే దానికి కట్టే సూత్రం మనం పిల్లల్ని విద్యావంతులను చేసేటప్పుడు వేసే పునాది ఔతుంది, దారం మనస్సు, దాన్ని ఎగురవేసేవ్యక్తి బుద్ధి ఐతే, వీటిలో ఏ ఒక్కటి సరిగా లేకపోయినా గాలిపటం సరిగా ఎగరదు సరికదా తాను నిరుత్సాహానికి గురౌతాడు. కాబట్టి పునాది అనే సూత్రం మంచిగా ఉంటే జీవితం అనే గాలిపటం ఎంతో ఉజ్వలంగా ఎదుగుతుంది. సాంకేతిక అభివృద్ధితో ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎన్నో మాధ్యమాలు పిల్లలను తప్పుత్రోవ పట్టిస్తున్ననేపథ్యంలో అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఉన్నతమైన విద్యను బోధించటమేకాక ఈ మాధ్యమాల దుష్ప్రభావాలకు పిల్లలు లోనుకాకుండా క్రమశిక్షణకుకూడా మంచి పునాది వేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అప్పుడు బుద్ధి, మనస్సు అనే దారాన్ని గాలికి అనుగుణంగా నియంత్రించి జీవితం అనే గాలిపటాన్ని ఎంతో ఉన్నతమైన ఎత్తుకు తీసుకుని వెళ్ళగలుగుతుంది. సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది–

గుణః భూషయతే రూపం, శీలం భూషయతే కులం।
సిద్ధిః భూషయతే విద్యాం, భోగః భూషయతే ధనం ॥

ఒక వ్యక్తియొక్క గుణం తన అందాన్ని ఇనుమడింపజేస్తుంది. ఉన్నతమైన నడవడి అతనియొక్క కులానికే అందాన్నిస్తుంది. సత్కార్యసాధన ఆతని చదువుకి అందాన్నిస్తుంది. అటువంటి వ్యక్తి సంపాదన సద్వినియోగంద్వారా ఆ ధనానికే అందం చేకూరుతుంది.

అందుచేత విద్యార్థులందరు పైన తెలిపిన మంచి విషయాలను పాటిస్తూ తమ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు అందించిన ఉన్నతవిద్యనేకాకుండా వారు చెప్పే క్రమశిక్షణాపద్ధతులనుకూడా అవలంబిస్తూ ఎంతో ఎత్తుకు మరియు ఉజ్వలంగా ఎగిరే గాలిపటంలా తమ భవిష్యత్తుకు మంచి పునాది వేసుకొంటారు గాక!!

# తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు

| భాష | గ్రంథం పేరు | రచయిత | సైజు | వెల (రూ.) |
|---|---|---|---|---|
| తెలుగు | రామాయణగాథలు-మహిళలు | డా॥మలయవాసిని | 1/8 డెమ్మీ | 80/- |
| తెలుగు | బేతాళ పంచవింశతి | ప్రొ॥ఆర్.వి.ఆర్.కృష్ణశాస్త్రి | 1/8 డెమ్మీ | 135/- |
| తెలుగు | ఉపదేశత్రయం | శ్రీ వాసుదాసుస్వామి | 1/8 డెమ్మీ | 160/- |
| తెలుగు | మహాభారతగాథలు- మహిళలు | డా॥సుమతి నరేంద్ర | 1/8 డెమ్మీ | 80/- |
| తెలుగు | కావ్యప్రబంధాల్లో ఆధ్యాత్మికకథలు | శ్రీ ఎర్రాప్రెగడ రామకృష్ణ | 1/8 డెమ్మీ | 70/- |
| తెలుగు | ఆర్యకథానిధి | శ్రీ వాసుదాసుస్వామి | 1/8 డెమ్మీ | 280/- |
| తెలుగు | భాగవతగాథలు-మహిళలు | ప్రొ॥కె.సర్వోత్తమరావు | 1/8 డెమ్మీ | 70/- |
| తెలుగు | ఇతిహాసాలలో మహర్షులు-ధర్మప్రబోధాలు | ప్రొ॥జి.దామోదరనాయుడు | 1/8 డెమ్మీ | 60/- |
| తెలుగు | హనుమంతునిచరిత్రము | శ్రీ వాసుదాసుస్వామి | 1/8 డెమ్మీ | 140/- |
| ఆంగ్లం | మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ లైఫ్‌స్టోరి | ప్రొ॥టి.విశ్వనాథరావు | 1/8 డెమ్మీ | 65/- |
| హిందీ | మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకి జీవని | ప్రొ॥ఐ.ఎన్.చంద్రశేఖరరెడ్డి | 1/8 డెమ్మీ | 70/- |
| కన్నడ | తిరుమల తిరుపతి క్షేత్రమాహాత్మ్యె | డా॥యం.జి.దేశ్‌పాండే | 1/8 డెమ్మీ | 110/- |

ఇతర వివరాలకు: టి.టి.డి. సేల్స్‌వింగ్ ఆఫ్ పబ్లికేషన్స్, తి.తి.దే. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 501. ఫోన్- 0877-2264209

## గ్రంథసమీక్ష

### నామస్మరణం - మోక్షదాయకం

(ఆధ్యాత్మిక వ్యాససంపుటి)

రచయిత- డా॥ బి.రామాచార్యులు; సైజు-1/8 డెమ్మీ; పుటలు-67; ధర-రూ.50/-; ప్రతులకు- డా॥ బి.రామాచార్యులు, గుళ్ళదుర్తి గ్రామం, కోవెలకుంట్ల మండలం, నంద్యాల జిల్లా-518 134, ఫోన్:94936 17006

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనమ్

అని భాగవతంలో శ్రీహరి భక్తిరసామృతమత్త మధుపానచిత్తుడైన ప్రహ్లాదుడు మోక్షదాయకమైన నవవిధ భక్తి మార్గాలనుగురించి తెలియజేశాడు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు, ద్వాపరయుగంలో పూజాదికాలు, కలియుగంలో నామస్మరణ మోక్షదాయకాలని శాస్త్రాలు చెబుతున్నాయి. 'జంతూనాం నరజన్మ దుర్లభం' ఎన్నో లక్షల జన్మల పుణ్యఫలంగా మానవజన్మ లభిస్తుంది. అటువంటి జన్మను సార్థకం చేసుకొని మోక్షాన్ని పొందాలంటే అత్యంత సులభమైనమార్గం స్మరణం. 'కలౌ హరినామ సంకీర్తనం' అన్నట్లు కలియుగంలో నామస్మరణ సంసార సాగరాన్ని దాటించి ముక్తిని ప్రసాదిస్తుంది.

'నామస్మరణం-మోక్షదాయకం' అనే ఈ గ్రంథంలో రచయిత డా॥బి.రామాచార్యులు మోక్షసాధనమైన స్మరణభక్తిని గూర్చి విశేషంగా పేర్కొన్నారు. భగవద్గీత, భాగవత, రామాయణాలలో స్మరణభక్తినిగురించి ఆదిశంకరాచార్యులు, అన్నమాచార్యులు, త్యాగరాజస్వామి మున్నగు మహనీయులు ఏమని పేర్కొన్నారు? నామస్మరణ ఎలా చేయాలి? అసలు నామస్మరణే ముక్తిమార్గంగా ఎందుకు ఎంచుకోవాలి? అనే విషయాలను చాలా చక్కగా ఈ గ్రంథంలో వివరించారు. 'నేను- నాది' అనే అహంకారం ఉన్నంతవరకు మోక్షం సిద్ధించదు. భాగవతసుధాలహరి పేర్కొన్నట్లు 'సత్యాది యుగాలలో అహంకారం విడిచి సర్వమూ తానైన పరమాత్ముని కేవలం స్మరిస్తే చాలు మోక్షలక్ష్మి తనంత తానై వచ్చి వరిస్తుందని' రచయిత అనేక ఉపపత్తులను, మూలశ్లోకాలను జోడించి వివరించారు.

*- డా॥నొస్సం నరసింహాచార్య.*

బాలనీతి

# భగవంతుడా..! భక్తుడా...!!

- శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్, 98490 13002

భగవంతుడు దయాళువు. భక్తసులభుడు. పంచమ వేదమైన మహాభారతంలో భగవంతుడే స్వయంగా తాను యజ్ఞాలకి, యాగాలకి, పూజ, పునస్కారాలకి పొంగిపోనని, కాని అచంచలమైన భక్తికి లొంగిపోతానని తెలిపాడు. నిష్కళంకమైన భక్తికి భగవంతుడు దాసుడన్న ఉదంతాలు మనకి పురాణాలలో పుష్కలంగా లభిస్తాయి.

అంబరీషుడు మహాభక్తుడు. అతనిపై ఎవ్వరి శాపం కూడా పనిచేయనంతటి పుణ్యాత్ముడు. అతడు భూమండలాన్ని పాలిస్తున్నా, ఎంతో ఐశ్వర్యవంతుడైనా శ్రీహరియందు, భగవంతుడి సేవకులయందు ఎంతో భక్తిప్రపత్తులతో ఉండేవాడు. అతను ఏ మాత్రమూ గర్వం, అహంకారం లేక సర్వదా శ్రీహరి పాదపద్మములందే తన దృష్టిని నిలిపేవాడు. శ్రీహరి తన భక్తుడైన అంబరీషుని రక్షణగా సుదర్శనచక్రాన్ని నియమించాడు.

అంబరీషుడు ఒక కార్తిక శుక్లఏకాదశినాడు ఉపవాసముండి, ద్వాదశిగడియలు రాగానే, యమునానదిలో స్నానం చేసి, శ్రీమన్నారాయణుణ్ణి అర్చించాడు. తరువాత. భగవద్భక్తులని సేవించి, వారికీ భూరిదానాలిచ్చి, చక్కగా భోజనాలు పెట్టి, వారిని తృప్తిపరిచాడు.

ద్వాదశిభోజనానికి కూర్చోబోతుండగా దుర్వాసమహర్షి అతిథిగా వచ్చాడు. అంబరీషుడు ఆయనకి సకలమర్యాదలు చేసి, భోజనం చేయమని ప్రార్థించాడు. దుర్వాసుడు నదీస్నానం చేసి వస్తానని చెప్పాడు. దుర్వాసుడు అక్కడ జపంచేస్తూ చాలా సేపు ఉండిపోయాడు. అంబరీషుడు ఉపవాసం విరమించడానికి సమయం మించిపోతోంది. సమయంలోగా భోజనం చేయక



## భర్తృహరి సుభాషితాలు

**పాలు తమతో కలిసిన నీటికి ముందు తమ గుణాలన్నింటినీ సంక్రమింపజేశాయి. అలా తనకు సహాయపడిన పాలు కాచే సమయంలో తాపానికి గురికావటం చూచి సహించలేక నీరు అగ్నిలో ఆత్మాహుతి చేసికొన్నది (వేడికి ఆవిరిగా మారిందని భావం).**

**మిత్రమైన జలం ఇలా ఆపదపాలు కావటం చూచి క్షీరం నిప్పులో ఉరకడానికి సిద్ధమయింది (పొంగిందనుట). ఇంతలో మళ్లీ జలం తనతో కలిసే సరికి శాంతించింది. సజ్జనుల మైత్రి ఇలాగే ఉంటుంది.**

వ్యాఖ్యానం- **కీ.శే. డా॥సముద్రాల లక్ష్మణయ్య**

సవరణ: గతనెల డిసెంబరు మాసపత్రిక 41వ పుటలో 'ఋష్యశృంగమహర్షి' అనే వ్యాసంలో దశరథ మహారాజుకు నలుగురు భార్యలు అని పొరపాటుగా ముద్రితమైంది. పొరపాటుకు చింతిస్తున్నాం. ముగ్గురు భార్యలుగా చదువుకోగలరు. -ప్రధాన సంపాదకుడు.



అహంకారం, మొండితనం అనేవి మన పతనానికి హేతువులు

పోతే ఉపవాసఫలితం ఉండదు. అతిథికి భోజనం పెట్టకుండా భోజనం చేస్తే అది అపరాధమే. అప్పుడు అంబరీషునికి ఏమి చెయ్యాలో తోచలేదు. తనవద్ద ఉన్న పండితులని సంప్రదించాడు. అప్పుడు వాళ్ళు జలపానం చేస్తే ఉపవాసం ముగించినట్టు ఉంటుంది. అలాగే అతిథికి భోజనం పెట్టకుండా భోజనం చేసినట్టు అవదు అన్నారు.

అంబరీషుడు ఆ ప్రకారమే శ్రీహరిని ధ్యానించి, తులసి తీర్థాన్ని స్వీకరించి, దుర్వాసునిరాకకై ఎదురు చూస్తున్నాడు.

నదినుంచి వచ్చిన మునీశ్వరుణ్ణి ఆహ్వానించాడు. తన తపఃశక్తితో దుర్వాసుడు జరిగిందంతా తెలుసుకున్నాడు. తనకు అవమానం జరిగిందని భావించి కోపంతో ఊగిపోయాడు. జేవురించినముఖంతో తన సిగపాయని అంబరీషునిపై ప్రయోగించాడు. అది ప్రళయకాలాగ్నిగా మారి అంబరీషుని పైకి ఉరికింది. అంబరీషునికి రక్షణగా ఉన్న సుదర్శనచక్రం, ఆ కాలాగ్నిని నిర్మూలించి, దుర్వాసమునిని వెంబడించడం ప్రారంభించింది. దుర్వాసుడు ప్రాణభయంతో పరుగులు తీశాడు. చక్రం ఆయనని వెంబడిస్తూనే ఉంది. దుర్వాసుడు సత్యలోకానికి వెళ్ళి బ్రహ్మను శరణు వేడాడు. బ్రహ్మ తాను శ్రీహరి అధీనంలో ఉండడంచేత తానేమీ చెయ్యలేనని అన్నాడు. కైలాసానికి శరవేగంతో వెళ్ళిన దుర్వాసుడితో రుద్రుడుకూడా అలాగే అన్నాడు. కేవలం శ్రీహరి మాత్రం ఆయనని రక్షించగలడు అని చెప్పాడు. దుర్వాసుడు విష్ణుమూర్తిదగ్గరికెళ్ళాడు. దుర్వాసుడు, విష్ణుభక్తుడైన అంబరీషునకు, తను అపచారం చేసినందుకు తనకు తగినశాస్తి జరిగిందని, తనని రక్షించుమని విష్ణుమూర్తి పాదాలమీద పడి వేడుకున్నాడు.

అప్పుడు శ్రీహరి తాను భక్తపరాధీనుడననీ, అందువలన అస్వతంత్రుడననీ అన్నాడు. భక్తిలతలతో భక్తులు తనను బంధించివేస్తారని, తాను నిస్సహాయుడననీ చెప్పాడు. అంబరీషుడు మాత్రమే దుర్వాసుని రక్షించగలడు అని చెప్పాడు. దుర్వాసుడు పరుగున అంబరీషునివద్దకెళ్ళి, ఆయన పాదాలమీద పడి, ఆయన శరణు కోరాడు. అప్పుడు అంబరీషుడు తాను ఆరాధించే శ్రీహరి దుర్వాసుని రక్షించాలి అని ప్రార్థించాడు. తక్షణమే సుదర్శనచక్రం తరలి వెళ్లిపోయింది. భగవంతుని భక్తపరాధీనత అంత బలీయంగా ఉంటుంది మరి.

## నవంబరు నెల క్విజ్-28 సమాధానాలు

| | |
|---|---|
| 01) మైసూరుకు సమీపంలో | 09) చంద్రుడు |
| 02) విష్వక్సేనుడు | 10) పద్మసరోవరం |
| 03) దేవశర్మ | 11) పొయ్‌గై ఆళ్వారు |
| 04) ఉత్థాన ఏకాదశి | 12) నాలాయిర దివ్యప్రబంధం |
| 05) క్షీరాబ్ధి ద్వాదశి | 13) కుబ్జ |
| 06) పిళ్లైలోకాచార్యులు | 14) శ్రవణం |
| 07) అనసూయ | 15) శ్రీపరాశరభట్టర్ |
| 08) రాహుకేతువులు | |

సరైన సమాధానాలు వ్రాసినవారు-

01) వి.నిహారిక, రాజమహేంద్రవరం

02) టి.జైవీరవరుణ్, హైదరాబాద్

03) ఎన్. గౌతమ్‌మహేష్, తూర్పుగోదావరి.


పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....




నూతన ఆంగ్ల సంవత్సర

మరియు

సంక్రాంతి శుభాకాంక్షలు!



దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు
అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ
స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు




హరిభక్తులజోలికి వెళ్లకు. అలాచేస్తే భగవంతుడు కూడా కాపాడడని గుర్తుంచుకో

ఆయుర్వేదం

# ఆరోగ్యపరిరక్షణకు గుమ్మడి ద్వయం

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

సాధారణంగా మనకు రెండురకాల గుమ్మడికాయలు లభ్యమవుతాయి. అవి ఎర్రగుమ్మడి, బూడిదగుమ్మడి. జనవరి నెలలో విరివిగా లభించే ఈ గుమ్మడికాయలు ఇంచుమించు సంవత్సరంవరకు నిల్వఉంటాయి.

ఎర్రగుమ్మడినే తీపిగుమ్మడి, కూరగుమ్మడి అని కూడా అంటారు. ఆంగ్లంలో **Red Pumpkin** అంటారు.

సంక్రాంతిపండుగకి చాలాప్రాంతాల్లో ఈ ఎర్రగుమ్మడి కాయ తినటం అనాదిగా వస్తున్న ఆచారం. కొన్ని ప్రాంతాల్లో ఈ సందర్భంలో గుమ్మడికాయపులుసుకూడా చేసుకుంటారు.

2. బూడిదగుమ్మడిని ఆంగ్లంలో **Ash pumpkin, Ash gourd, White Pumpkin, Wax gourd, Winter malon** లాంటి పేర్లతో వ్యవహరిస్తారు. ఎర్రగుమ్మడికంటే ఈ బూడిదగుమ్మడికాయలే మార్కెట్లో పుష్కలంగా దొరుకుతాయి.

బూడిదగుమ్మడికాయలు గుమ్మానికి వ్రేలాడని తెలుగు వాకిళ్ళు బహు అరుదంటే అతిశయోక్తి కాదు.

బూడిదగుమ్మడిని వడియాలుగా చేసుకొని సేవిస్తారు. చిన్న, పెద్ద స్త్రీ పురుష తారతమ్యం లేకుండా అందరూ వాడుకోదగ్గ పోషకభరితఆహారం గుమ్మడికాయ.

గుమ్మడి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. నేత్ర వ్యాధులను దూరం చేస్తుంది. హృదయ, చర్మవ్యాధులనుంచి రక్షిస్తుంది.

మన దేహానికి అత్యంత ఆవశ్యకమైన మంచి బ్యాక్టీరియా బాగా వృద్ధిచెంది జీర్ణాశయవ్యాధులు, ఊబకాయం, హార్మోన్లఅస్తవ్యస్తత, మెదడు, గుండెజబ్బులు రాకుండా రక్షిస్తుంది.



ఎర్రగుమ్మడి, బూడిదగుమ్మడి రెండింటిలో ఆహార ఔషధగుణాలున్నప్పటికి ఔషధపరంగా బూడిదగుమ్మడినే అధికంగా ఉపయోగిస్తారు.

దైనందినజీవితంలో మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్యసమస్యలకు బూడిదగుమ్మడిని ఎలా వాడుకోవచ్చో ప్రస్తుతం తెలిసికుందాం.

**అధికవేడికి:** రోజూ ఒకసారి 200 మి.లీ. నీటిలో ఒక టీస్పూన్ గింజలని తొలగించిన గుమ్మడికాయ గుజ్జు, అరటీస్పూన్ తాటి కలకండ, అరటీస్పూన్ జీలకర్ర, పావుటీస్పూన్ నెయ్యి కలిపి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి చల్లార్చి వడగట్టి త్రాగుతుంటే కళ్ళు, కాళ్ళు, చేతులు, నాలుక, కడుపులో మంట, మలమూత్రవిసర్జన సమయంలో మంటలాంటి సమస్యలు తగ్గుతాయి.

**జ్ఞాపకశక్తికి:** ఎండిన గుమ్మడిగింజలు, బాదంపప్పులను విడిగా వేయించి సమానంగా కలిపి చూర్ణించి నిల్వ ఉంచుకుని రోజూ ఒకసారి 100మి.లీ. కాచినపాలలో ఒకటీస్పూన్ ఈ పొడి మరియు అరటీస్పూన్ బెల్లాన్ని కలిపి సేవిస్తుంటే మంచి ఫలితం కలుగుతుంది.

**కడుపు, ప్రేవుల్లో వ్రణాలు:** రోజూ ఉదయం, సాయంత్రం పూటకి ఒకటీస్పూన్‌గుజ్జును ఒకటీస్పూన్‌పెరుగులో కలిపి సేవిస్తుంటే త్వరగా ఫలితం కలుగుతుంది.

**శరీరబరువు పెరిగేందుకు:** ఒకపాత్రలో అరకిలో బెల్లంపొడి వేసి తగినన్నినీళ్ళు కలిపి పొంగు వచ్చేదాకా ఉడికించి పిదప విత్తనాలు తొలగించిన గుజ్జు 50గ్రాములు, 50గ్రాముల ఎండుద్రాక్షను 2, 3గంటలు నీటిలో నానించి చేసిన ద్రాక్ష గుజ్జు కలిపి ఉడికించి చివరగా పావుకిలో నెయ్యివేసి దించి చల్లారాక గాజుసీసాలో నిల్వ ఉంచుకుని రెండుపూటలా పూటకి అరటీస్పూన్‌నుంచి ఒకటీస్పూన్‌వరకు సేవిస్తుంటే ఆరోగ్యవంతమైన బరువు పెరుగుతారు.

**మానసికవత్తిడి, ఆందోళన తగ్గేందుకు:** రోజూ ఒకట్రెండుసార్లు 200మి.లీ.నీటిలో ఒక టీస్పూన్ బూడిదగుమ్మడిగుజ్జు, అరటీస్పూన్ తాటికలకండ వేసి 50మి.లీ.నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి 50మి.లీ. కాచినపాలు కలిపి సేవిస్తుంటే మనోవికారాలు తగ్గి మానసిక ధైర్యంకలుగుతుంది.

జనవరి, 2025

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** గతమాసంకంటె వృత్తివ్యాపారాల్లో అనుకూలత కల్గుతుంది. మీ సామాజికపరిధి గౌరవప్రదంగా విస్తరింపబడుతుంది. దూరప్రయాణాలు, ఖర్చులు తప్పవు. ఉదరరక్తసంబంధ అనారోగ్యమునకు చికిత్స అవసరమవుతుంది.



**వృషభం–** ఆర్థికపరంగా ఇబ్బందులు ఉండవు. విదేశీవీసాలు, ఇతర దేశప్రయాణాలు కలిసివస్తాయి. ధైర్యంతో కార్యసిద్ధి కల్గుతుంది. విద్యావికాసం కల్గుతుంది. రక్తపోటు నియంత్రణవిషయంలో శ్రద్ధ అవసరం. ధనం నిల్వచేస్తారు.



**మిథునం–** మీ ఆశయాలను, లక్ష్యాలను మననం చేసుకుని, అవరోధాలను అధిగమించి, సహనం మరియు శాంతస్వభావంతో అన్నింటిలోనూ విజయం సాధిస్తారు. వాహనచోదకులు ప్రయాణాలలో జాగ్రత్తగా ఉండాలి.



**కర్కాటకం–** ఆర్థికవిషయాల్లో శ్రద్ధ అవసరం. అనవసరఖర్చులు తగ్గించుకోవాలి. మీ ఉద్యోగ జీవితంలో సమస్యలు, కొంత మానసికఒత్తిడి, వాదనలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా గుండె మరియు పొట్టకు సంబంధించిన ఆరోగ్యసమస్యలు పెరుగుతాయి.



**సింహం–** విలాసాలను అనుభవిస్తారు. సమస్త కోరికలు నెరవేరుతాయి. సంపద, ఆస్తి కూడబెట్టుకునే అవకాశం ఉంది. ఆస్తి, పేరు, కీర్తి, మంచి ఆదాయం, కుటుంబంలో ఆనందం, మంచిఆరోగ్యం కల్గుతాయి.



**కన్య–** ఆరోగ్యం పట్ల నిరంతరభయం. మార్గావరోధాలను నిరోధించుటకు దూరప్రయాణాలు మానండి. అధికారులవలనగానీ లేదా ప్రభుత్వం నుండి గుర్తింపు లేదా ప్రతిఫలం వస్తుంది.



**తుల–** రావలసిన బాకీలు వసూలు అవుతాయి. సోదరవర్గంవారి అండదండలుంటాయి. ప్రణాళికలతో చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం చేస్తారు. పుత్రసంతానప్రాప్తి. కోర్టువిషయాలు అనుకూలం.



**వృశ్చికం–** న్యాయస్థానాలచుట్టూ తిరగడం, ధనవ్యయం, బంధనయోగం పొంచి ఉంది. తలనొప్పి, కంఠం సంబంధిత అనారోగ్య సూచనలు. నెలాఖరునుంచి సుబ్రహ్మణ్యఆరాధన, అభిషేకం ఉపశమనాన్నిస్తుంది.



**ధనుస్సు–** అధికారహోదా పెరగడం, ఖర్చులు అధికమవుతాయి. ఆరోగ్యం సామాన్యం. గృహమున శుభకార్యాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. వృత్తిపరంగా అనుకూలం.



**మకరం–** గతంనుంచి పేచీలతో సాగుతున్న వైవాహికబంధాలు ఒక కొలిక్కి వచ్చి విముక్తులవుతారు. సహనాన్ని అలవరచుకోవడం మంచిది.



**కుంభం–** పై అధికారులు మిమ్ములను ప్రశంసిస్తారు. పలుకుబడి, గుర్తింపు పొందుతారు. కుటుంబం మరియు స్నేహితులు మిమ్మల్ని గౌరవిస్తారు. సామాజికపరంగాకూడా ప్రశంసలు పొందుతారు. ఆరోగ్యం అనుకూలం.



**మీనం–** జీవితం ఉల్లాసంగా ఉంటుంది. సంతృప్తికరమైన ఆదాయాన్ని మరియు వృద్ధిని పొందుతారు. జీవితభాగస్వామితో మీ సంబంధంకూడా మధురంగా మరియు మృదువైనదిగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మీ సంకల్పశక్తిని పెంచుతుంది.

నీ అవసరాలకు మాత్రమే ఇతరుల వద్దకెళ్లడం కాదు. ఇతరుల అవసరాలను కూడా గుర్తించు

చిత్ర కథ

# సంక్రాంతి సంబరాలు

కథ-శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు
చిత్రాలు-శ్రీ కె.వి.కోటిలింగాచారి

పల్లెటూళ్ళు సందళ్ళు. కొత్తజంటలతో కలకలలాడుతున్న పల్లెలోగిళ్ళు. కన్నెపిల్లల కిలకిలారవాలు. అమ్మమ్మలతో మమేకమైన మనవరాళ్ళు.



అమ్మమ్మా! ఎందుకమ్మా! అక్కడ పెద్దపెద్దముగ్గులేశారు. అందులో పేడముద్దలు పెట్టారేంటి?

చిట్టితల్లీ! అవి పేడముద్దలు కావమ్మా! దేవతలు కొలువైఉన్న గొబ్బిదేవతలవి. వాకిలిముందు ముగ్గువేస్తే లక్ష్మీదేవి ఇంట స్థిరనివాసం ఉంటుందని నమ్మకం



అందరూ గుమ్మాలకు అవేవో పూలు కట్టారేంటి అమ్మమ్మా?

ఓసి పిచ్చితల్లీ! అవి బంతిపూలు. సంక్రాంతివేళల్లో గుమ్మాలకు తోరణాలుగా కడతారు. ముగ్గు, పేడ, పూలల్లో శ్రీమహాలక్ష్మీదేవి కొలువై ఉంటుంది.



అమ్మమ్మా! ఎద్దులు బట్టలు కప్పుకొని ఆడుతున్నాయి ఏంటమ్మమ్మా!

బుజ్జితల్లీ! అవి గంగిరెద్దులు.



అమ్మమ్మా! పొద్దునెవరో పాటలు పాడుతూ చాలామందొచ్చారు. ఇప్పుడేమో చాలా గంగిరెద్దులొచ్చాయి.




అవునమ్మా! బంగారుతల్లీ! సంక్రాంతి మూడురోజుల పెద్దపండుగ, పెద్దలపండుగ. అన్నిరకాల పంటలుపండి రైతులఇళ్ళకొస్తాయి.




గంగిరెద్దులవాళ్ళు, హరిదాసులు, బుడబుక్కలవాళ్ళు, జంగందేవర్లు వీళ్ళంతా ఒక్క సంక్రాంతికే వస్తారు సుమా!



PURNA
7.12.24
అప్పుడే రైతులు సంతోషంతో వీరందరికి ధాన్యమిస్తారు. హరిదాసులకు చేసే దానంతో శ్రీహరి ఆనందిస్తారని పెద్దలు చెబుతారు.
ఎందుకమ్మమ్మా! పొద్దున్నే మంటలేశావు?
అవి భోగిమంటలు తల్లీ! భోగిపండుగరోజునే వెయ్యాలి. ఈ రోజు తలంట్లు పోసుకోవాలి. తర్వాత కొత్తబట్టలు ధరించాలి. పాతవస్తువుల్ని, చెడ్డగుణాల్ని మంటల్లో కాల్చి వేయాలని అంతరార్థం.
సాయంత్రం సందెగొబ్బెమ్మలు పెట్టాలి. కన్నెపడుచులంతా వాటిచుట్టూ తిరుగుతూ పాటలుపాడుతూ నాట్యం చేస్తారు. గొబ్బెమ్మ మంగళగౌరీదేవి రూపం.
తర్వాత పిల్లలందరికి భోగిపళ్ళు పోస్తాం. రేగిపళ్లు, శెనగలు, పూలు, నాణేలు కలిపి పోసి ఆశీర్వదిస్తారు. ఈ ఆశీస్సులు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఆశీస్సులు అమ్మా..!
సంక్రాంతిరోజు బ్రాహ్మణులను పిలిచి వారికి గుమ్మడిపండును దానం చేస్తాం.
'సంక్రాంతి' చివరి రోజున కనుమపండుగ. పాడిపంటలకు పశువులు ఆధారం. పశువులను ఈ రోజు పూజిస్తాం. దీన్నే పశువుల పండుగ అంటాం తల్లీ!
ఓహో! అలాగా! చాలా బాగుంది అమ్మమ్మా ఎంతో సంబరంగా ఉంది ఈ సంక్రాంతి పండుగ.
సర్వేజనాః సుఖినో భవన్తు

## గొబ్బిళ్ళు పాడుదాం రండి! రారండి!!



కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికిని గొబ్బిళ్ళో

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో


పాపవిధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికిని గొబ్బిళ్ళో
ఏపున కంసుని యిడుమలబెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో



దండి వైరులను తటిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండిపైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో

## దారికనుక్కోండి చూద్దాం!!






ఇక్కడున్న ఇద్దరు చిన్నారులు ఆ పల్లెటూళ్లో గంగిరెద్దుల పోటీ చూడ్డానికి వెళ్లాలంట... వారికి దారి చూపండి మరి!



## రంగులు వేద్దాం..!!



పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి





## దిక్కులు

తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం అనేవి నాల్గుదిక్కులు. ఆగ్నేయం, నైఋతి, వాయువ్యం, ఈశాన్యం అనేవి నాల్గు మూలలు లేక నాల్గుదిక్కులు అని పేరు. ఇవన్నీ కలిపి అష్టదిక్కు లని పిలుస్తారు. ఈ దిక్కులకు అధిపతి దేవతలున్నారు. వారి చిత్రాలు క్రింద ఇవ్వబడ్డాయి. వారెవరో తెలుసుకుని ఆయా చిత్రాలకు ఎదురుగా ఉన్న ఖాళీల్లో వ్రాయండి...

1) తూర్పుదిక్కు  1) ......................................

2) పడమరదిక్కు  2) ......................................

3) ఉత్తరదిక్కు  3) ......................................

4) దక్షిణదిక్కు  4) ......................................

5) ఆగ్నేయదిక్కు  5) ......................................

6) నైఋతిదిక్కు  6) ......................................

7) వాయువ్యదిక్కు  7) ......................................

8) ఈశాన్యదిక్కు  8) ......................................

**జవాబులు:** 01)ఇంద్రదేవుడు 02)వరుణదేవుడు 03)కుబేరదేవుడు 04)యమదేవుడు 05)అగ్నిదేవుడు 06)నిర్ృతిదేవుడు 07)వాయుదేవుడు 08)పరమశివుడు

## నాణేలు

తిరుమలస్వామికి ఎందరో విజయనగరరాజులు స్వామిహుండీలో కానుకలుగా బంగారు నాణేలను సమర్పించుకున్నారు. వారు ముద్రించిన నాణేలు క్రింద చూపబడ్డాయి. ఆ రాజులపేర్లు తెలుసుకుని ఖాళీల్లో పూరించండి.

 1) ......................................

 2) ......................................

 3) ......................................

 4) ......................................

 5) ......................................

 6) ......................................

 7) ......................................

 8) ......................................

గ్రంథం: తిరుమల శ్రీవేంకటేశుని హుండీలో బంగారునాణేలు

**జవాబులు:** 1)మొదటి హరిహరరాయలు 2)రెండవ హరిహరరాయలు 3)మొదటి దేవరాయలు 4)రెండవ దేవరాయలు 5)శ్రీకృష్ణదేవరాయలు 6)అచ్యుతరాయలు 7)సదాశివరాయలు 8)మూడవ వెంకటపతిరాయలు

పద్యనీతి

# మాండవ్యుడు


– శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర, 63005 46700

**చిలిపితనమె చాలు జీవనమ్ము చెరుప**
**చిన్నదోమ తెచ్చు పెద్దజబ్బు**
**చిన్న పెద్దయంచు 'చెడు' అన్నదానికి**
**కొలత లేలనయ్య తెలుగుబిడ్డ! (నార్ల చిరంజీవి)**

మన భారతీయసంస్కృతి హిందూధర్మసంస్కృతి. నేటి యువత సనాతనధర్మంతో మసలుకోవాలి అన్నది నగ్నసత్యం.

చిన్ననాట తెలియక చేసిన తప్పులు పెద్దయ్యాక ఎలా పీడిస్తాయో మనకు మాండవ్యుడికథద్వారా తెలుస్తుంది. మాండవ్యుడు మహాముని. ఐతే తన చిన్ననాట తాను తెలిసీ తెలియక చేసిన తప్పుకు పెద్దయ్యాక అందుకు తీరనిశిక్ష అనుభవించాడు.

అదేమిటో పరిశీలిస్తే, మాండవ్యుడు చిన్ననాట తూనీగలతో ఆటలు ఆడుకునేవాడు. ఆటలు ఆడుకుంటే ఫరవాలేదు. వాటిని పట్టుకుని వాటి అడుగుభాగంలో ముళ్లను



గుచ్చేవాడు.దానిని పైశాచిక ఆనందం అంటారు. అలా అలా వాటిని హింసించి ఆనందించేవాడు.

మంచిఅలవాట్లు మనిషిని కాపాడుతాయి అనే విషయం తాను మరిచాడు. యువతభావాలుకూడా ఆధ్యాత్మికతతో ఉండాలి. మూగజీవాలపట్ల కాస్త జాలి, భూతదయ కలిగి ఉండాలి. అవి చిన్ననాటినుండే అలవడాలి.

ఒకసారి కొందరు దొంగలు రాజుగారి ఆస్థానంలో విలువైన ఆభరణాలు దొంగిలించి పారిపోయారు. వాళ్ళు అటు వైపుగా వచ్చి రాజభటులబారినుండి తప్పించుకోవాలని అక్కడ తపస్సు చేసుకుంటున్న మాండవ్యుడిఆశ్రమంలో రహస్యంగా దాక్కున్నారు. దొంగలను వెతుక్కుంటూ రాజభటులు అక్కడికి వచ్చి దొంగలు ఇటువైపు వచ్చారా! అని అడిగారు మునిని. కానీ ముని మాత్రం తపస్సు చేసుకొంటూ మౌనంగా ఉన్నాడు. ఏమీ పలకడం లేదు. దొంగలకు అతనికి ఏదో సంబంధం ఉందని భావించి అతణ్ణి రాజుగారి కొలువుకు తీసికెళ్లారు. మునిలా నటిస్తున్నావు. ఈ దొంగలకు ఆశ్రయం ఎందుకు ఇచ్చావు? అంటూ కోపంగా అడిగాడు మహారాజు. ఐనా కూడా ఆ ముని పలకలేదు. మౌనంగా ఉండడంతో మహా రాజుకు అమితకోపం వచ్చింది. వెంటనే మండిపడి వీడికి కొరత శిక్ష వేయండి అంటూ శిక్ష అమలుపరిచాడు. వెంటనే రాజుగారి ఆజ్ఞని అనుసరించి శిక్ష అమలుచేసేశారు. ఒక ఇనుపచువ్వ వేసి దానిపై ఆ మునిని కూర్చోబెట్టారు. అలా మాండవ్యుడికి కొరతశిక్ష వేశారు. మహాముని గనుక తన తపశ్శక్తితో అలాగే మౌనంగా ఉండిపోయాడు. ఆ తర్వాత తనకు ఇంతటి శిక్ష ఎందుకు విధించారు అని యమధర్మరాజుని అడిగాడు మాండవ్యుడు. తన చిన్ననాట తూనీగలను ముళ్ళు గుచ్చి ఆడుకునే సంఘటన గుర్తుచేశాడు యముడు. అది విని మాండవ్యుడు అది బాల్యం, పైగా తెలిసీ తెలియనివయసుకు అంత శిక్ష విధించడం నీకు న్యాయమా? అని యమధర్మరాజుని ప్రశ్నించి, ఆగ్రహించి, నీవు దాసిగర్భంలో జన్మించు అంటూ శాపం పెట్టాడు. ఆ శాపంతోనే యముడు విదురుడుగా జన్మించాడు.

ఏది ఏమైనా మానవధర్మం మరువరాదు. నేటి యువత బాధ్యతతో మసలుకోవాలి. పశుపక్ష్యాదులపట్ల కాస్త భూతదయ కలిగి ఉండాలి. అహంకారం విడనాడాలి అని మనకు ఈ గాథ తెలియజేస్తోంది.

# క్విజ్ 30

01) వైకుంఠఏకాదశికి మరోపేరు? జ)...............

02) 'భోగి'కి సంస్కృతపదం? జ)...............

03) కలియుగంనందు గొప్ప భక్తిసాధనం? జ)...............

04) 'వారణమాయిరం'నకు అర్థం? జ)...............

05) లెక్కల్లో జ్ఞానాన్ని పెంచేవి? జ)...............

06) ఉత్తరాయణపుణ్యకాలప్రారంభదినం? జ)...............

07) మకరరాశ్యాధిపతి? జ)...............

08) 'కోదై'కు అర్థం? జ)...............

09) 'ఆముక్తమాల్యద' గ్రంథకర్త? జ)...............

10) దుష్టశిక్షణకోసం 'గంగిరెద్దుల' వాని వేషధారి? జ)...............

11) గొప్ప 'శివభక్తుడు'? జ)...............

12) ఇక్ష్వాకువంశపు మహారాజు? జ)...............

13) 'వారణాసి'కే మరోపేరు? జ)...............

14) 'చ్యవనమహర్షి' భార్యపేరు? జ)...............

15) తపోధనులకు ఆలంబన? జ)...............

16) వైకుంఠద్వారపాలకులు? జ)...............

17) కర్ణాటక సంగీత పితామహుడు? జ)...............

18) హరినామసంకీర్తనాపరులు? జ)...............

19) మాండవ్యుడి శాపానికి గురైనవారు? జ)...............

20) 'ఉత్తరదిక్కు'కు అధిపతి? జ)...............

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-01-2025.**

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ............... వయస్సు: ...............

పాఠశాల: ............... తరగతి: ...............

పేరు: ...............

చిరునామా: ...............

...............

...............

............... పిన్‌కోడ్: ...............

ఫోన్ సంఖ్య: ...............

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

................................................................ తేది : ....................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 108




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)ఉత్తరద్వారదర్శనం జరిగేరోజు(7); 5)పుష్యబహుళ అమావాస్యకు గల మరియొకపేరు(3); 6)మరీచి భార్య(2); 8)ముత్యాలహారము(4); 10)లక్ష్మీనారాయణుల కొడుకు(4); 11)ఈరోజునుండి ఉత్తరాయణపుణ్యకాలం ప్రారంభం(7); 13)సంక్రాంతిపండుగ ఈ తెలుగుమాసంలో వస్తుంది(2); 16)నిషధునినగరము(7); 18)రావిచెట్టుతోపాటు ఈ చెట్టుకూడా కలసిఉంటే ప్రజలు పూజిస్తారు(2); 20)శివుడు(7)

**నిలువు** 1)సంక్రాంతి తర్వాత ఈ రోజున ఎవ్వరూ ప్రయాణం చేయరు(4); 2)రభ్యుడనురాజుకుమార్తె(4); 3)10 సంఖ్యను ఇలాకూడా అంటారు(2); 4)గోదారంగనాథుల కల్యాణం ఈ పండుగరోజున జరుగుతుంది(5); 7)"విశ్వదాభిరామవినుర వేమ"–ఈ మకుటం రాసినకవి(3); 9)ఈ రోజు పశువులపండుగ(3); 12)బలిచక్రవర్తికుమార్తె(4); 14)లంకానగరానికి వెడుతున్న హనుమంతునికి అడ్డంవచ్చిన నాగమాత(3); 15)ఈ నగరంలో తి.తి.దే. వారి సప్తగిరి మాసపత్రిక కార్యాలయం ఉంది(4); 17)యాత్రికుడు(4); 19)కుమారస్వామి(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు




Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవన మైదానప్రాంగణంలో నవంబరు 18, 2024న వేడుకగా జరిగిన కార్తికమహాదీపోత్సవవైభవం. అందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., ఇతర ప్రముఖులు మరియు అధికారులు, అశేషభక్తజనం.



తిరుమలలో 2024, డిసెంబరు 03న శ్రీవారి దర్శన క్యూలైన్లను పరిశీలించి భక్తులతో మాట్లాడుతున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ బి.ఆర్.నాయుడు మరియు పాలకమండలి సభ్యులు గౌ॥ శ్రీ.జి.భానుప్రకాష్‌రెడ్డి.



తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం-3లో కేంద్రీయలాకర్ కేటాయింపు కౌంటర్‌కు 2024, నవంబరు 22న ప్రారంభోత్సవం చేసిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.




2024, సెప్టెంబరు 29న తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనాభవనంలో జరిగిన ప్రపంచ బధిరుల దినోత్సవం మరియు ప్రపంచ సంకేతభాష దినోత్సవం వేడుక కార్యక్రమం



64వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా తి.తి.దే. వారిచే ఏర్పాటు చేయబడిన సభలో ప్రసంగిస్తున్న వక్తలు మరియు ఆ సమావేశానికి హాజరైన ఉద్యోగులు

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY  Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-12-2024 and Posting at Tirupati RMS. Regd.  with the Registrar of Newspapers for  India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026  "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026"  Posting on 5th of Every Month.



ఈశానాం జగతోఽస్య వేంకటపతేర్విష్ణోఃపరాం ప్రేయసీం
తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్‌క్షాంతి సంవర్ధినీమ్।
పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్॥